అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సోమవారం 19-2-2018
సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 4 సంచిక : 52 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

10లో
ఇంటి దొంగలు
- చేతివాటం ప్రదర్శిస్తున్న బ్యాంకు అధికారులు
- 1538 మంది అధికారులతో ఎస్‌బీఐ టాప్: ఆర్బీఐ విశ్లేషణలో బయటపడ్డ నిజాలు



10లో
కార్పొరేట్లకు రుణ మాఫీ
- ఐదున్నరేండ్లలో రూ.3.68 లక్షల కోట్లు
- ఇందులో ప్రభుత్వ బ్యాంకుల వాటానే అత్యధికం
- ప్రతీ ఏటా పెరుగుతున్న 'రైట్ ఆఫ్'ధోరణి



2లో
బిజినెస్ ప్రారంభించాలంటే భర్త అనుమతి అక్కర్లేదు...
- సౌదీ అరేబియాలో సంస్కరణలు



10లో
టెలికాం కంపెనీల మధ్య స్మార్ట్ వార్
- రూ.2700 స్మార్ట్ ఫోన్.. రూ.500లకే



నిన్న నీరవ్‌మోడీ..
నేడు విక్రమ్ కొఠారి..!
బ్యాంకులకు రూ.800 కోట్ల ఎగవేత..!!

- రొటొమాక్ పెన్నుల కంపెనీ అధినేత పరార్..!!!


ఫైల్

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకులను బడాబాబులు కావాల్సినంతగా దండుకున్నారన్న కఠోరవాస్తవాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇటీవల జరిగిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ భారీ కుంభకోణం మరవకముందే అచ్చం అలాంటి మరో మోసం వెలుగు చూసింది. పీఎన్‌బీకి చెందిన ముంబయి శాఖను రూ.11,400 కోట్లకు ముంచిన వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ ఆ కుంభకోణం బయటపడేలోగా విదేశాలకు చెక్కేసిన విషయం తెలిసిందే. తాజాగా పలు ప్రభుత్వరంగ బ్యాంకులను వందల కోట్లకు ముంచిన మరో కుంభకోణం బయటపడింది. ప్రముఖ రొటొమాక్ పెన్నుల కంపెనీ మాతృసంస్థ దేశంలోని పలు బ్యాంకుల్లో రూ.800 కోట్ల రుణాలు తీసుకొని ఎగనామం పెట్టినట్టు తెలిసింది. రొటొమాక్ కంపెనీ యజమాని అయిన విక్రమ్ కొఠారి ఐదు బ్యాంకుల్లో రూ.800 కోట్లకుపైగా రుణాలు తీసుకున్నాడని అధికారవర్గాలు చెబుతున్నాయి. అలహాబాద్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులు పలు నియమాలను ఉల్లంఘించి కొఠారీకి అప్పులు ఇచ్చాయని విశ్వసనీయంగా తెలిసింది. యూనియన్ బ్యాంకు నుంచి రూ.485 కోట్లు, అలహాబాద్ బ్యాంక్ నుంచి రూ.352 కోట్ల కొఠారి రుణం తీసుకున్నారు. అయితే, ఆయన ఇప్పటివరకూ అసలు కానీ, వడ్డీని కానీ బ్యాంకులకు తిరిగి చెల్లించలేదని ఆయా బ్యాంకు అధికారులు చెబుతున్నారు. కాన్పూరులోని సిటీ సెంటర్ రోడ్డులోని కొఠారి కార్యాలయానికి కొన్ని వారాలుగా తాళం వేసి ఉన్నది. ఆయన కనిపించకపోవడంతో విదేశాలకు పరారై ఉంటాడన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ ఘటనపై అలహాబాద్ బ్యాంకు మేనేజర్ రాజేశ్‌గుప్తా స్పందిస్తూ.. కొఠారి ఆస్తులు అమ్మైనా సొమ్మును రికవరీ చేస్తామని తెలిపారు. ఈ ఘటన ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేపుతోంది. ఇప్పుడు ఈ రొటొమాక్ కుంభకోణంపై బ్యాంక్ వర్గాలు, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఏవిధంగా స్పందిస్తాయో చూడాలి.

గులాబీలో గుబులు
కాంగ్రెస్, కోదండరామ్, వామపక్షాలపై ఓట్ల సర్వే
- ఎమ్మెల్యేల పనితీరుపై అభిప్రాయసేకరణ
- ప్రజల్లో వ్యతిరేకత ఉన్న వారికి చెక్...


ఫైల్



వివరాలు 9లో

సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో టీఆర్‌ఎస్‌కు ఎన్నికల గుబులు పట్టుకుంది. రాష్ట్రంలో తమకు ప్రత్యామ్నాయమే లేదన్న ధీమాతో ఉన్న ఆ పార్టీకి బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) ఆవిర్భావం, త్వరలో ఆవిర్భావించనున్న కోదండరామ్ పార్టీ, వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీల పరిస్థితి, ఆయా పార్టీల బలాబలాలు, వారికి పక్కా ఓట్లు ఎక్కడ పడనున్నాయి అనే అంశాలపై ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఓట్ల సర్వేకు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభావం ఈమేరకు ఉంటుందన్న అంశాలపై సర్వే నిర్వహిస్తున్నది. పక్క పార్టీల స్థితిగతులపై ఒకవైపు సర్వే నిర్వహిస్తూనే...సొంత పార్టీ ఎమ్మెల్యేల పనితీరు, వారి పట్ల ప్రజల్లో ఉన్న అనుకూల, ప్రతికూల అంశాలపై కూడా సర్వేలో ప్రత్యేక దృష్టి సారించింది.

స్కూల్ ఫీజు కట్టలేదని.. గదిలో బంధించి..
- విద్యార్థులపై స్కూల్ యాజమాన్యం కర్కశం
- ఛత్తీస్‌గఢ్‌లో ఘటన

వివరాలు 2లో

మేడారంలో నిలువు దోపిడీ
- పారిశుద్ధ్య కార్మికులను మోసగిస్తున్న కాంట్రాక్టర్
- రోజుకు ఇస్తామన్నది రూ.450..ఇస్తున్నది రూ.350 లేదా రూ.300

వివరాలు 3లో


మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

ఏప్రిల్ 20

పెట్టుబడి పథకం
నవంబర్ 18 నుంచి యాసంగి పెట్టుబడి
- ఈనెల 25,26న రైతు సమితుల ప్రాంతీయ సదస్సులు
- సబ్సిడీకి నాటు యంత్రాలు
- వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్: సీఎం కేసీఆర్

వివరాలు 9లో

ప్రశాంతంగా త్రిపుర ఎన్నికలు
- 74 శాతం పోలింగ్ నమోదు
- మొరాయించిన ఈవీఎంలు


సీఎం మాణిక్ సర్కార్

వివరాలు 9లో

ఇరాన్‌లో కూలిన విమానం
66 మంది మృతి
- టేకాఫ్ అయిన కొద్దిసేపటికే...
- టెహ్రాన్ నుంచి యసూజ్ నగరానికి బయల్దేరిన ఏటీఆర్-72



టెహ్రాన్: ఇరాన్‌లో ఏస్‌మ్యాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ప్రయాణికుల విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో విమానంలో ఉన్న 66 మంది మృతి చెందారు. వీరిలో ఆరుగురు విమాన సిబ్బంది కూడా ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. విమానంలో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా కూలిపోయి ఉంటుందని అధికారులు ప్రాథమిక అంచనాకొచ్చారు. విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...ఏస్‌మ్యాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఏటీఆర్-72 అనే రెండు ఇంజిన్లు కలిగిన విమానం రాజధాని టెహ్రాన్ నుంచి యసూజ్ పట్టణానికి బయల్దేరిన క్రమంలో ఆదివారం ప్రమాదానికి గురైంది. ఏటీఆర్-72 టేకాఫ్ అయిన కొద్ది సేపటికే రాడార్‌తో ఉన్న సంబంధాలు తెగిపోయాయి. దీంతో, గల్లంతైన విమానం కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అనంతరం పర్వతీయ ప్రాంతంలో ఈ విమానం కూలిపోయినట్టు గుర్తించాయి. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న వారందరూ మరణించారని విమానాశ్రయ అధికారులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న సహాయక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కొండ ప్రాంతంలో విమానం కుప్పకూలిపోవడంతో సహాయక 9లో



హైదరాబాద్‌లో మరో నిర్భయ
- బాలికపై లైంగిక దాడి
- నిందితులను గుర్తించని పోలీసులు
- ఆలస్యంగా వెలుగులోకొచ్చిన ఘటన

వివరాలు 9లో



ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు
- ఇద్దరు జవాన్లతో పాటు మేనేజర్ మృతి
- మరో ఆరుగురు జవాన్లకు తీవ్ర గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం.. 12 వాహనాలకు నిప్పు



వివరాలు 9లో



టీఆర్‌ఎస్‌కు దళిత మహిళా కార్పొరేటర్ రాజీనామా
- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల వేధింపులతోనే..
- అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని ఆవేదన
- తన భర్తపై కేసులు పెట్టారంటూ వెల్లడి

నవతెలంగాణ- కరీంనగర్ టౌన్

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వేధిస్తున్నాడని 12వ డివిజన్ దళిత మహిళా కార్పొరేటర్ మెండి శ్రీలత తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం పట్టణంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాజీనామాకు సంబంధించిన విషయాలు వెల్లడించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అభివృద్ధికి సహకరించకుండా మహిళా కార్పొరేటర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గతంలోనూ 30వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ ఎమ్మెల్యే వేధింపుల కారణంగా పార్టీ, కార్పొరేటర్ పదవికి రాజీనామా చేసినట్టు గుర్తు చేశారు. దళిత కార్పొరేటర్ అన్న చిన్నచూపుతో అనేక సందర్భాల్లో తన పట్ల వివక్ష చూపినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. భూ కొనుగోలు విషయంలో జీవన్ చందన్‌పై ఒత్తిడి తీసుకొచ్చి తన భర్తపై అకారణంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారని అన్నారు. తనకుగానీ, తన 9లో



బంగారు తెలంగాణ ఏమో గానీ.. బార్ల తెలంగాణ అతి త్వరలో అయ్యేట్టుందిరా..!!



మోడీని నిలదీద్దాం..
జులైలో ఢిల్లీకి భారీగా కదిలిరండి

- ఐసీడీఎస్ నిర్వీర్య కుట్రలను తిప్పికొడదాం : ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ప్రధాన కార్యదర్శి ఎ.ఆర్. సింధు పిలుపు
- అంగన్‌వాడీల హక్కుల కోసం తిరగబడే వీరనారీమణులు : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు
- నిజామాబాద్‌లో యూనియన్ రాష్ట్ర ద్వితీయ మహాసభలు ప్రారంభం

వివరాలు 9లో



నిజామాబాద్‌లో..

తగ్గిన ఉద్యోగాలు

2017-18 మొదటి త్రైమాసంలో..సంఘటిత రంగం అస్తవ్యస్తం

- తయారీ రంగంలో 87,000, రవాణా రంగంలో 3,000 ఉద్యోగాలకు కోత : లేబర్‌బ్యూరో నివేదిక



న్యూఢిల్లీ: ప్రధాని మోడీ తీసుకున్న పెద్ద నోట్లరద్దు నిర్ణయం సంఘటిత రంగంపైనా తీవ్ర ప్రభావం చూపినట్టు అధికారిక గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. దేశంలోని 80 శాతం ప్రయివేట్ ఉద్యోగాలను కల్పిస్తున్న సంఘటిత రంగంలో 2017 ఏప్రిల్-జూన్ త్రైమాసంలో నూతన ఉద్యోగాల సృష్టి బాగా నెమ్మదించినట్టు లేబర్‌బ్యూరో నివేదిక వెల్లడించింది. ఈ త్రైమాసంలో మొత్తమ్మీద 64,000 కొత్త ఉద్యోగాల కల్పన జరిగినట్టు నివేదిక పేర్కొన్నది. ఇది అంతకుముందు త్రైమాసం(జనవరి-మార్చి)కన్నా 65 శాతం తక్కువ. జనవరి-మార్చిలో 1,85,000 నూతన ఉద్యోగాల సృష్టి జరిగింది. 2016 ఏప్రిల్-జూన్‌తో పోల్చినా ఉద్యోగాల కల్పన తక్కువే కావడం గమనార్హం. 2016లో ఇదే కాలానికి 77,000 నూతన ఉద్యోగాల కల్పన జరిగింది. సంఘటిత రంగంలో 81 శాతం వాటా ఉన్న 8 రంగాల్లో లేబర్ బ్యూరో నివేదిక ఇచ్చింది. ఈ 8 రంగాల్లో ప్రతి కంపెనీ కనిష్టంగా కనీసం 10మందికైనా ఉద్యోగాలు కల్పిస్తాయి.

గతేడాది ఏప్రిల్-జూన్‌లో ఎక్కువగా నష్టపోయింది తయారీ రంగమేనని నివేదిక తెలిపింది. ఈ కాలంలో ఈ రంగం కొత్తగా ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగుల్లోనే 87000మందికి ఉద్వాసన పలికింది. అంతకుముందు త్రైమాసం (జనవరి-మార్చి)లో ఈ రంగం 1,02,000 నూతన ఉద్యోగాలు కల్పించింది. ఏప్రిల్-జూన్‌లో రవాణా రంగంలో 3000 ఉద్యోగాలకు కోత పడగా, అంతకుముందు త్రైమాసంలో 3000 ఉద్యోగాలు కల్పించింది. ఏప్రిల్-జూన్‌లో వాణిజ్యం,ఐటీ-బీపీవో రంగాల్లోనూ ఉద్యోగాల కల్పన నెమ్మదించింది.

ఇదే కాలంలో కాంట్రాక్ట్ ఉద్యోగాల కల్పన, దినసరి కార్మికుల ఉపాధి కూడా బాగా దెబ్బతిన్నట్టు అధికారిక అంచనా. 64,000 కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఈ కాలంలో కోత పడింది.

ఇదే త్రైమాసంలో 2016లో కోత పడిన 48,000కన్నా ఇది అధికం. కాంట్రాక్ట్, దినసరి,కాజువల్ కార్మికులు ఎక్కువగా ఉపాధి కోల్పోయింది కూడా తయారీ రంగంలోనేనని లేబర్‌బ్యూరో తెలిపింది. సాంకేతికంగా వచ్చిన మార్పుల వల్ల నైపుణ్య కార్మికుల అవసరం పెరుగుతున్నదని.. దాంతో, స్వల్ప నైపుణ్య కార్మికులు ఉపాధి కోల్పోతున్నారంటూ కేంద్ర గణాంకశాఖ మాజీ చీఫ్, ఇంటర్నేషనల్ గ్రోత్ సెంటర్(ఐజీసీ) డైరెక్టర్ ప్రొనబ్‌సేన్ విశ్లేషించారు.

రజినీని కలిసిన కమల్

చెన్నై: త్వరలో పార్టీ పెట్టబోతున్న తమిళ విలక్షణ నటుడు కమల్‌హాసన్ సూపర్‌స్టార్ రజినీకాంత్‌ని కలిశారు. పోయెస్‌గార్డెన్‌లోని రజినీ నివాసంలో వీరిరువురు ఆదివారం సమావేశమయ్యారు. దాదాపు పదిహేను నిమిషాల సేపు సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమల్ మాట్లాడుతూ... రజినీని మర్యాదపూర్వకంగానే కలిశానని చెప్పారు. ఇద్దరి మధ్య రాజకీయాంశాలేమీ చర్చలోకి రాలేదన్నారు. రజినీతో కలిసి పనిచేస్తారా అనే ప్రశ్నకు ఎప్పటిలాగే సమాధానమిస్తూ.. దానిని కాలమే నిర్ణయిస్తుందన్నారు. ఈ నెల 21న మధురైలో కమల్ ప్రకటించనున్న పార్టీ ప్రారంభోత్సవానికి రావాలని రజినీని ఆహ్వానించానన్నారు. రజినీకాంత్ మాట్లాడుతూ.. డబ్బు, పేరు, అధికారం కోసం కమల్ రాజకీయాల్లోకి రావడం లేదని, కేవలం ప్రజలకు సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో వస్తున్నారన్నారు. ఆయన విజయవంతమవ్వాలని రజినీ ఆకాంక్షించారు. ఇదిలా ఉంటే రజినీ, కమల్‌లు వేర్వేరుగా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేయడం గమనార్హం.

స్కూల్ ఫీజు కట్టలేదని..గదిలో బంధించి...

- విద్యార్థులపై స్కూల్ యాజమాన్యం కర్కశం
- ఛత్తీస్‌గఢ్‌లో ఘటన

రాయ్‌పూర్: ప్రయివేటు స్కూళ్ల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఫీజు కట్టలేదని విద్యార్థులను స్కూల్లోని స్టోర్ రూమ్‌లో బంధించిన ఘటన ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకుంది. రాయ్‌పూర్‌లోని సంజయ్ పబ్లిక్ స్కూల్లో ప్రాథమిక తరగతికి చెందిన ఆరుగురు విద్యార్థులను మూడు రోజులపాటు స్టోర్ రూమ్‌లో బంధించారు. ముందస్తు ఫీజు చెల్లించలేదని పరీక్షలకు అనుమతించలేదు. పిల్లలు ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు స్కూల్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సంబంధిత అధికారులు స్కూల్ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజు కట్టడం ఆలస్యమైనందున తన కొడుకుతో పాటు మరికొంత మంది పిల్లలను అవమానించారని ఓ బాధిత విద్యార్థి తండ్రి విజయ్ రాజ్ తెలిపారు. డిసెంబర్ వరకు ఫీజు చెలించామని కానీ ఏప్రిల్ నెలదాక ముందస్తు ఫీజు కట్టాలని స్కూల్ యాజమాన్యం ఒత్తిడి చేసిందని ఆయన అన్నారు. సమాచారమందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. విద్యార్థులను పరీక్షలు రాయడానికి అనుమతించాలని జిల్లా సబ్‌డివిజినల్ మేజిస్ట్రేట్ అధికారులను ఆదేశించారు. అలాగే బాలల హక్కుల రక్షణ కమిషన్ చైర్‌పర్సన్ ప్రభా దూబే స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులు డీడీ నగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

లబ్ధి పొందాలంటే కాంగ్రెస్‌కు ఓటేయెుద్దు

మధ్యప్రదేశ్ మంత్రి ఓటు రాజకీయం



న్యూఢిల్లీ: ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్ పొందాలంటే కాంగ్రెస్‌కు ఓటెయెుద్దని మధ్యప్రదేశ్ మంత్రి, బీజేపీ నేత యశోధరా రాజే సింధియా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కొలరాస్ అసెంబ్లీ స్థానానికి జరగబోయే ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బెదిరింపు వ్యాఖ్యలు చేశారు. ఉజ్వల పథకం బీజేపీ తీసుకొచ్చిందని, ప్రత్యర్థి పార్టీల మద్దతుదారులు ఉచిత గ్యాస్ కనెక్షన్‌ను, స్టౌ పొందలేరన్నారు. 'మీ ముందుకు గ్యాస్ కనెక్షన్ పథకం ఎందుకు రాలేదు? ఎందుకంటే ఇది బీజేపీ పథకం. కాంగ్రెస్‌కు ఓటేస్తే ఈ పథకాన్ని మీరు పొందలేరు. బీజేపీకి ఓటేస్తేనే పథకం కింద ప్రయోజనాలు పొందుతారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే గ్యాస్ కనెక్షన్ ఎందుకివ్వాలి? మీ విచక్షణతో తప్పకుండా ఓటేస్తే పార్టీ అమలుపరిచే పథకాలు వాటి ప్రయోజనాలు మీకు చేరుతాయి' అని ఆమె ఓటర్లను ప్రలోభపెట్టేలా మాట్లాడారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే రాం సింగ్ యాదవ్ మరణంతో ఖాళీ అయిన కొలరాస్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక ఈ నెల 24న జరగనుంది.

భగ్గుమన్న గుజరాత్

- కలెక్టరేట్ ఎదుట నిప్పంటించుకున్న దళితుడి మృతి..



అహ్మదాబాద్: గుజరాత్‌లో జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్య యత్నానికి పాల్పడిన గుజరాత్ దళిత కార్యకర్త భానుభాయ్ వాంకర్ మృతి చెందాడు. తన వర్గానికి న్యాయంగా దక్కాల్సిన భూమిని ఇవ్వాలని ఆయన కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడుతున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ క్రమంలో భానుభాయ్ పటాన్ జిల్లా కలెక్టరేట్ ముందు పోలీసులు చూస్తుండగానే కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నారు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోవటంతో..గుజరాత్ భగ్గుమన్నది. బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. దళిత నాయకులు,సంఘాలు రోడ్లపైకి వచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు.

దళితఎమ్మెల్యేపై ఖాకీ జులుం

దళిత ఉద్యమ నేత, ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానిపై గుజరాత్ ఖాకీలు జులుం ప్రదర్శించారు. కారులో ఉన్న జిగ్నేశ్‌ను బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అతని కారు తాళాలు కూడా విరగొట్టారు. దీంతో గుజరాత్‌లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. దళిత ఉద్యమ కార్యకర్త భానుభాయ్ వాంకర్ బలిదానానికి సంతాపంగా సారంగపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంస్మరణ ర్యాలీ, నిరసన ప్రదర్శనలు నిర్వహించేందుకు వాంకర్ కుటుంబ సభ్యులు నిర్ణయించారు.ఇందులో పాల్గొనటానికి జిగ్నేశ్ తన అనుచరులతో కలిసి సారంగపూర్ బయలుదేరారు. ర్యాలీగా వస్తున్న జిగ్నేశ్‌ను పోలీసులు ఆపారు. ఆయన్ని కారులోంచి పోలీసులు లాగేశారు. ఆపై కారు తాళాలను బద్దలు కొట్టి, బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. విషయం దావానంలా వ్యాపించింది.దళిత సంఘనేతలంతా ఆందోళనకు పూనుకోవటంతో..పోలీసులు జిగ్నేశ్‌ను సారంగపూర్ వెళ్లటానికి అనుమతించారు.

జనాభా నియంత్రణపై సుప్రీంకోర్టులో పిటిషన్లు

న్యూఢిల్లీ: దేశంలో జనాభాను నియంత్రించడానికి చట్టాలను బలోపేతం చేసేలా కేంద్ర ప్రభుత్వానికి సూచించాలని కోరుతూ సుప్రీంకోర్టులో మూడు వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి.

ఇద్దరు పిల్లల విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని, అనుసరించని వారిని శిక్షించేలా చర్యలు చేపట్టాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే దీన్ని అనుసరించే వారికి ప్రోత్సాహకాలను అందించే అంశాన్ని కూడా పరిశీలించాలని కోరారు. న్యాయవాదులు అనుజ్ సక్సేనా, పృథ్వీరాజ్ చౌహాన్, ప్రియాశర్మలు పిటిషన్‌లు దాఖలు చేశారు. జనాభా నియంత్రణ కోసం చర్యలు తీసుకోనట్టయితే 2022 నాటికి భారతదేశ జనాభా 1.5 బిలియన్(150 కోట్లు) మార్కును దాటిపోయే సూచనలున్నాయని వారు పిటిషన్‌లో తెలిపారు. దేశంలో జనాభా పెరుగుతున్న కారణంగా నిరుద్యోగం, పేదరికం, నిరక్షరాస్యత, అనారోగ్యం, కాలుష్యం, గ్లోబల్‌వార్మింగ్ వంటి సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. వచ్చేవారం సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ పిటిషన్‌లను విచారించే అవకాశమున్నది.

వ్యక్తిపై ఎమ్మెల్యే కొడుకు దాడి

- కాంగ్రెస్ పార్టీనుంచి ఆరేండ్లు బహిష్కరణ



బెంగుళూరు: కర్నాటకలోని బెంగుళూరులో ఓ రెస్టారెంట్‌లో డాలర్ కాలనీకి చెందిన వ్యక్తి పై కాంగ్రెస్ ఎమ్మెల్యే కుమారుడు శనివారం రాత్రి దాడి చేశారు. బెంగుళూరు జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నిందితుడు మహమ్మద్ హరిస్ నలపాడును పార్టీ నుంచి ఆరేండ్లు బహిష్కరించారు. 10మంది స్నేహితులతో కలిసి యూబీసిటీలోని రెస్టారెంట్‌కు వెళ్లిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్‌ఎ హరిస్ తనయుడు నలపాడు..రెస్టారెంట్‌లో కాలుకు ప్లాస్టర్‌తో ఉన్న బాధితుడు విద్వత్‌ను సరిగా కూర్చోవాలని ఆదేశించాడు. తర్వాత ఇరువర్గాల మధ్య వాదనలు ముదిరి గొడవకు దారితీశాయి. నలపాడు బృందం విద్వత్‌ను తీవ్రంగా కొట్టారు. స్థానికులు బాధితుడిని దగ్గరలోని మాల్యా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి దాకా వెంబడించి అక్కడ కూడా బాధితుడిపై దాడి చేశారు. ఈ ఘటనలో నలపాడు సహా అతని మిత్రులు 10మందిపై కేసు నమోదు చేసినట్టు సిటీ పోలీసులు తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నారు. కమారుడు ఎక్కడ ఉన్నాడో తనకు తెలియదని ఎమ్మెల్యే ఎన్‌ఎ హరిస్ అన్నారు. ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తున్నదని తెలుపుతూ..చట్టం తన పని తాను చేసుకుపోతుందని వ్యాఖ్యానించారు. నిందితులు ఎంతవారైనా సరే శిక్షను అనుభవించాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. త్వరలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో కాంగ్రెస్ ఇరుకునపడింది.

పాట్నా యూనివర్సిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా స్వతంత్ర అభ్యర్థి

న్యూఢిల్లీ: పాట్నా యూనివర్సిటీ విద్యార్థి సంఘం(పీయూఎస్‌యూ) ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి దివ్యాన్షు అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారు. శనివారం ప్రకటించిన ఎన్నికల ఫలితాల్లో దివ్యాన్షు విజేతగా నిలిచారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) అభ్యర్థిగా తిరస్కృతికి గురైన దివ్యాన్షు.. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయాన్ని సాధించారు. దివ్యాన్షు తన సమీప ప్రత్యర్థి జన్ అధికార్ పార్టీకి చెందిన గౌతం కుమార్ పై 112 ఓట్ల తేడాతో విజయం సాధించి, అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారు. దివ్యాన్షుకు 1862 ఓట్లు రాగా, గౌతం కుమార్‌కు 1750 లభించాయి. కాగా, ఏఐఎస్‌ఏ-ఏఐఎస్‌ఎఫ్ కు చెందిన మిటు కుమారి 1168 ఓట్లతో అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచారు. ఏఐఎస్‌ఏ-ఏఐఎస్‌ఎఫ్ కు చెందిన అభ్యర్థి అనుష్క ఆర్యను 850 ఓట్ల తేడాతో ఓడించడంతో ఏబీవీపీకి చెందిన యోషితా పట్వర్ధన్ ఉపాధ్యక్ష స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

అంతర్జాతీయం

రసాయనిక ఆయుధాలు ప్రయోగించలేదు

టర్కీ అధ్యక్షుడి ప్రధాన సలహాదారు యాసిన్ అక్తే



అంకారా : సిరియాలోని ఆఫ్రిన్ నగరంపై తాము రసాయనిక ఆయుధాలు ప్రయోగించలేదని టర్కీ పేర్కొన్నది. అంకారా సైన్యం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడటమే కాకుండా సిరియాలో రసాయనిక ఆయుధాల ప్రయోగానికి పాల్పడుతోందనే విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. సైన్యంపై వచ్చిన విమర్శలను టర్కీ అధ్యక్షుడి ప్రధాన సలహాదారు యాసిన్ అక్తే ఖండించారు. కాగా, సిరియాలోని కుర్దు తిరుగుబాటుదారుల లక్ష్యంగా టర్కీ సైన్యం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ ప్రత్యేక ఆపరేషన్ కారణంగా సామాన్య పౌరులు మృతి చెందుతున్నారు. రసాయనిక ఆయుధాల ప్రయోగం జరగడంతోనే మరణాల సంఖ్య అధికంగా నమోదవుతున్నదని సిరియాలోని హక్కుల పర్యవేక్షణ సంస్థ ఆదివారం పేర్కొన్నది. అల్‌షేక్ హదీద్ నగరంలోని కుర్దు తిరుగుబాటుదారుల శిబిరాల లక్ష్యంగా టర్కీ బలగాలు శుక్రవారం వైమానిక దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో మృతి చెందిన ఆరుగురు పౌరులు శ్వాససంబంధిత సమస్యతో మృతి చెందారు. రసాయనిక ఆయుధాల ప్రయోగం జరగడంతోనే పౌరులు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

తాజ్‌మహల్ సందర్శించిన కెనడా ప్రధాని దంపతులు



లక్నో : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఆగ్రా నగరంలోని చారిత్రక కట్టడమైన తాజ్‌మహల్‌ను కెనడా ప్రధాని దంపతులు ఆదివారం సందర్శించారు. వారం రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన జస్టిన్ ట్రూడో కుటుంబసమేతంగా తాజ్‌మహల్‌ను వీక్షించారు. ట్రూడో ఈనెల 25 వరకు భారత్‌లో పర్యటిస్తారు. ఈనెల 23న ప్రధాని మోడీతో సమావేశమవుతారు. ఈ సందర్భంగా ఇరు దేశల మధ్య ఉన్న వాణిజ్య, రక్షణ, పెట్టుబడులు, వాతావరణం వంటి అంశాలపై చర్చించనున్నట్టు సమాచారం. ఈ పర్యటనతో సివిల్ న్యూక్లియర్ రంగానికి సంబంధించి ఒప్పందాలు బలపడే అవకాశముందని భారత ప్రధాని కార్యాలయం పేర్కొన్నది. ట్రూడోతో పాటు కెనడా విదేశాంగ మంత్రి క్రిస్టియా ఫ్రీలాండ్, సైన్స్, ఆర్థిక శాఖ మంత్రి నవ్‌దీప్ బైన్స్, రక్షణ శాఖమంత్రి హర్‌జిత్ సింగ్ సజ్జన్, క్రీడా శాఖ మంత్రి క్రిస్టి డంకన్, నిర్మాణ రంగ శాఖ మంత్రి అమర్జీత్ జోషి తదితరులు భారత్ పర్యటనకు వచ్చారు. కెనడాలో 14లక్షల మంది ప్రవాస భారతీయులున్నారు.

ఫ్లోరిడాలోని స్కూల్‌లో కాల్పుల ఘటన... ఎఫ్‌బీఐ తీరుపై ట్రంప్ ఆగ్రహం



వాషింగ్టన్ : ఫ్లోరిడాలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో జరిగిన కాల్పుల ఘటన దర్యాప్తుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాల్పులకు సంబంధించి గతనెలలోనే సమాచారం అందినప్పటికీ ఎఫ్‌బీఐ బృందాలు సకాలంలో స్పందించకుండా నిర్లక్ష్యం చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్‌బీఐ సకాలంలో స్పందించి ఉంటే 17మంది విద్యార్థులను రక్షించుకోగలిగేవారమని అన్నారు. ఎఫ్‌బీఐ తీరు పట్ల అమెరికన్లు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందినప్పటికీ నిందితులను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నించకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. ఫ్లోరిడా రాష్ట్రం పార్క్‌లాండ్‌లోని ఓ పాఠశాలలో బుధవారం విచక్షణా రహితంగా కాల్పులు జరిపిన పూర్వ విద్యార్థి నికోలస్ క్రూజ్‌కు సంబంధించి గత ఏడాది సెప్టెంబరులోనే సమాచారం అందిందని గురువారం అంగీకరించిన ఎఫ్‌బీఐ మరిన్ని సంచలన విషయాలను వెల్లడించింది. 19 ఏండ్ల క్రూజ్ విపరీత ప్రవర్తన, తుపాకులు కలిగి ఉండటం సహా నరమేధం సృష్టించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు గతనెల5న అతని స్నేహితుడు ఒకరు ఫోన్ చేసి చెప్పారని ఎఫ్‌బీఐ తెలిపింది. అయితే తమ అధికారులు సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, ఫలితంగా ఈ దాడి జరిగిందంటూ ఎఫ్‌బీఐ విచారం వ్యక్తంచేసింది. మృతుల కుటుంబ సభ్యులు ఎఫ్‌బీఐ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా తప్పుపట్టగా, ఆ సంస్థ సారథి క్రిస్టోఫర్ పదవి నుంచి తప్పుకోవాలని ఫ్లోరిడా గవర్నర్ రెక్సో డిమాండ్ చేశారు. ఫ్లోరిడా వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ట్రంప్ పరామర్శించారు.

ఐక్యతను కాపాడుకోవాలి : పాలస్తీనా ప్రధాని పిలుపు



రమీ హందల్లా

రమల్లా:ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని పాలస్తీనా ప్రధాని రమీ హందల్లా పిలుపునిచ్చారు. అకాబా నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థను ప్రారంభించిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఐక్యతగా ఉన్నపుడే అన్ని కుట్రల నుండి మన దేశాన్ని రక్షించుకోగలమని, చట్టబద్ధమైన హక్కులను వినియోగించుకోగలమని అన్నారు. ఐక్యంగా ఉన్నపుడే అమెరికా తీసుకునే అన్యాయమైన నిర్ణయాలను, ఇజ్రాయిల్ ఉల్లంఘనలను సమర్థవంతంగా ఎదుర్కోగలమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు కావల్సిందల్లా పాలస్తీనా ప్రజల మధ్య ఐక్యతను బలోపేత ంచేయటంతో పాటు గాజా స్ట్రిప్‌పై పాలస్తీనా నేషనల్ అథారిటీ పూర్తి స్థాయి అధికారాలను దక్కించుకునేలా చూడాల్సి ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వానికి ఆర్థిక సాధికారికతతో పాటు సరిహద్దులపై అదుపు, శాంతి, భద్రతల పరిరక్షణాధికారం, న్యాయవ్యవస్థకు సంపూర్ణ అధికారం వంటివాటిని సాధించగలిగితే గాజా ప్రజల బాధలకు తెరదించవచ్చన్నారు. అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విదేశీ ఆర్థిక సాయం తగ్గిందని, ఇది మరింత తగ్గే అవకాశం ఉన్నందున దీనిపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించటం కోసం ప్రభుత్వం అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటున్నదని ఆయన చెప్పారు.

బిజినెస్ ప్రారంభించాలంటే భర్త అనుమతి అక్కర్లేదు...



రియాద్ : సౌదీలో మహిళలు వ్యాపారాలు ప్రారంభించాలంటే ఇకపై భర్త లేదా కుటుంబంలోని పురుషుల అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. ఈ దిశగా విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని సౌదీ ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ప్రయివేట్ రంగాన్ని శరవేగంతో అభివృద్ధి చేయాలని సౌదీ సర్కార్ భావిస్తున్నది. దానిలో భాగంగా గార్డియన్‌షిప్ విధానంలో సంస్కరణలు చేపట్టాలని కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం ఏ మహిళ అయినా వ్యాపారం చేయాలంటే కచ్చితంగా భర్త, తండ్రి లేదా సోదరుడి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో, ఉద్యోగాలు చేయాలన్నా లేదా వ్యాపారం ప్రారంభించాలన్నా మహిళలు వెనుకంజ వేస్తున్నారు. ఈ విధానంలో మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఇన్వెస్టిగేషన్ విభాగంలో మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తొలుత సౌదీ పబ్లిక్ ప్రాసిక్యూషన్ విభాగం ముందుకొచ్చింది. మహిళలకు 140 ఉద్యోగాలు కల్పించనున్నట్టు సౌదీ ఎయిర్ లైన్స్ గతవారం ప్రకటించింది. లక్షా 7వేల మంది మహిళలకు ఈ ఏడాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సౌదీ రాకుమారుడు మహ్మద్ బిన్ సల్మాన్ సంచలన ప్రకటన చేశారు. మహిళలు కూడా డ్రైవింగ్ చేసేందుకు అర్హులని, వారి హక్కులను పరిరక్షిస్తామని గతేడాది సౌదీ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.



నూతన సంవత్సర సంబరాల్లో బాణాసంచాపై నిషేధం

చైనా ప్రభుత్వ సంచలన నిర్ణయం

బీజింగ్ : వాయు కాలుష్య నియంత్రణకు చైనా పకడ్బందీగా ప్రణాళిక సిద్ధం చేసింది. నూతన సంవత్సర సంబరాల్లో బాణాసంచా ఉపయోగించొద్దని దేశ ప్రజలను కోరింది. వాతావరణ కాలుష్య నియంత్రణలో భాగంగా తామీ చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని, దేశ ప్రజలంతా సహకరిస్తారని ఆశిస్తున్నట్టు అధికారిక ప్రకటనలో పేర్కొన్నది. చైనాలో బాణాసంచా ఉపయోగిస్తూ నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తారు.

దాదాపు వెయ్యి సంవత్సరాల నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతూ వస్తున్నది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా జిన్‌పింగ్ సర్కార్ అనాదిగా వస్తున్న సంప్రదాయాన్ని పక్కనపెట్టి వాయు కాలుష్య నియంత్రణ కోసం తాజా చర్యలు చేపట్టడం గమనార్హం. చైనాలో నూతన సంవత్సర వేడుకలు ఈనెల 16న ప్రారంభమైన సంగతి తెలిసిందే.

ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో ... ఇద్దరు పాలస్తీనీయులు మృతి



గాజా : ఇజ్రాయిల్ బలగాలు గాజా ప్రాంతంపై నిర్వహించిన వైమానిక దాడిలో ఇద్దరు పాలస్తీనీయులు మృతి చెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అష్రఫ్ అల్‌ఖుద్రా తెలిపిన వివరాల ప్రకారం...ఇజ్రాయిల్ సైన్యం గాజాపై దురాక్రమణకు పాల్పడుతున్నది. పౌర నివాసాలను లక్ష్యంగా చేసుకొని వైమానిక దాడులకు పాల్పడుతున్నది.

ఆదివారం నిర్వహించిన వైమానిక దాడిలో ఇద్దరు పౌరులు మృతి చెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఓ వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నది. ఇజ్రాయిల్ సైన్యం ఎఫ్-16 యుద్ధ విమానాలతో నిర్వహించిన దాడుల్లో పలు ఇండ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో, కొందరు పాలస్తీనీయులు నిరాశ్రయులయ్యారు. 2014 జులై8న ఇజ్రాయిల్ బలగాలు గాజాపై దురాక్రమణకు పాల్పడ్డ సంగతి తెలిసిందే. ఈ దాడిలో 2,250 మంది పాలస్తీనీయులు మృతి చెందారు. 11వేల మందికి పైగా గాయపడ్డారు.

మేడారంలో నిలువు దోపిడీ

- పారిశుధ్య కార్మికులను మోసగిస్తున్న కాంట్రాక్టర్ • రోజుకు ఇస్తామన్నది రూ.450..ఇస్తున్నది రూ.350 లేదా రూ.300 • ఇచ్చిన అడ్వాన్స్‌లపై వడ్డీ వసూలు
- చార్జీలను కార్మికులే భరిస్తున్న వైనం • కంపు భరించలేక రోగాలపాలవుతున్న కార్మికులు • నిరుపయోగంగా షూస్, గ్లౌజ్‌లు • వ్యర్థాలతో కంపుకొడుతున్న మేడారం

మేడారంలో కోటిన్నర సందర్శకులు విడిచివెళ్లిన టన్నుల కొద్దీ చెత్తను శుభ్రం చేస్తున్న కార్మికులు..కాంట్రాక్టర్ నిలువు దోపిడీకి గురవుతున్నారు. కంపుకొడుతున్న జంతుకళేబరాలు... పూడ్చని మరుగుదొడ్ల గుంతలు...ఆహార వ్యర్థ పదార్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో కార్మికులు రోగాల పాలవుతున్నారు. రోగాలతో బాధపడుతూ 'ఇంటికెళ్లిపోతాం. ఇంత వరకు చేసినదానికి డబ్బులివ్వండి' అని అడిగితే కాంట్రాక్టర్ కార్మికుల పట్ల కనీసం మానవత్వం కూడా చూపట్లేదు. కార్మికులకు ఇచ్చిన అడ్వాన్స్‌లపై వడ్డీ వసూలు చేస్తున్నాడు. చార్జీలనూ కార్మికులే భరిస్తున్నారు. కార్మికులు ఎవరి బువ్వ వారు వండుకోవాల్సిందే. రోజంతా దుర్వాసన మధ్య పొద్దస్తమానం పనిచేసి, ప్రయాణంతో అలసిపోయి కార్మికులు సరిగా తిండి కూడా తినట్లేదు. కాంట్రాక్టర్ మోసాలను తాళలేక కొందరు, రోగాల పాలై మరి కొందరు...పనిచేయలేక ఇంకొందరు వెళ్లిపోగా 2,500 మంది కార్మికులకుగానూ 200 మందే మిగిలారు. ఏకోజాతర అంటూ ఊదరగొట్టిన అధికారులు పారిశుధ్య పనులను పర్యవేక్షించట్లేదు. 'నవతెలంగాణ' మేడారంతోపాటు పరిసర గ్రామాలను సందర్శించగా...అధికారుల నిర్లక్ష్యం, లోపాలు, అవినీతి, పారిశుధ్య లోపం, కార్మికులను దోచుకోవడం బహిర్గతమయ్యాయి.

మేడారం నుండి బొక్కా దయాసాగర్

జాతర ముగిసిన అనంతరం పారిశుధ్యంపై దృష్టి కేంద్రీకరించినట్టు ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, అధికారులు అందరూ ఊదరగొట్టారు. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. పస్రా నుంచి మేడారానికి 10 కిలోమీటర్ల ముందు నుంచే రహదారికి ఎటుపక్క ఆగినా ఈగల మోతే. తపమంచా, ప్రాజెక్టునగర్, నార్లపూర్, రెడ్డిగూడెం, కన్నెపల్లి, ఊరట్టం, మేడారం వరకు ఎక్కడ ఆగినా ఈగలు ముసరుతుండటం కనిపించింది. చెత్తా, చెదారం కుప్పలు, తెప్పలుగా పడి కనిపించాయి. మేడారం సమ్మక్క, సారలమ్మ గద్దెల పరిసరాల్లోనూ ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. మరుగుదొడ్ల గుంతలను పూడ్చివేయలేదు. ఖాళీ మద్యం సీసాలు, ఖాళీ వాటర్ బాటిల్స్ కుప్పలు తెప్పలుగా పడి వున్నాయి. జంతు, పౌల్ట్రీ వ్యర్థాలు ఒర్రెల్లో దర్శనమిస్తున్నాయి. అపరిశుభ్రంగా, దుర్గంధం నిండిన ఆ ప్రాంత సమీపంలో పారిశుధ్య కార్మికులు బస చేస్తున్నారు. ఆ కార్మికులకు చెందిన ప్రతి కుటుంబంలోనూ ఒకరో, ఇద్దరో వాంతులు, విరేచనాలు, జ్వరాలతో బాధపడుతూ పనిచేయలేక పోతున్నారు. మరోవైపు కార్మికులు మధ్యాహ్నం రెండు గంటలకు పని ముగించినా చిలుకలగుట్ట ప్రాంతానికి రావడానికి మరో గంట పడుతున్నది. నీళ్లు తెచ్చుకుని వంట పూర్తి చేసుకొనే వరకు మరో రెండుగంటలు పడుతున్నది. విమర్శలు వస్తున్న నేపథ్యంలో మూడు రోజుల నుంచి మాత్రమే కాంట్రాక్టర్ టిఫిన్, తాగునీరు అందజేస్తున్నాడు. ఈ లెక్కన ఉదయం టిఫిన్, సాయంత్రం ఒక్క పూట భోజనం మాత్రమే తింటూ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. కోటిన్నరమంది వచ్చిన జాతరలో 3వేల మంది కార్మికులతో పనిచేయించాలని భావించారు. తర్వాత 2,500 మంది పారిశుధ్య కార్మికులతో పనులు మొదలుపెట్టగా... చివరకు 200 మందే మిగిలారు. సుమారు 2వేల ఎకరాల విస్తీర్ణానికిపైగా వున్న ఈ ప్రాంతంలో వీరితో పనులు చేయించడం ఎలా సాధ్యమనేది అర్థంకావట్లేదు. వారికి రోజుకు రూ.450 ఇవ్వాల్సి ఉండగా రూ.350 నుంచి రూ.300 మాత్రమే ఇస్తున్నారు. వారికి చార్జీలూ ఇవ్వట్లేదు. అడ్వాన్స్‌లపై వడ్డీ వసూలు చేసి కాంట్రాక్టరు తుపాకుల రమణ తన కర్కశత్వాన్ని చూపించారు. పారిశుధ్యానికి రూ.2.41 కోట్లు కేటాయించగా..రూ.1.40 కోట్లు కేవలం పారిశుధ్య కార్మికుల వేతనాలకే కేటాయించారు. పారిశుధ్య కార్మికుల కోసం 2 వేల షూస్ జతలు, 40 వేల గ్లౌజ్‌లు కొనుగోలు చేసి తీసుకొచ్చినా పారిశుధ్య విభాగం క్యాంప్‌లో వృథాగా పడి ఉన్నాయి. అవగాహన కల్పించకపోవడంతో కార్మికులు వాటిని ఉపయోగించట్లేదు. షూస్ రవాణాకు రూ.3 లక్షలు, వాటి రవాణాకు రూ.12 వేలు ఖర్చు చేశారు.

చార్జీలు స్వాహా..అడ్వాన్స్‌పై వడ్డీ... అవినీతి రూ.50 లక్షలు

పారిశుధ్య కార్మికులను కాంట్రాక్టర్ తుపాకుల రమణ నిలువుదోపిడీ చేశాడని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఈ జాతరలో పారిశుధ్య కార్మికుల కోసం కేటాయించిన రూ.1.40 కోట్లలో కనీసం రూ.50 లక్షలు రమణ దోపిడీ చేసే శాడని సమాచారం. కార్మికులకు జాతరకు ముందు రోజుకు రూ.350 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.250, జాతర అనంతరం రోజుకు రూ.450లకుగాను కేవలం రూ.350 –రూ.300 మాత్రమే చెల్లించాడని కార్మికులు తెలిపారు. కార్మికులకు రానుపోను చార్జీలను ప్రభుత్వం ఇవ్వగా.. సుమారు రూ.20లక్షల మేరకు కాంట్రాక్టర్ దోచుకున్నాడని కార్మికులు ఆరోపిస్తున్నారు. దీనిపై కాంట్రాక్టర్‌ను అడగ్గా...'కార్మికులను అనేకమార్లు వివిధ ప్రాంతాల్లో తిరిగి తీసుకొచ్చా' అని దాటవేశారు. కార్మికులకు ముందుగానే ఖర్చుల కింద వారికి రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు అడ్వాన్స్ ఇచ్చారు. జాతర పని ముగిశాక వారికి ఇచ్చే కూలి నుంచి అడ్వాన్స్‌గా ఇచ్చిన మొత్తంతో పాటు దానిపై 5 శాతం వడ్డీ వసూలు చేసుకొని మిగతా డబ్బులను మాత్రమే ముట్టచెబుతాడని కార్మికులు తెలిపారు.



బ్లీచింగ్ పౌడర్ మా ఆయన చేతిని తినేసింది

బ్లీచింగ్ పౌడర్ మా ఆయన (బజ్జె రాఘవ) చేతిని తినేసింది. వారం నుంచి పనిచేయలేకపోతున్నాడు. ఇంటికి వెళ్తామంటే డబ్బులివ్వటం లేదు. చార్జీల కోసం రూ.2 వేలు అప్పుచేసి వచ్చాం. 15 రోజులు పనిచేశాం. పిల్లలకు వాంతులు, విరేచనాలైతే మా మరిదితో ఇంటికి పంపించేశాం. ఇదే మొదటిసారి జాతర పని కోసం రావడం. చాలా మంది ఆరోగ్యం బాగోక ఇంటికి వెళ్లిపోయారు. డబ్బులిస్తే మేము కూడా వెళ్లిపోతాం.



- బజ్జె కరుణ (మంగళగిరి), కార్మికురాలు

మార్చి 20న సంగారెడ్డిలో బీఎల్ఎఫ్ భారీ ర్యాలీ

- సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి పేరుతో ప్రజల్లోకి : ఫ్రంట్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్



నవతెలంగాణ–నిజామాబాద్ ప్రతినిధి

సామాజికన్యాయం, సమగ్రాభివృద్ధి పేరుతో బీఎల్ఎఫ్ ప్రజల్లో చొచ్చుకుపోనుందని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్య ప్రకాశ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్ఎఫ్ భావజాలం ప్రజల్లో వ్యాప్తి చేసేందుకు సన్నాహాలు ప్రారంభమ య్యాయని, ఇందు కోసం మార్చి 20 సంగారెడ్డిలో వెయ్యి మోటారు సై కిళ్లు, 400 కార్లతో భారీ ప్రదర్శన, 25న మహబూబ్‌నగర్‌లో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్టు చెప్పారు. తద్వారా బహుజనుల రాజ్యాధికార కాంక్షను తెలంగాణ నలుమూలలకూ వ్యాప్తి చేయనున్నట్టు తెలిపారు. తెలంగాణలో బీఎల్ఎఫ్ అధికారంలోకొస్తే పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా స్వామినాథన్ సిఫార్సులను వెంటనే అమలు చేస్తామని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు కేవలం మద్యం ఆదాయంపై ఆధారపడి పాలన సాగిస్తున్నాయని, బీఎల్ఎఫ్ అధికారంలోకొస్తే మద్య నిషేధం విధిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పాలడుగు భాస్కర్, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, టీమాస్–జిల్లా కన్వీనర్ పెద్దివెంకట్రాములు, బహుజన రాజ్యాధికార పార్టీ నేతలు లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె కొంపల్లో అంగన్‌వాడీలు



ఇరుకిరుకు గదులతో సతమతం

- ఇటీవల 25 శాతం పెరిగిన అద్దె
- ఏటా రూ.70 కోట్లు కిరాయి కింద చెల్లింపు
- సొంత భవనాలు నిర్మించాలి : జయలక్ష్మి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్


అమ్మ ఒడికి దూరమైన చిన్నారుల కోసం ఏర్పాటైన అంగన్‌వాడీ కేంద్రాలు అద్దెకొంపల్లో అల్లాడుతున్నాయి. కేంద్రం సింహభాగం నిధులు సమకూరుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వం చొరవ చూపకపోవటంతో కొత్త భవనాల నిర్మాణానికి దిక్కులేకుండా పోయింది. అద్దె భారంతో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఖజానా నీళ్లలా ఖర్చవుతున్నది. శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నించడంలో అధికారులు విఫలమైతే.. పరిష్కారం ఉన్నా ప్రతినిధుల నిర్లక్ష్య ధోరణితో ఆచరణకు నోచుకోవడం లేదు. ఫలితంగా ప్రభుత్వ ఖజానా భారీగా తరిగిపోతున్నది. మాతా, శిశు మరణాలు తగ్గించి, ఐదేండ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు ప్రాథమిక అక్షరాభ్యాస కేంద్రంగా సేవలందిస్తున్న సంబంధిత శాఖ పట్టనట్టుగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఐసీడీఎస్ ద్వారా కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంరక్షణ కార్యక్రమాలు అమలవుతున్నా పక్కా భనాలు లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. రాష్ట్రంలో మొత్తం 149 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉంటే వీటి పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 31,711 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 99 గ్రామీణ ప్రాంతాల్లో, 25 పట్టణ ప్రాంతాల్లో, 25 గిరిజన ప్రాంతాల్లో ఉన్నాయి. 2,90,076 మంది గర్భిణులు, 2,49,502 మంది బాలింతలు, మూడేండ్లలోపు శిశువులు 11,19,075 మంది, ఆరేండ్లలోపు చిన్నారులు 13,54,973 మంది కేంద్రాల ద్వారా లబ్దిపొందుతున్నారు. కాగా, మొత్తం అంగన్ వాడీ కేంద్రాల్లో సగానికిపైగా అద్దెభవనాల్లో ఉండటం విశేషం. 10,129 కేంద్రాలకు సొంత భవనాలు ఉంటే మరో 21,582 భవనాలు అద్దె ప్రాతిపదికన కొనసాగుతు న్నాయి. కాగా, ప్రస్తుతం చెల్లిస్తున్న అద్దెతో కలిపి అదనంగా మరో 25 శాతం పెంచి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాటికి రూ.750 నుంచి రూ. 1,000కి, పట్టణాల్లో రూ.1,500 నుంచి రూ.2,000, నగరాల్లో ఉన్న వాటికి రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెం చింది. అద్దెల కింద నెలకు సగటున రూ.5.79 కోట్లు అంగన్‌వాడీలకు చెల్లిస్తున్నారు. ఏడాదికి దాదాపు రూ.70 కోట్ల ప్రజాధనం అద్దె కింద కడుతున్నారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం కొన్నింటికి నేరుగా నిధులు మంజూరు చేస్తుండగా, జిల్లా పరిషత్‌ల నుంచి 15 శాతం గ్రాంటు ద్వారా వెచ్చిస్తారు. జెడ్పీ సీఈవోల పర్యవేక్షణ కొరవ డటంతో పేరుకు మాత్రమే కేటాయింపులు జరుగుతున్నా యనే విమర్శలు ఉన్నాయి. నిర్మాణాలు మాత్రం అడుగు ముందుకు పడటం లేదు. కలెక్టర్ల పర్యవేక్షణ కూడా లేకపో వడంతో నిధులు పక్కదారిపడుతున్నాయనే ఆరోపణలు లేక పోలేదు. చాలా చోట్ల మండల స్థాయికి వచ్చేసరికి మండ లాధ్యక్షులు మొండి చేయి చూపుతున్నారు. తొంబై శాతం జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొంది. ఇక సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీల్లో సగం కేంద్రాలు మరమ్మతుల కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణు లకు వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్య పరీక్షలు, పోషణ, ఆరోగ్య విద్య, పోషకాహారంపై అవగాహన కల్పించడం, బా లింతలకు ఆరోగ్య పరీక్షలు, పోషకాహారం పంపిణీ, మూడేళ్ల లోపు పిల్లలకు పెరుగుదల పర్యవేక్షణ, పిల్లల తల్లులకు కౌన్సెలింగ్, పోషకాహారం పంపిణీ చేపడుతున్నారు. ధనిక రాష్ట్రంలో ఇలాంటి కీలక సేవలు అందించే కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటం ఆలోచింపజేసే అంశం.

ఇలా ఉండగా, సొంత భవనాలు లేకపోవడంతో సగాని కి పైగా అంగన్‌వాడీ కేంద్రాలకు ఇక్కట్లు తప్పడం లేదు. సమస్యలకు నిలయాలుగా మారాయనే విమర్శలు ఉన్నా యి. ఓ వైపు ఇరుకుగదులతో సావాసం చేస్తుంటే మరోవైపు నీటి సదుపాయం, మూత్రశాలలు అందుబాటులో లేక చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడో ఒకసారి తప్పితే ప్రభు త్వం అద్దెను పెంచడంలేదు. భవన యజమానులు మాత్రం ఏటా కిరాయి పెంచడంతో టీచర్లకు సమస్యగా మారింది. కొన్నేండ్ల క్రితం నిర్ణయించిన అద్దె నిధులతో ప్రస్తుత పరిస్థి తుల్లో భవనాలను అద్దెకు ఇవ్వడానికి యజమానులు ముందకు రావడంలేదు.

దీంతో నిర్వాహకులతోపాటు అంగన్‌వాడీలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు ఇరుకు గదుల్లోనే పౌష్టికాహారం, భోజనం తినాల్సివస్తున్నది. అయితే, ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి అద్దె డబ్బులతో అనువైన భవనాలు లభించకపోగా, ఇంటి యజమానులు అద్దె పెంచ డంతో విషయాన్ని టీచర్లు, లబ్ధిదారులు చాలా సార్లు ఐసీడీ ఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇటీవలే అధికా రులు అంగన్‌వాడీల అద్దెను పెంచాలని ప్రభుత్వానికి నివే దించారు. ఇటీవలే ప్రభుత్వం అద్దెపెంపుపై ఉత్తర్వులు జారీ చేసింది. అద్దెభవనాలకు బదులు సొంత భవనాలు నిర్మించాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ.జయలక్ష్మీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వైభవంగా ధ్వజారోహణం

- రెండవ రోజూ కొనసాగిన యాదాద్రి బ్రహ్మోత్సవాలు • నేడు అలంకార సేవోత్సవాలు



నవతెలంగాణ–యాదాద్రి

యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవరోజు ధ్వజారోహణం కార్యక్రమా న్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ధ్వజ స్తంభంపై గరుడ పతాకాన్ని ఎగరేయడంతో ధ్వజారోహణం జరిగిందని పూజారులు తెలిపారు. గరుడ ఆళ్వారుడితో దేవతలను ఉత్సవ ప్రాంగణానికి చేర్చే తతంగం రాత్రి కొనసాగింది. బ్రహ్మోత్సవాలకు ఆహ్వానితులుగా విచ్చేసిన పారాయణీకులకు ఆలయ వంశపారధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి దీక్ష వస్త్రాలు అందజేశారు. ఆలయ ప్రధానర్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కారంపూడి నరసింహాచార్యులు, అర్చకబృందం ఉత్సవాలు నిర్వహించగా ఉత్సవ పెద్దలుగా అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి దంపతులు, ఎఈవోలు ఆనుకూరి చంద్రశేఖర్ ఆలయ ఈవో ఎన్ గీత, ఏఈవోలు ఆకునూరి చంద్రశేఖర్, దోర్భల భాస్కరశర్మ, వేముల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..


బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారిని పెళ్లికొడుకుగా ముస్తా బించనున్నారు. ఉదయం 9 గంటలకు నృసింహుడిని మత్స్యావతారుడిగా అలంకరిస్తారు. రాత్రి 8:30 గంటలకు శేషవాహన సేవోత్సవాన్ని చేపడతారు.

ప్రేమమయం

ప్రేమ లేని ముద్దుకన్నా మరణం మేలు - రష్యన్ కవయిత్రి జోయా

నువ్వు పరిచయమయ్యాకే కదా!
స్నేహమంటే ఎప్పటికీ ముగియని వాక్యమని తెలిసింది...

నువ్వు పరిచయమయ్యాకే కదా!
అతి సున్నితమైన కొన్ని మెత్తటి నవ్వులు
నన్ను వశపరచుకొని
నమ్మిన నిజాల పునాదులపై
ప్రతి నిత్యం నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకుంది...



నువ్వు పరిచయమయ్యాకే కదా!
ఈర్ష్య ద్వేషాలు వదిలేసి
తాదాత్మ్యపు అంచున నిలబడి
ఇంత ఆనందంగా
ఇంత ఆహ్లాదంగా
ఇంత ఉల్లాసంగా
ఇంత ఉత్తేజంగా
నన్ను నేను దిద్దితీర్చుకుంది...

ఒంటరి జీవితాన్ని అనుభవిస్తున్న నన్ను
అగరు ధూమమేసి నీలోకి ఆవాహన చేసుకున్నావు-
ప్రేమ లేకుంటే జీవితమే వ్యర్థమంటూ
ఫక్కున నవ్వుకుంటూనే
అన్ని సుఖాల్ని వదిలేసి
నాప్రాణాన్ని నీ ప్రాణంలో కలుపుకున్నావు...

నన్ను నీ ఒడిలో చేర్చుకొని
చిరునవ్వుతో తలనిమురుతూ
నా నుదుటిని ప్రేమతో ముద్దాడిన
నీ పెదాలు ఎంత గొప్పవి!

మగతతో మూసుకు పోతున్న
నా కళ్ళలో కళ్ళు పెట్టి చూస్తూ
నఖశిఖ పర్యంతం
చూపుల చుంబనాలతో ముంచెత్తుతూ
నన్ను పసివాడిని చేసి
భార వీడ్కోలు పలికిన రోజు గుర్తే!

సన్నని చిరునవ్వు రువ్వి
కన్ను గీటుకుంటూ పోయావు-
నన్ను నేను శోధించుకుంటూ
ప్రేమకు నిలువెత్తు దర్పణమై నిలిచాను..

- విల్సన్ రావు కొమ్మవరపు, 89854 35515

కరువు- ఎరువు

రేపు ఎట్లా ఉంటుందోనన్న భయంతో
తృణమో పణమో కూడబెట్టుకున్న
బీదసాదలకూ,
ఆరుగాలం కష్టపడుతూ పంట పండిస్తూ
దేశానికి అన్నం పెట్టే రైతన్నలకూ
నీతిమార్గం విడువని వారికీ
బారులు తీరి నిలబడినా
నోట్లకు కరువు!



పన్నులు సరిగా కట్టకుండా
ఎగవేసే సంపన్నుల యొక్కా,
తేనెలు పూసిన నవ్వులతో నమ్మిస్తూ
నిలువుదోపిడీ చేసి నింపాదిగా
పారిపోయే "వైట్ కాలర్"
దోపిడీదార్ల యొక్కా,
పుష్కలమైన అవినీతి పంటలకు మాత్రం
ప్రజలందరీ స్వేదార్జితమైన
కోట్లకు కోట్లు-ఎరువు!!!

- రఘువర్మ, 9290093933

అభివ్యక్తి వైచిత్రి


అందంగా చెప్పడం ఒక కళ. కథ, కవిత, వ్యాసం ఏ ప్రక్రియ అయినా సృజించడంలో నవ్యత చూపినప్పుడు ఇతివృత్తానికి అదనపు బలం చేకూరుతుంది. రచనకు ప్రత్యేక ఆకర్షణని సంతరింపజేస్తుంది. తెలిసీ తెలియకనే ఈ కళాధర్మాన్ని తనలో ఆవహింపజేసుకున్న రచయిత, కవి బుర్రా లక్ష్మీనారాయణ. కొన్నాళ్ళ కిందట 'కలచాలనమ్' పేరుతో కథల సంపుటి వెలువరించారు. తర్వాత రెండు కవితల సంపుటాలు వచ్చాయి. ఇప్పుడు మీ చేతిలో ఉన్నది నాలుగో పుస్తకం - కథల సంపుటి.

వ్యక్తావ్యక్తంగా చెప్పడం అలవడింది ఈ రచయితకి. కవిత్వంలోనే ఈ పని చేస్తారనుకుంటారు. కానీ కథల్లో కూడా ఈ పద్ధతిని అనుసరించి పాఠకుని మానసిక ప్రపంచాన్ని చలింప జేసే మేలిమి గుణం ఈ రచయిత సృజన స్వభావంలో ఉంది. ఏదీ వాచ్యం చేయకూడదన్న దృష్టి వారు రచించే కథలకు సుందరమైన నడకని సమకూర్చింది. ఈ కథల వెంట పాఠకులు అలవోకగా ప్రయాణిస్తారు. పాత్రల గమనాన్ని గమ్యం చేరే వరకు పరిశీలిస్తారు. ఆకస్మికమైన మలుపులు ఉండకపోవచ్చు. కానీ ప్రతి మలుపు అర్థవంతంగా, ఆర్ద్రంగా ఉండడమే రచయిత చూపిన అభివ్యక్తి వైచిత్రికి నిదర్శనం.

నలుగురు నడచిన దారిలో నడవలేదు రచయిత. తనదైన కంఠస్వరాన్ని రూపొందించుకున్నారు. కథాకథనంలో సొంతదారిన ప్రయాణించారు. వస్తువుల ఎంపికలోనూ, వాటికి కళారూపం ఇవ్వడంలోనూ స్వధర్మాన్ని అనుసరించారు. జీవితంలో సమస్యలు, సంక్లిష్టతలు, సంవేదనలుంటాయి. వాటిని వ్యక్తం చేయడం, ఆ వ్యక్తీకరణ పాఠకులను మెప్పించేలా ఉండటం చెప్పుకోదగిన విషయం. అందువల్లనే లక్ష్మీనారాయణ గారి కథల్లో ఇతివృత్తం కన్నా కథనరీతి ప్రధాన ఆకర్షణ.

సమాజంలోని సంక్షోభాల వల్ల మనిషి బతుకు రుజాగ్రస్తమవుతుంది. ఆ స్థితినించి బయటపడేందుకు మనుషులు ఎప్పటికప్పుడు తమవైన ప్రయత్నాలు చేస్తుంటారు. అలాగే సహజాతాల అంశంలోనూ ఆరాటాలు, ఎదురీతలు ఎన్నో. స్త్రీ పురుష సంబంధాల్లోని సంక్లిష్టతలు బతుకును దుర్భరం చేస్తాయి. ఇష్టమైన వారితో మరింత ఇష్టంగా ఉంటే బతుకు రాగరంజితమవుతుంది. కానీ బతుకంతా ఎదురుచూసినా తనదయిన మనిషి ఒక్కరంటే ఒక్కరు తారస పడకపోవడం చాలామంది జీవన విషాదం. అలాగే ఎదురుచూపుల ఫలితంగా మనసు ఆరాటపడ్డ మనిషి ఆఖరు మజిలీలో చెంత చేరినా బతుక్కి అదే పెద్ద ధన్యత. ఈ విషయాల పట్ల రచయిత భావనాపరంపర ఈ కథల్లో సరళ సుందరంగా వ్యక్తమయింది. ఈ కథలని చదువుతూ పోతుంటే రచయితలోని భావుకత, కవితాత్మక శైలీ విన్యాసం ముచ్చట గొల్పుతుంది. విస్మయానికి లోను చేస్తూ పరవశుల్ని చేస్తుంది.


జీవితంలో పెరిగిన వేగం, ఘర్షణ, పరుగులాట ఒకరి గురించి మరొకరు పట్టించుకునే వ్యవధి నివ్వడం లేదు. చివరకు తనని తాను పట్టించుకోవాలన్న నింపాదితనంతో కూడిన ఆలోచన సైతం మనిషికి రావడం లేదు. 'మనిషికి కావలసింది కాసింత దయ, ప్రేమ' అంటారు ప్రముఖ రచయిత బుచ్చిబాబు. ఆ దయ చూపే స్త్రీ దొరికిన మగవాని జీవితం అద్భుతం. ఇదేరీతిన తనను అమితంగా ప్రేమించే పురుషుడు లభించటం స్త్రీ జీవితానికి గొప్ప మలుపు. ఈవిధంగా పరస్పరం ప్రేమ ఉన్న వారు జీవితంలో ఎదురయ్యే ఎన్ని యుద్ధాలయినా, సవాళ్ళనయినా గెలవగలరు. కానీ ఈ ప్రేమ, ఆత్మీయత కొరవడటమే అసలు సమస్య.



మనిషికి మనిషి లభించకపోవడం అతి పెద్ద మానవీయ సంక్షోభం. మానవ సంబంధాల్లో పెరిగిన పరాయీకరణ దుష్ఫలితం. ఈ సంక్లిష్ట స్థితిని ఆర్ద్రమైన స్వరంతో చెప్పడంలో రచయిత సఫలమయ్యారు. వచనరచనలోని సారళ్యం ఈ సాఫల్యానికి మూలం. ఈ సారళ్యమే ఈ కథల్ని, కథల్లోని పాత్రల అంతరంగ తరంగాల్ని గుర్తుంచుకునేలా చేస్తుంది.

- గుడిపాటి

పిఠాపురం కథలు



పిఠాపురంతో అనుబంధం పెంచుకున్న కంభంపాటి రవీంద్ర, పిఠాపురంలో గడిపిన తన చిన్ననాటి జ్ఞాపకాలు, కన్నవి, విన్నవి అన్నింటిని కథలుగా మలచి 'పిఠాపురం క్రానికల్స్'గా తీసుకువచ్చారు.

ఇందులో కులపిచ్చితో విద్యార్థిని కక్షగట్టి ఫెయిల్ చేసిన ప్రొఫెసర్. ఆర్.యం.పి.డాక్టర్‌గా, ప్రాణాపాయ స్థితిలో అతడ్ని కాపాడిన ఆ పాత విద్యార్థి నిజంగా 'దేవుడే'. స్థితప్రజ్ఞుడిలా బతికిన వీరభద్రం, డంబ్ వుమెన్‌గా ఈసడించిన లక్ష్మీ తెలివితేటలు, దేవుడిలా వచ్చి సహాయం చేసిన ఆడ మనిషి, మతిపరుపు లెక్కల మాష్టారు, ఊరందరి క్షేమాన్ని కోరే పోస్ట్‌మాన్, ఎప్పుడూ నిజం పలికే అబద్ధంగాడు, భర్త వ్యాపారాలను దెబ్బతీసే అమాయకపు భార్య, సంస్కృతంలో మాట్లాడాలని తపించిన పండితుడు, తనను నమ్ముకున్న వారికి న్యాయం చేసిన సోమదేవమ్మ, చిట్టి పిన్ని గొప్పతనం, సినిమా హీరోలు నిత్య జీవితంలో నీచులుగా ప్రవర్తిస్తే, మామూలు వ్యక్తులే హీరోలుగా ముందుకొస్తారని నిరూపించారు. వీరితో పాటు ఈవ్ టీజర్లు, శాడిస్టు భర్తలు - వాళ్ళకు గుణపాఠం నేర్పిన యువతులు కూడా వున్నారు. సినిమా పిచ్చి మనుషులు, క్లెప్టోమానియాతో బాధపడే వ్యక్తి, మనుషుల పట్ల చిరాగ్గా వుండే మనిషి, రైల్వే దొంగ, స్వార్థ పరులైన కొడుకులు, మోసగాళ్ళు, స్వార్థపరులు, అవకాశవాదులు కూడా ఇందులో కనిపిస్తారు. ఉత్కంఠ భరితంగా కొనసాగే ఈ కథలన్నీ ఆసక్తికరంగా చదివిస్తాయి. ఊహించని విధంగా కొసమెరుపు కథలను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంటుంది. మళ్ళీ మళ్ళీ చదివించే కథలివి.

పిఠాపురం క్రానికల్స్ (కథల సంపుటి), కంభంపాటి రవీంద్ర, పేజీలు : 196, వెల : 150/-, ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు.

- రాహుల్

అలనాటి కథల సమాహారం



'కథలు రాయడమెలా' అనే ప్రామాణిక గ్రంథాన్ని రచించిన శొంఠి కృష్ణమూర్తి, విస్తృతంగా కథలను లోగడ రాశారు. 1945 - 63 వరకు వీరు రాసిన కథలను సేకరించి, నవచేతనవారు ఒక సమగ్ర సంకలనంగా వెలువరించారు. ఇందులోని మొదటి కథా సంపుటి యైన 'కథాపథం'లో వున్న 33 కథల్లో అత్యధిక భాగం చిన్న కథలే. ఈ కథల్లో ఆదర్శవాదం, ప్రజా - కార్మిక పక్షపాతం, లోకతీరు, మానవత్వం, ప్రేమ- ఆదర్శ దాంపత్యం, కుటుంబ సంబంధాలను వివరించే కథలున్నాయి. ఇందులో ప్రజలతో సంబంధం లేకుండా సర్రియలిస్టిక్ లైఫ్ గడుపుదామంటే కుదరదని తెలుసుకున్న చిత్రకారుడి కథ బాగుంది. ఆదర్శాల పేరుతో బతకలేని 'కళాజీవి' కథ వుంది. మనల్ని, మన నాయకుల్ని కేంద్ర ప్రభుత్వం వాళ్ళు, తక్కిన వాళ్ల అర్థం చేసుకున్నట్టు - మనల్ని మనం అర్థం చేసుకోలేదు. లేకపోతే మనకి రాష్ట్రం ఎప్పుడో వచ్చేది అని 1949లో రాసిన కథ ఆలోచింపచేస్తుంది. చాలా వరకు రచయిత పెట్టిన శీర్షికలను బట్టి కథలో ఏముందో ఊహించుకోవచ్చు. రెండవ సంపుటి 'కృష్ణాంజలి'లో 11 కథలున్నాయి. ఇందులో దాలయ్య భార్య లేచిపోయినందుకు బాధపడడు. ఈ కరువు రోజుల్లో 'గింజలు మిగిలాయి' అని తృప్తిపడటం వెనుకవున్న విషాదం కలిచివేస్తుంది. ట్యూషన్ చెప్పాలని పిలిచి మాష్టారికి తమ అమ్మాయిని ఎరవేసి, ఆమె పెళ్ళి చేసిన తండ్రి కథ 'సమస్య తీరింది'. అలాగే కులీకుతుబ్‌షా - భాగమతుల ప్రేమను వర్ణించిన 'భాగ్యనగర్' కథ కూడా వుంది. మూడవ సంపుటి 'రకరకాల భర్తలు'లో స్వాతంత్ర్య పిపాసి, సంస్కారి, రేడియో ప్రియుడు, విశాల హృదయుడు, విప్లవకారుడు, త్రాగుబోతు భర్తలతో పాటు సినీతార భర్త, లేడి డాక్టర్ భర్త, నిర్లక్ష్యం చేసిన భర్తల కథనాలున్నాయి. నాల్గవ సంపుటి 'కథావాహిని'లో నాలుగు కథలున్నాయి. ఇందులో మగవాళ్ళంతా ఒక్కటే. తండ్రి, భర్త, కొడుకు ఏ రూపంలో వున్నా కఠినాత్ములే అని నిర్ధారించిన కథ బాగుంది. వీటికి అనుబంధంగా 'మూగ భార్య' అనే చిన్న నవల కూడా ఉంది. ఇందులో గయ్యాళి భార్య కంటే మూగ భార్యనే మేలని తేల్చి వేయడం, చివరకు అంతా సుఖాంతం కావడం జరుగుతుంది. ఆసక్తికరమైన కథాకథనాలతో ఈ రచనలు హాయిగా చదివింపచేస్తాయి.

శొంఠి కృష్ణమూర్తి రచనలు, పేజీలు : 334, వెల : 200/-, ప్రతులకు : నవచేతన పుస్తక కేంద్రాలు

- కె.పి.అశోక్‌కుమార్

సాహిత్యవార్తలు

'దేవుడు తప్పిపోయాడు' ఆవిష్కరణ సభ

కవి సంగమం, పాలపిట్ట బుక్స్ సంయుక్త ఆధ్వర్యంలో విల్సన్‌రావు కొమ్మవరపు కవితా సంపుటి 'దేవుడు తప్పిపోయాడు' ఆవిష్కరణ సభ ఈ నెల 22 వ తేదీ సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరుగుతుంది. ఇందులో ఏనుగు నరసింహారెడ్డి, కె.శివారెడ్డి, కొలకలూరి ఇనాక్, జి.లక్ష్మీనరసయ్య, ఎం.నారాయణశర్మ, కవి యాకూబ్, వాహెద్ పాల్గొంటారు.

21న తెలంగాణ సాహిత్య అకాడమి సదస్సు

ప్రపంచ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు రవీంద్రభారతి మినీ కాన్ఫరెన్స్ హాల్లో 'తెలంగాణ సాహిత్య అకాడమి సదస్సు' నిర్వహిస్తుంది. ఈ సదస్సులో డా॥నందిని సిధారెడ్డి, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, దేవులపల్లి ప్రభాకర రావు, దేశపతి శ్రీనివాస్, సంగనభట్ల నరసయ్య, నలిమెల భాస్కర్, కె.రామచంద్రమూర్తి, చంద్రమోహన్ పాల్గొంటారు. తెలంగాణ భాష అమలులోని వివిధ అంశాలపై ప్రసంగం వుంటుంది.

- డా॥ ఏనుగు నరసింహారెడ్డి, కార్యదర్శి - తెలంగాణ సాహిత్య అకాడమి

యానాంలో పఠాభి శత జయంతి ఉత్సవం

కవిసంధ్య నిర్వహణలో కవి పఠాభి శత జయంతి ఉత్సవం ఈ నెల19న యానాంలో జరుగుతుంది. ఈ సందర్భంగా 'పఠాభి సాహిత్యం-ప్రాసంగికత' అంశంపై ఒక రోజు జాతీయ సాహిత్య సదస్సు జరుగుతుంది. అత్తలూరి నర సింహారావు, సీతారాం, అదృష్ట దీపక్, వంశీకృష్ణ, వాడ్రేవు వీరలక్ష్మి దేవి, జోశ్యుల కృష్ణబాబు, దాట్ల దేవదానం రాజు తదితరులు పత్ర సమర్పణ చేస్తారు. శిఖామణి కీలక ప్రసంగం చేస్తారు.

కవితలకు ఆహ్వానం

మార్చి 21న ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా 'వంతెన' కవిత్వ బులిటిన్ నిర్వహించే పోటీకి 25 పంక్తులు మించని కవితలను ఫిబ్రవరి 28లోగా చిత్తలూరి, కేరాఫ్ అమూల్యాచందు కప్ప గంతు, డోర్.నం.29-27-23, సూర్యనారాయణ వీధి, సూర్యారావుపేట, విజయవాడ-2కు పంపాలి. సెల్ : 9059824800.

పెన్నా సాహిత్య పురస్కారం

వార్షికోత్సవం సందర్భంగా పెన్నా రచయితల సంఘం ఇవ్వనున్న 'పెన్నా సాహిత్య పురస్కారం-2017'కు కవులు 2016, 2017 లలో ప్రచురితమైన తమ కవితా సంపుటాలు 4 ప్రతులను మార్చి 15లోగా చిరునామా: గుండాల నరేంద్ర బాబు, 25-1-890, నేతాజీనగర్, 3వ వీధి, ఎ.కె. నగర్ పోస్ట్, నెల్లూరు-524004కు పంపాలి. వివరాలకు 94932 35992.


తెలంగాణ రాష్ట్రస్థాయి కవితల పోటీలు

వసుంధర విజ్ఞాన వికాస మండలి సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్రస్థాయిలో కవితల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో తెలంగాణ పల్లె ఇతివృత్తంగా 20 లైన్లకు మించని వచన కవితలను ఆహ్వానిస్తున్నారు. కవితలను మార్చి10వ తేదీ లోపు కట్కూరి శంకర్, 11-2-495, హనుమాన్‌నగర్, యైటింక్లయిన్ కాలనీ, గోదావరిఖని, రామగుండం -505211చిరునామాకు పంపాలి. వివరాలకు : 9182777409, 9989078568, 9849950188

హుస్నాబాద్‌లో తెలంగాణ శతకవి సమ్మేళనం

తెలంగాణ భాష, యాస పరిరక్షణ కోసం మార్చి 6వ తేదీన హుస్నాబాద్ ప్రాంతంలో తెలంగాణ శతకవి సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఈ సమ్మేళనంలో పాల్గొనదలచిన కవులు, రచయితలు మార్చి 1వ తేదీ లోపు 9440988001 నెంబరును సంప్రదించాలి.

రాలిన పూల స్మరణ గీతాలు



నాగేశ్వర్ కవితా సంపుటి 'పూలు రాలిన చోట' పేరులోనే కవితల్లోని అంశ ప్రతిబింబిస్తోంది. తెలంగాణలోని విప్లవ రాజకీయాలు, ప్రత్యేక రాష్ట్రపోరు ఈ రచనలకు నేపథ్యాలు. సాయుధ విప్లవాచరణ, ఉద్యమాలపై నున్న సానుకూల దృక్పథం నాగేశ్వర్‌ను కవిగా మలచాయి. విప్లవకారుల అమరత్వాన్ని, ప్రభుత్వాల నిరంకుశత్వాన్ని, సీమాంధ్ర పాలనలో తెలంగాణ గోసను కాలానుగుణంగా కవి తన స్పందనలను అక్షరబద్ధం చేశాడు. కవిత్వం పాలు కన్నా సందర్భమే కవితల్లో ఆధిక్యతను చూపుతోంది. జరిగిన సంఘటనలపై కవి తల్లడిల్లి తన మనోవేదనను కవిత్వంలోకి దింపి రాలిన పూలకు అక్షర నివాళి అర్పించాడు.

2008 నుండి 2016 దాకా రాసిన కవితలు ఈ సంపుటిలో ఉన్నాయి. ఈ మధ్యకాలం అమరులైన విప్లవయోధులు, తెలంగాణ కోసం ఆత్మాహుతి చేసుకున్న యువకుల కీర్తిగానం ఈ అక్షరాల్లో చూడవచ్చు. పాదముద్రలు కవితలో తెలంగాణ మట్టిని ప్రస్తుతిస్తూ - 'మట్టి / దోసెడు కొత్తగట్టు చైతన్యపు చెట్టు / మట్టి / జగిత్యాల / ఉద్యమ ఆయువు పట్టు' అంటాడు కవి.

సిరిసిల్ల చేనేత చావును - 'కన్నుమూసిన కార్మికుడిక్కడ / ఎందుకూ పనికిరానంత / నలగ్గొట్టిన చెల్లని పైస' తో పోల్చుతాడు.

'అతడు నల్లనయ్యా..!' అంటూ 2009లో బరాక్ ఒబామా అమెరికా అధ్యక్షుడు ఎన్నికయినప్పుడు రాసిన కవితలో - 'అతడు శ్వేత సౌధంలో వెలిగిన / నలుపు నక్షత్రమో / తెల్లబుట్టలో దూరిన / నల్లత్రాచో / ఇవ్వాల కాదు / రేపు మాట్లాడుకుందాం' అనడం సామ్రాజ్యవాదంపై ఆశ పడ్డట్టు ఉంది.

'మేమేర్పడితీర్తం' అనే తెలంగాణ కాంక్షతో రాసిన కవితలో 'గూళ్ళ నుండి కోళ్ళు పట్టినట్టు / ఇండ్ల నుంచి పొల్లగాండ్ల పట్టి సంపుడేందని' అడుగుతూ । 'గందుకే... / మాకాడికి మేం ఏర్పడ్డమని లొల్లిజేస్తానం' అంటాడు కవి. తెలంగాణ ఏర్పాటుతో రాజ్యహింస ఆగుతుందనే పేరాశ కనబడుతోంది ఈ పంక్తుల్లో.

'బహుముఖ యుద్ధగాడు' అంటూ ఆజాద్ అమరత్వాన్ని కీర్తిస్తూ రాసిన కవితలో - 'సాయుద్ధరంగంలో హిమాలయమై ఎదిగి / అడివి అడివంతా / పచ్చపచ్చగా నవ్విన పత్రహరితం అతడు', 'పిడికిట్లో వెలుతురు పట్టుకొని / దేశం నలుమూలలా నాటుకుంటూ వెళ్ళినవాడు / సూర్యుడు కాక మరేమవుతాడు' లాంటి ఆకట్టుకునే వాక్యాలున్నాయి.

కిషన్ జీ స్మృతిలో రాసిన 'అతడో సాయుధ నక్షత్రం' కవితలో - 'ఆదివాసి అడుగులు నరికి / సంపదను / సరళీకృత సొరంగాల్లోంచి తరలిస్తోన్న రాజ్యాన్ని / దేహం ఆయుధంగా మలిచి ఎదురు నిలుచున్న మనిషితడు' అంటూ నిజ సంపదను దోచిపెడుతున్న రాజ్యం దుష్టత్వాన్ని కూడా ఎండకడతాడు కవి.

నాగేశ్వర్ డిసెంబర్ 2013లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలను వ్యతిరేకిస్తూ రాసిన 'తెలుగు వన భోజనం' కవితలోని రెలెవెన్సీ చూడాల్సిందే. 'సామ్రాజ్యవాద ప్రపంచీకరణ / పడగనీడలో పొదిగిన / నవరత్నాలు అష్టప్రధానులు / వర్తమాన ఆస్థాన కవి పండితులారా! / మీ శాలువాలు పైలం / మీ సన్మానాలు బహుపైలం / సంక్షుభిత సందర్భాన రాజ్యం మోచేతి నీళ్ల తాగుదాం రండి' అనే వ్యంగ్యంలో గత డిసెంబర్ సభలు గుర్తుకొస్తాయి.

రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆకుల భూమయ్యను స్మరిస్తూ 'ఆకిప్పుడు అర్ధాంతరంగా రాలింది / లేతాకో పండుటాకో కాదు / ఐదు దశాబ్దాల / తెలంగాణ చెట్టెత్తు ఎదిగిన ముదురాకు' అని పోల్చుతాడు.


వివేక్, శృతి, సాగర్‌ల ఎన్‌కౌంటర్ నేపథ్యంలో బంగారు తెలంగాణను ఈసడిస్తూ - 'అడివంతా జల్లెడ పట్టైనా సరే / అడివి ఆనవాళ్ళు లేకుండా చేసైనా సరే / కొత్తగా ఏ ఒక్క పక్షీ అడవి మీద ఎగరకుండా చేయాలి' అని కవి 'శ్వేత పత్రం' అడిగాడు.

ముందు మాట ఎంతుండాలో రాసిన కవిత్వం నిర్ణయిస్తుంది. అయితే 43 కవితలకు 23 పేజీలు విని 'త్యాగపరాగం' సుదీర్ఘంగా అనిపిస్తుంది. 'దాదాపు కవితలన్నీ ఒక సంఘటనకో, ఒక నిర్ణయానికో, ఒక పోరాట రూపానికో, ఒక మోసానికో, ఒక ద్రోహానికో, ఒక త్యాగానికో స్పందనగా ఉంటాయి. కనుక అన్నింటికీ ఒక రూపం ఉంది. ఒక ఆకారం ఉంటుంది. అన్నింటిలోనూ సారభూతమైనది విప్లవ ఆకాంక్ష' లాంటి కొన్ని వాక్యాలు మినహా మిగతాదంతా వివి విషయ పరిజ్ఞానమే.

పూలు రాలిన చోట, నాగేశ్వర్ కవిత్వం, పేజీలు :127, వెల : 50/-, ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు

- బి.నర్సన్, 9440128169

దోసిలి నీడ



ముడ్డిపోయిన ఊహకు
నిగురాని అక్కేరేంది
కరిగిపోతున్న పూటని
దోసిలి నీడలోకి మడిచిన తర్వాత
ముచ్చటెంది
ఆకులకింద దేహాన్ని
వదులు చేసుకొని
మౌనంగానే వెనక్కినడుస్తూ
బాధలఎక్కిళ్ళు తీస్తున్నా ఎవరికి పట్టి
బతుకు కంచెమీద పాలపిట్ట
రెక్కల్ని ఆరబెట్టుకుంటున్న దృశ్యాన్నే
పట్టించుకోరెవరు
పొంగిన వాగు ముఖాన్ని తనివితీరా
చూడరెవరు
ముక్కలైన తరిపొలం చూపుని
కంటిరెప్పలకు అతికించుకోరు
సుడిగాలి దుమారంల
ఇష్టంగ పెంచుకున్న గన్నేరు చెట్టు
నేలకూలిన ముఖం తిప్పరు
ఊరు ఎండిపోయిన మక్కజొన్న చేనులా మారినా
పొలిమేరమీద కాలుమోపరు
మోచేయి కొట్టుకపోయి
మనసు పొక్కినా
దూరమైన అనుబంధాల్ని గుర్తు చేసుకోరు
దుఃఖంలో మొత్తం మనిషితనం కూరుకు పోయినా
సోయిలోకి రాము

- వేముగంటి మురళీకృష్ణ, 9676598465



గ్యాస్ ట్రబుల్ మాయం...

గ్యాస్ ట్రబుల్‌తో బాధపడే వారు చాలా అరుదుగా కనిపిస్తారు. అసలు ఈ గ్యాస్ ట్రబుల్ ఎలా వస్తుందంటే! కడుపు ఉబ్బరం లేదా కడుపులోని ఆమ్లాలు ఎక్కువగా ఉత్పత్తి కావడం వల్ల కలిగే వ్యాధి. మారిన జీవన శైలి, కదలకుండా ఎక్కువ సమయం పని చేయడం, అధికంగా టీ, కాఫీలు తాగడం, వేళకు సరైన ఆహారం తీసుకోకపోవడం, ఆహారం సరిగ్గా నమిలి మింగకపోవడం, మసాలా దినుసులు ఎక్కువగా తీసుకోవడం, ఒత్తిడి, అలసట, దిగులు, కుంగుబాటుకు లోను కావడం, జీర్ణకోశంలో ఇన్ఫెక్షన్లు వంటివి గ్యాస్ ట్రబుల్ రావడానికి ముఖ్యమైన కారణాలు.

- గ్యాస్ ట్రబుల్‌తో బాధపడేవారు తిన్నది త్వరగా జీర్ణం కాదు. కడుపులో మంట వలన పులుపు, కారం వంటివి ఎక్కువగా తినలేరు. దాంతో పాటు త్రేన్పులు ఎక్కువగా రావడం, మలబద్ధకం సమస్య వస్తుంది. కడుపు నొప్పి, అజీర్తి సమస్యలు వెంటాడుతాయి. గ్యాస్‌ను ఆపుకుంటే కడుపులో నొప్పి పెరుగుతుంది.
- గ్యాస్ కు ప్రధాన కారణం ఆహారం సరిగ్గా నమలకపోవడం, కార్బోనేటెడ్ డ్రింక్స్ తాగడం వలన గ్యాస్ సమస్య వస్తుంది. గ్యాస్ సమస్యకు పెద్దగా భయపడాల్సిన అవసరం లేదు. కొన్ని చిట్కాలను పాటిస్తే సరిపోతుంది.
- ఒక గ్లాసు గోరు వెచ్చటి పాలలో ఒక చెంచా దాల్చిన చెక్క పొడి, రెండు చెంచాల తేనె ను కలుపుకొని తాగడం వల్ల గ్యాస్ నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు.
- అలాగే మజ్జిగలో చిటికెడు నల్లఉప్పు, ఒక చెంచా వాము కలుపుకొని తాగాలి, పుదీనా ఆకులను వేడి నీళ్లల్లో వేసుకొని ఆ నీటిని తాగితే గ్యాస్ ట్రబుల్ మాయమవుతుంది.

❄

సహజ మెరుపు కోసం...

క్యారెట్‌లోని పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్స్ చర్మాన్ని ఆరోగ్యంగా, సహజ మెరుపుతో ఉంచుతాయి. అందుకే క్యారెట్‌ను సౌందర్య పోషణలో భాగంగా తరచు వాడుతు ఉండాలి. ఇలా చేయడం వల్ల వయసుతో వచ్చే మార్పులు చర్మంపై పడకుండా కాపాడుకోవచ్చు. క్యారెట్‌తో తయారు చేసుకున్న వివిధ రకాల ఫేస్ ప్యాక్స్ గురించి తెలుసుకుందాం...

- క్యారెట్‌ను ఉడికించి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. రెండు చెంచాల తేనె కలిపి ముఖానికి పట్టించాలి. ఇలా 15 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరు వెచ్చటి నీటితో కడిగి మెత్తటి క్లాత్‌తో పొడిగా తుడుచుకోవాలి. ఈ ప్యాక్ వల్ల చర్మం కాంతివంతం అవుతుంది.
- ముఖం మీద ముడతలు ఉంటే క్యారెట్ గుజ్జులో తేనెతో పాటు కాస్త బాదం నూనె కలిపి ముఖానికి ప్యాక్ వేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.




- అలాగే క్యారెట్‌ను మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. ఇలా గ్రైండ్ చేసుకున్న దాంట్లో మూడు చెంచాల చక్కెర కలిపి ముఖానికి, మెడకు, మోచేతులకు రాసుకోవాలి. ఈ ప్యాక్ పూర్తిగా ఆరిన తర్వాత తొలగించుకుంటే మృత కణాలు తొలగి చర్మం ఆరోగ్యంగా, కాంతివంతంగా తయారవుతుంది.
- క్యారెట్ జ్యూసులో కొబ్బరి నూనె కలిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకోవాలి. ఈ ప్యాక్‌ను ముఖానికి 20 నిమిషాలు ఉంచుకోవాలి. ఆ తర్వాత గోరు వెచ్చటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే చర్మం తేమను సంతరించుకుంటుంది.

❄

ఇట్లచేద్దాం

బాగా వేడిగా ఉన్న నీటితో స్నానం చేయడం వల్ల చర్మం, వెంట్రుకలు పొడిబారతాయి. కాబట్టి గోరు వెచ్చగా లేదా చల్లగా ఉన్న నీటితో స్నానం చేయడం మంచిది.





జీవితం చాలా చిన్నది. ఆనందంగా జీవించడం ముఖ్యం. ఆ ఆనందం కోసం కొందరు డబ్బును కోరుకుంటారు. ఇంకొందరు కీర్తి కోసమో, ప్రేమ కోసమో తపిస్తారు. మరికొందరుంటారు... ఇతరులకు సేవ చేయడంలోనే అసలైన ఆనందాన్ని వెతుక్కుంటారు. అలాంటివారిలో ముందు వరుసలో ఉంటారు... యర్రం పూర్ణశాంతి. అవసరంలో ఉన్నవారికి తానున్నానని భరోసా ఇస్తున్నారు. 'సహాయం చేయడానికి డబ్బులే అక్కర్లేదు... మంచి మనసుంటే చాలు. డబ్బు దానంతట అదే వస్తుంది' అంటున్న ఆమె పరిచయం... ఆమె మాటల్లోనే!

మనసుకు నచ్చిన పనిచేస్తున్నా

'మా సొంతూరు శ్రీకాళహస్తి. పది వరకు అక్కడే చదువుకున్నా. అక్కడినుంచి వాళ్ల నాన్న వ్యాపారరీత్యా హైదరాబాద్ వచ్చేశాం. నిజానికి ఆ టైమ్‌లో నాకు చదువుమీద ఎక్కువ ఆసక్తి లేదు. అదే విషయం ఇంట్లో చెబితే 'సరే నీ ఇష్టం. నీకు ఏది చేయాలనిపిస్తే అది చెయ్... మనిషనేవాడు ఎప్పుడూ ఖాళీగా ఉండకూడదు. ఎవరికైనా సహాయం చేయడమో, నీకుగా నువ్వు అభివృద్ధి చేసుకోవడమో చేయాలి. ఖాళీ మైండ్ బూజు పడుతుంది. ఏదో ఒకదాంట్లో బిజీగా ఉండాలి' అని చెప్పారు నాన్న. కాలేజీకి వెళ్లకుండా ఓపెన్ డిగ్రీలో చేరాను. అయితే చిన్నప్పటినుంచే పది మందికి సహాయం చేయాలని ఉండేది. అది మా నాన్న ద్వారానే వచ్చింది. మేం చిత్తూరులో ఉన్నప్పుడు నాన్నగారు విత్తనాల వ్యాపారం చేసేవారు. 'తండ్రుల వారసత్వాన్ని కొడుకులే ఎందుకు కొనసాగించాలి. నాన్న నీ బిజినెస్ నేను చేస్తా' అని స్కూల్‌కు సరిగ్గా పోకుండా నాన్నతో ఎక్కువగా తిరిగేదాన్ని. మా నాన్నగారు ఊర్లల్లోకి వెళ్లగానే శెట్టిగారొచ్చారు అని అందరూ గౌరవించేవారు. నాన్నను ఎందుకంత గౌరవంగా చూస్తున్నారని కనుక్కుంటే తెలిసింది... 'అప్పుడాయన ఆయా గ్రామాల్లో పెండ్లిళ్లకు డబ్బులు ఇవ్వడం, కొత్తగా పెండ్లి చేసుకున్నవాళ్లకు ఇండ్లల్లో సామాను ఇప్పించడం, బట్టలు పెట్టడం, పిల్లల చదువులకోసం సాయం చేయడం' చేసేవారని. అవన్నీ చూసి చూసి ప్రజలకు సేవ చేయడానికి మించినదేదీ లేదని అప్పుడే నిర్ణయించుకున్నా.

చిన్నవయసులోనే ఆర్థిక స్వావలంబన...

హైదరాబాద్ వచ్చాక కొత్తపేట లక్ష్మీనగర్ కాలనీలో ఉండేవాళ్లం. అక్కడ కమ్యూనిటీ హాల్ ఉండేది. అక్కడ కమలానెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీవాళ్లు కంప్యూటర్, టైలరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ కోర్సు ఒకటి నేర్పించారు. నేను టైలరింగ్ ఎంబ్రాయిడరీ నేర్చుకున్నా. నేను ఒక్కదాన్నే నేర్చుకుంటే లాభం లేదని... ఎంబ్రాయిడరీ, టైలరింగ్ యూనిట్ ఏర్పాటు చేశాను. మగ్గం వర్క్ ఇంటి దగ్గరే చేయించేదాన్ని. అప్పుడు నా వయసు 16 ఏండ్లు మాత్రమే. అయినా ఏదో చేయాలన్న సంకల్పం. మనం ఎన్ని చేయాలనుకున్నా ప్రోత్సహించేవాళ్లు కూడా ఉండాలి కదా! నాకు ప్రోత్సాహంగా నిలిచారు నాన్న. 'చిన్నపిల్ల ఏం చేస్తదిలే' అనుకోకుండా ఎంబ్రాయిడరీ మెషీన్, మగ్గం వర్క్‌కు కావాల్సినవన్నీ కొనిచ్చారు. నేను చేయడమే కాదు... వేరేవాళ్లకు కూడా నేర్పించేదాన్ని. నాకు డ్రైవింగ్ అంటే పిచ్చి. నాన్న బజాజ్ ఉంటే దానిపైనే నాకు నేర్పించారు. ఓవైపు టైలరింగ్, మగ్గంవర్క్ కొనసాగిస్తూనే... నేను డ్రైవింగ్ నేర్పించడం మొదలుపెట్టాను. అష్టలక్ష్మి గుడి దగ్గర ఉన్న గ్రౌండ్‌కు తీసుకెళ్లి విద్యార్థినులకు, మహిళలకు డ్రైవింగ్ నేర్పించాను.

కుటుంబ ప్రోత్సాహం..

'దయగల హృదయమే భగవంతుడికి నిలయం' అనేవారు నాన్న. రూపాయలో పావలా దగ్గర పెట్టుకుని 75 పైసలు సహాయం చేయమనేవారు. అయితే నేను చదువుకోకుండా ఇంట్లో ఖాళీగా ఉన్నప్పుడు మంది పిల్లలు బాగా చదువుతున్నారు... మీ అమ్మాయి మాత్రం ఏం చదవడం లేదని రకరకాలుగా మాట్లాడినవాళ్లున్నారు. దాంతో సమాజానికి మనం ఏందో చూపించాలి. ఏదో ఒక మార్పు తేవాలి. సమాజానికి ఏదో ఒకటి ఇవ్వాలి అనుకునేదాన్ని. ఆ క్రమంలోనే పెండ్లి అయ్యింది. ఆయన పేరు యర్రం భాస్కర్. సహజంగా అమ్మాయిలకు ఎన్నో ఆశలు ఉంటాయి. వాటన్నింటినీ అత్తింటివారు తీర్చాలని రూలేం లేదు. అందరికీ అలా జరగదు కూడా. కానీ మావారు, అత్తగారు, అమ్మానాన్నా కూడా నన్ను ఎంతో ప్రోత్సహించారు.

కమ్యూనిటీకే పరిమితమవ్వకుండా...

మాకు ఒక బాబు, పాప. పాప బర్త్‌డే ఏదైనా అనాథశరణాలయంలో జరపమని 'అమ్మ ఫౌండేషన్'కు చెందిన ఫ్రెండ్ ఒకరు చెప్పారు. పాపను తీసుకుని వెళ్లగానే... అక్కడ 40 మంది పిల్లలు. వెళ్లగానే చుట్టు ముట్టేశారు. తమకోసం ఒకరు వచ్చారన్న ఆనందం ఆ పిల్లల్లో. కడుపు తరుక్కుపోయింది. ఇక్కడ నలభై మంది... హైదరాబాద్ మొత్తంలో ఎంత మంది ఉన్నారో కదా అనిపించింది. వాళ్లకోసం పనిచేయాలని నిర్ణయించుకున్నా. అనాథ పిల్లలకోసం పనిచేస్తున్న సంస్థలకు కో-ఆర్డినేటర్‌గా నాలుగేండ్లపాటు చేశాను. ఆయా సంస్థలకు ఎంతో కొంత సాయం అందించడం, తెలిసినవాళ్లతో సాయం చేయించడం. తరువాత వాసవి క్లబ్‌లో కీలక భాగస్వామి అయ్యాను. 2014లో వాసవిక్లబ్ అధ్యక్షురాలిగా చేశాను. వాసవి క్లబ్స్ అయినా ఇంకో ఆర్గనైజేషన్స్ కమ్యూనిటీ పేరుతో చేస్తాయి. దానివల్ల ఆ కులానికి మాత్రమే సేవ చేసినట్టవుతుంది.

సంస్థ ఏర్పాటు చేసి...

అందుకే సొంతంగా 'శ్రీసాయి శాంతి సహాయ సేవా సమితి' ఏర్పాటు చేశాను. 10వరకు చదివి... ప్రతిభ ఉండి ఆర్థిక కారణాల వల్ల చదువుకోలేకపోయిన అమ్మాయిలను చదివిస్తున్నాను. వృద్ధులు... ఈ సమాజానికి ఎంతో సేవ చేసినవాళ్లు. అలాంటివాళ్లు తమ చివరి దశలో అట్లా రోడ్లపక్కన ఉండటం చూస్తే బాధ కలుగుతుంది. రోడ్డుపక్కన భిక్షమెత్తుకుంటున్న వాళ్లకు చికిత్స ఇప్పించడం, వాళ్లు అంగీకరిస్తే వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తున్నాను. పెద్ద అంబర్‌పేటలోని శాంతినగర్ కాలనీలో 500 కుష్టురోగుల కుటుంబాలు ఉన్నాయి. ప్రభుత్వం క్వార్టర్స్ కట్టించింది. కానీ ఉపాధి లేదు. వాళ్లకు పూట గడవాలంటే... పనికి పోతే రానివ్వరు. బస్ స్టాప్ ఉన్నా అక్కడ బస్సు ఆగదు. దాంతో వెళ్లి కార్పొరేటర్‌తో మాట్లాడి, ఆర్టీసీ వాళ్లతో మాట్లాడి... బస్ ఆపేటట్లు చేశాను. వాళ్ల పిల్లలు బాగా చదువుతున్నవాళ్లు ఉన్నారు. స్కూల్స్ వాళ్లకు ఫీజులు కూడా తగ్గించవు. 'వంద మంది పిల్లలు ఫీజు కడతారు. అందులో ఒక్కరిద్దరు పిల్లలకు అయినా ఉచితంగా చదువు చెప్పొచ్చు కదా!' అని స్కూల్ యాజమాన్యాలతో మాట్లాడి ఫీజు తగ్గించేలా చేశాను. ఆరు నెలల కిందట... సద్గురు ఓల్డేజ్ హోమ్‌కి చెందిన మహిళ నాకు ఫోన్ చేసింది. అక్కడికి వెళితే... 'ఆమె ఏదో చేయాలన్న సంకల్పంతో నేను ఏర్పాటు చేశాను. కానీ నా వల్ల కావడం లేదు. మీ సాయం కావాలి' అన్నది. కొద్దిరోజులు నేను, తరువాత స్నేహితులను తీసుకొచ్చి సహాయం చేయించాను. కానీ అది కూడా కష్టమే అయ్యింది. నాకు చేయాలన్న ఆసక్తి ఎట్లాగు ఉంది కాబట్టి... నేనే ఎందుకు దాన్ని నిర్వహించకూడదని.. ఆ హోమ్ బాధ్యతలు తీసుకున్నాను. అనారోగ్యంతో ఉన్నవాళ్లకు ఆర్థికసాయం అవసరమైతే... చెక్కుల సాయంతో అందిస్తున్నాం.

అనాథ శవాలకు దహన సంస్కారం...

సికింద్రాబాద్ బోయగూడకు చెందిన మొగిలిపల్లి శ్రీనివాస్ గుప్త చిన్నతనంలోనే చదువుతోపాటు సమాజానికి సేవ చేయాలని నిర్ణయించుకున్నాడు. హైదరాబాద్‌లో రోడ్లపై అనాథ కనిపిస్తే ఆకలి తీరుస్తాడు. తను కష్టపడి సంపాదించిన డబ్బులనే సేవకు వినియోగిస్తాడు. నాలుగేళ్ల కిందట అతని కొడుకు వివేక్ గుండెసంబంధిత వ్యాధితో మరణించాడు. కుమారుడికి గుర్తుగా రియల్ వివేక్ ట్రస్ట్ నెలకొల్పాడు. పూర్తిస్థాయిలో సేవకే అంకితమయ్యాడు. ఆకలితో ఎవరైనా కనిపిస్తే అన్నం పెట్టిస్తాడు. రోడ్లపైన ఏదైనా శవం కనిపిస్తే పోలీసులకు సమాచారం అందిస్తాడు. వెంటనే మార్చురీకి తరలిస్తాడు. నగరంలోని ప్రతి పోలీస్ అధికారి వద్ద అతని ఫోన్ నంబర్ ఉంటుంది. నగరంలో ఏ మూలన ఎక్కడ కుళ్లిపోయిన స్థితిలో శవం కనిపించినా పోలీసుల సమాచారంతో అక్కడికి చేరుకుంటాడు. సొంతవాళ్లే తాకడానికి భయపడే స్థితిలో ఉన్న మ తదేహాలను ప్రేమతో జాగ్రత్తగా మార్చురీకి తరలిస్తాడు. దహన సంస్కారాలు నిర్వహిస్తాడు. ఒక్కసారి తన సేవ చూశాక... నేను అందులోనూ భాగస్వామురాలినయ్యాను. మీ అవసరం ఉందండి ఒక్క ఫోన్‌కాల్ వస్తే చాలు... వాలిపోతాను. బాబు ఇంటర్ సెకండియర్, పాప టెంత్‌క్లాస్ చదువుతున్నది. కుటుంబం, సేవ తప్ప మరో ప్రపంచం లేదు. డిఫరెంట్లీ ఏబుల్డ్ యువతకు పెండ్లిళ్లు చేస్తున్నాను' అని ఆనందంగా చెబుతారామె.

సేవకు గుర్తింపుగా...

ఆమె సేవకు గుర్తింపుగా అనేక అవార్డులు వచ్చాయి. సావిత్రిబాయి పులే జాతీయ అవార్డుతోపాటు వైశ్య ఎమినెంట్ లేడీ, ఐవీఎఫ్ బెస్ట్ సోషల్ అవార్డు, నేషనల్ కీర్తి పురస్కార్, ఉమెనర్జీ స్పెషల్ అవార్డులు అందుకున్నారు శాంతిపూర్ణ.



మరింత ధైర్యం వచ్చింది...

'మొదట నేను వెళ్తుంటే మావారు కూడా ఇబ్బంది పడ్డారు. నువ్వు ఒక్కదానివే ఏం చేస్తావు? అన్నారు. కానీ తరువాత మా అమ్మ, భర్త ఎంతో సహాయం చేశారు. తను ముందుకు రావడంతో ఎవ్వరినీ చేయి చాచాల్సిన అవసరం రాలేదు. మనసున్న స్నేహితులు చాలా మంది ఉన్నారు. గుప్తంగా వారి పేరు బయటికి రాకుండా ఇచ్చేవాళ్లు చాలా మంది ఉన్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం అందిస్తున్నారు. దాంతో మరింత ధైర్యం వచ్చింది. అయితే ఆపిల్స్, అరటిపండ్లో చేతికిస్తే సేవ కాదు. వాళ్లకు సాయపడుతూనే... మేమున్నాం అనే భరోసా కలిగించాలి. నేను ఇలా చేస్తున్న క్రమంలో 'ఎవరిని పడితే వాళ్లను ముట్టుకుంటావు. దహన సంస్కారాలు చేస్తావు' మా ఇంటికి రావొద్దు అన్నవాళ్లున్నారు. ఇక కమ్యూనిటీ పరంగా 'నువ్వు మా కులం వ్యక్తివి కాదు పొమ్మ'న్నవాళ్లున్నారు. అయినా 'నేను నమ్మిన మార్గం మంచిది అనుకున్నప్పుడు, నేను చేసేది మంచి అయినప్పుడు నేనెందుకు బాధపడాలి అనుకున్నా. నా మనసుకు నచ్చిన పనిచేస్తున్నా'

కట్ట కవిత

హ్యాండ్‌షేక్ ఇస్తూ...!

పరిచయస్తులు కనబడినప్పుడు నమస్కారం పెట్టడం మన సంస్కృతి. లేదంటే షేక్‌హ్యాండ్ ఇవ్వడం సాధారణంగా చూస్తుంటాం. ఇలా షేక్‌హ్యాండ్ ఇచ్చే సమయంలో మగవారు తమ నీచబుద్ధిని ప్రదర్శిస్తారు. షేక్‌హ్యాండ్ ఇస్తూనే.. ఆమె చేయిని గట్టిగా పట్టుకోవడం.. ఎంతకు వదలకపోవడం చేస్తుంటారు. కొన్నిసార్లు ఆమె చేతిని గిల్లడం, నలపడం వంటి బుద్ధిలేని పనులు కూడా చేస్తుంటారు. ఎదురుగా ఉన్నవ్యక్తి తెలిసివ్యక్తి కావడంతో గట్టిగా ఏమి అనలేని పరిస్థితి. ఇలాంటి సందర్భంలో ఎలా ఆ వ్యక్తి చేతి నుంచి చాలా సులభంగా మీ చేతిని విడిపించుకోవచ్చు. చిన్న ట్రిక్ పాటిస్తే చాలు.. ఆ ట్రిక్ ఎంటో ఈ వారం చూద్దాం..!



1

పొద్దున్నే పార్క్‌లో జాగింగ్ చేస్తున్న యువతికి తన ఆఫీస్‌లో పనిచేసే వ్యక్తి ఎదురుగా కనిపించాడు. హాయ్ అంటూ పలుకరించాడు. హాలో అంటూ షేక్‌హ్యాండ్ కోసం చెయ్యి ముందుకు చాచాడు. తప్పనిసరి పరిస్థితిలో ఆమె తన చెయ్యి ముందుకు చాచింది. చుట్టూ ఎవరూ లేని ప్రదేశంలో ఆమె చెయ్యి గట్టిగా పట్టుకుని అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు.



ఆఫీస్‌లో కలిసి పనిచేసే వ్యక్తి.. అందులోనూ తన కంటే పై స్థాయి వ్యక్తి ఇలా అసభ్యంగా ప్రవర్తిస్తాడని ఊహించని ఆమె తన చెయ్యిని వెనక్కి తీసుకునేందుకు గట్టిగా లాగింది. అయినా అతను చెయ్యి వదలలేదు. అప్పడే తనకు తెలిసిన ట్రిక్ ను గుర్తుకు తెచ్చుకున్నారు. తన ఎడమచేతితో ఆ వ్యక్తి కుడిచేతి బొటనవేలును గట్టిగా నొక్కారు.



ఊహించని ఈ పరిణామంతో ఆ వ్యక్తి బాధతో ఆమె చెయ్యిని వదిలేసాడు. ఆమె ఎడమచేతితో అతని బొటనవేలును అలాగే వెనక్కి నొక్కుతూ తన కుడిచెయ్యిని వెనక్కి తీసుకుంది.



మరోసారి ఇలాంటి ప్రయత్నం చేయకుండా లాగి చెంపపై ఒక్కటి వేసింది. మరోసారి ఏ అమ్మాయికైనా షేక్‌హ్యాండ్ ఇవ్వాలంటే భయపడేలా అతనికి బుద్ధి చెప్పింది. ఇకపై పరిచయస్తులు ఎవరూ కనిపించినా నమస్కారం మాత్రమే పెట్టాలని నిర్ణయించుకుంటూ..ముందుకు సాగింది.

కష్టాలు వచ్చినప్పుడు, వేధింపులు, దాడులు జరిగినప్పుడు ఎవరో వస్తారని ఎదురుచూస్తే ప్రయోజనం ఉండదు. ఆత్మధైర్యంలో వాటిని ఎదుర్కొన్నప్పుడే జీవితంలో నిలబడగలుగుతారు.



ఎన్. లక్ష్మీ రవి,
ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్,
రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్,
గాంధీనగర్, హైదరాబాద్.
9490239170,
9949039049

ఒంటిమిట్ట చెరువులో 5 మృత దేహాలు

ఎర్రచందనం కూలీలని అనుమానం?



కడప: కడప జిల్లా ఒంటిమిట్ట చెరువులో ఐదు మృతదేహాలు బయట పడ్డాయి. ఆదివారం స్థానికులు చెరువులో తేలుతున్న మృతదేహాలను గుర్తించడంతో విషయం బయట పడింది. పోలీసులకు సమాచారం తెలియజేయడంతో జిల్లా పోలీసు, రెవెన్యూ, ఫారెస్టు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మధ్యాహ్నం 12గంటల నుంచి మృతదేహాలను వెలికితీసే చర్యలు ప్రారంభించారు. బోట్లు, ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను బయటికి తెచ్చారు. ప్రాథమిక వివరాల ప్రకారం మృతి చెందిన వారంతా తమిళనాడుకు చెందిన ఎర్రచందనం అక్రమ రవాణా కూలీలుగా అధికారులు భావిస్తున్నారు.

కడప-రేణిగుంట జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఒంటిమిట్ట చెరువులో ఐదుగురి మృతదేహాలు తేలియాడటంపై పలు కథనాలు వినవస్తున్నాయి. శుక్రవారం రాత్రి కొంతమంది ఎర్రచందనం కూలీలు లారీలో వచ్చి చెర్లోపల్లి - ఒంటిమిట్ట మధ్య చెరువు కట్ట మీద దిగి అడవిలోకి వెళ్లే యత్నం చేసినట్లు తెలిసింది. అడవుల్లోకి వెళ్తున్న క్రమంలో పోలీసులు తారసపడిన సందర్భంగా ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం. పోలీసుల బారి నుంచి తప్పించుకోవడానికి హైవేకు అనుకుని ఉన్న చెరువులోకి దూకినప్పుడు చెరువులోని ముళ్లపొదల్లో చిక్కుకుని చనిపోయారా, ఎవరైనా హత్య చేసి చంపి చెరువులో పడేశారా, అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. మృతదేహాలపై గాయాలు కనిపిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు గాయపరిచారా లేక చేపలు కొరకడంతో గాయాలయ్యాయా? అనేది విచారణలో తేల్చాల్సి ఉంది. ఇటీవల పోలీసులు, ఫారెస్టు అధికారులు ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధంపై దృష్టి సారించారు. శనివారం పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఘటన చోటుచేసుకుని ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటనా స్థలానికి ఓఎస్‌డి నయీం హస్మీ, ఆర్‌డిఓ వీరబ్రహ్మం, రెవెన్యూ, పోలీసులు, ఫారెస్టు, అగ్నిమాపక అధికారులు చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాలను వెలికితీసిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై ఓఎస్‌డి, ఆర్‌డిఓ స్పందిస్తూ మృత్యు ఘటనపై విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడిస్తామని పేర్కొనడం గమనార్హం.

కమ్యూనిస్టులు ఏకం కావాలి

- **దొరల పాలనకు అంతం పలకాలి : ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర మహాసభల్లో గద్దర్**



నవతెలంగాణ-నర్సంపేట

'తెలంగాణ రాష్ట్రంలో తమ వాటా ఏంటని 93శాతంగా ఉన్న బడుగు, బల హీన వర్గాల జనం ప్రశ్నించుకునే రోజులొచ్చాయి. దానికి కమ్యూనిస్టులే పునాదిగా నిలవాలి. జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి ఏకం కావాలి. యువకులు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలను చైతన్యవంతం చేసి దొరలపాలనకు అంతం పలికేందుకు నిశ్శబ్ద విప్లవానికి నాంది పలికేందుకు సన్నద్ధం కావాలి' అని ప్రజా యుద్ధనౌక గద్దర్ పిలుపునిచ్చారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట పట్టణంలో ఆదివారం ఏఐఎఫ్‌డీవై తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభలు పోలం గోపాల్‌రెడ్డి నగర్, మారెల్లి కుమారస్వామి ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర అధ్యక్షులు వనం సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో గద్దర్ ప్రసంగించారు. దేశంలో 67 శాతంగా ఉన్న యువతతోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని అన్నారు. కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ పాలనలో బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందలేదని, భవిష్యత్‌లోనైనా వారిని పట్టించుకుంటారనే నమ్మకం కూడా లేదన్నారు. తెలంగాణ వచ్చాక మారిందల్లా కేవలం సీఎం జీతం మాత్రమేనని విమర్శించారు. సభలో ఎంసీపీఐ(యూ)జాతీయ కార్యదర్శి ఎమ్‌డి.గౌస్, ఏఐఎఫ్‌డీవై వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికాయల అశోక్, రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, సంఘపరివార్ శక్తుల నుంచి దేశాన్ని రక్షించేందుకే...

- **విశాల ఐక్య వేదిక అవసరం : సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం వెల్లడి**



మాట్లాడుతున్న సురవరం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మతోన్మాద బీజేపీ, సంఘ్‌పరివార్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడేందుకు జాతీయ స్థాయిలో విశాల ఐక్య వేదిక ఏర్పాటు చేస్తామని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి అన్నారు. ఎన్నికలతో సంబంధం లేకుండా మేధావులు, వామపక్ష, లౌకిక, ప్రజాతంత్రవాదులతో కలిసి ఈ వేదికను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడంతో పాటు మతోన్మాదులను ఎదుర్కొని దేశాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాల ఐక్య వేదిక ఏర్పాటుపై ఏప్రిల్ 26 నుంచి కేరళలోని కొల్లంలో జరిగే పార్టీ జాతీయ మహాసభల్లో చర్చిస్తామని తెలిపారు. మహాసభలలో రాజకీయ తీర్మానంపై జరిగే చర్చ సందర్భంగా పార్టీ సభ్యులు తమ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పొచ్చన్నారు. అమెరికా తరహా ఆర్థిక, సామాజిక అసమానతలకు మన దేశం ప్రతిరూపంగా మారుతోందని ఆందోళన వ్యకం చేశారు. మోడీ సర్కారు అవలంభిస్తున్న విధానాల కారణంగా దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఆర్థిక, రాజకీయ ప్రత్యామ్నాయ విధానాలకు వామపక్ష పార్టీలే కీలకమని తెలిపారు. సమస్యల ప్రాతిపదికన వామపక్షాలు ఐక్యంగానే ఉద్యమాలు నిర్వహిస్తాయన్నారు. పోరాటాలు వేరు ఎన్నికల ఎత్తుగడలు వేరన్నారు. ఎన్నికల సమయంలో ఎవరు ఎవరితో కలిసి వెళ్తారో ఇప్పుడే నిర్ణయాలు తీసుకోబోమన్నారు. మా తక్షణ కర్తవ్యం మాత్రం ఈ దేశాన్ని మతోన్మాద బీజేపీ నుంచి విముక్తి కల్పించడం కోసమేనన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం వ్యాపారవేత్త నీరవ్ మోడీ కేంద్రంగా జరిగిందని, ఆ దోపిడీని తమ పాలనలో జరగలేదని బీజేపీ తప్పించుకుంటోందని మండిపడ్డారు. మోడీ, నీరవ్ మోడీ కలిసి దావోస్‌లో ఎలా ఫొటో దిగారని ప్రశ్నించారు. పీఎన్‌బీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక నేరస్తులైన విజయ్‌మాల్యా, లలిత్‌మోడీ, ఇప్పుడు నీరవ్‌మోడీ ఈ దేశం విడిచి పారపోయారన్నారు. రాఫెల్ ఫైటర్ల కొనుగోలుపై వస్తున్న అవినీతి ఆరోపణలపై బీజేపీ సమాధానం చెప్పకుండా తప్పించుకుంటోందని, దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. కర్నాటక ఎన్నికలపై మాట్లాడుతూ పొత్తులపై ఆచితూచి వ్యవహరిస్తున్నామన్నారు. గత ఎన్నికలు ముగియగానే.. బీజేపీతో జనతాదళ్ కలిసి వెళ్లిన సంగతిని గుర్తు చేస్తూపై విధంగా వ్యాఖ్యానించారు. పొత్తులపై జనతాదళ్ నేత కుమారస్వామి తమతో చర్చలు జరుపుతున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీకి వ్యతిరేకంగా ఉంటానని స్పష్టంగా హామీ ఇస్తేనే తాము జనతాదళ్‌తో కలిసి వెళ్తామన్నారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్ఎఫ్)తో కలిసి పని చేస్తారా? అని ప్రశ్నించగా.. తక్షణం సమస్యలపై వామపక్షాలుగా కలిసే పోరాటాలు చేస్తున్నామని, ఎన్నికల సమయంలో పొత్తుల అంశంపై నిర్ణయాలు ఉంటాయని ఆయన తెలిపారు.

ఐక్య కార్యాచరణ

హోదా, విభజన హామీల సాధనకు...: రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయం



అభివాదం చేస్తున్న నాయకులు

అమరావతి: ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు ఐక్యంగా ఆందోళనలు నిర్వహించాలని పలువురు వక్తలు వెల్లడిం చారు. దీనికోసం ఐక్య కార్యాచరణ రూపొందించారు. ఆదివారం ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఐవి ప్యాలస్‌లో నిర్వహించింది. ప్రత్యేకహోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశం లో వామపక్షాలు, వైఎస్సార్ కాంగ్రెస్, జనసేన, కాంగ్రెస్, లోక్‌సత్తా, ఆప్, సమాజ్‌వాద్ పార్టీ, నవతరం పార్టీ, ఇండి యన్ యూనియన్ ముస్లింలీగు, ఉత్తరాంధ్ర చర్చావేదిక, బార్ కౌన్సిల్, లారీ ఓనర్స్ అసోసియేషన్స్, రైతుసంఘం, వీసీకే పార్టీలతో పాటు ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలు, విద్యార్థి, యువజన సంఘాలు, పలు ప్రజాసంఘాల ప్రతి నిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ, బీజేపీ కలిసి రాష్ట్రాన్ని మోసం చేస్తున్నాయని, దీన్ని ఐక్యంగా ఎదుర్కో వాలని ఆయా పార్టీలు, ప్రజా సంఘాల నాయకు లు నిర్ణయించారు. దీనికోసం ఉద్యమ కార్యాచరణ రూపొందించారు.

నేటి నుండి రౌండ్‌టేబుల్ సమావేశాలు

మార్చి ఒకటో తేదీన గుంటూరులో ప్రత్యేక హోదా విభజన హామీలపై సదస్సు నిర్వహించాలని, ఈనెల 19 నుండి మార్చి ఒకటోతేదీలోపు అన్ని జిల్లా కేంద్రాల్లోనూ రౌండ్‌టేబుల్ సమావేశాల్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 21న విజయవాడలో ఉద్యమాల గీతాలను ఆవిష్కరించనున్నారు. విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో మార్చి ఒకటోతేదీలోపు యూనివర్సిటీల్లో విద్యార్థులతో ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు అంశంపై సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. మార్చి 2,3,4 తేదీల్లో జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో దీక్షలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. దీనిలో అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. మార్చి5 నుండి ఢిల్లీలో పార్లమెంటు ముందు నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. దీంతోపాటు వివిధ సంఘాలు, పార్టీలు ఇచ్చిన ఆందోళనలకు ఉమ్మడిగా మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు.

పలు సంఘాలకు మద్దతు

ఈనెల 19న ఒంగోలులో ఎపిజెఎఫ్ నిర్వహించనున్న దీక్షకు, అలాగే ఈనెల 19 నుండి 28 వరకు కాంగ్రెస్ ఆత్మగౌరవ దీక్షలకు, 21న ఏపీడబ్ల్యూజేఎఫ్ నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి, 25న చెన్నైలో ఏపీజేఎఫ్ నిర్వహించనున్న అవగాహనా సదస్సుకు మద్దతు ప్రకటించారు. 28న కర్నాటకలో ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అవగాహనా సదస్సుకూ మద్దతిచ్చారు. దీంతోపాటు మార్చి ఒకటోతేదీన వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కలెక్టరేట్ల ముందు ధర్నాకు మద్దతిచ్చారు. మార్చి 4న విశాఖపట్నంలో ఉత్తరాంధ్ర చర్చావేదిక ఆధ్వర్యాన విశాఖబీచ్‌లో నిర్వహించనున్న కొవ్వొత్తుల ర్యాలీ, మార్చి5 నుండి 10 వరకు ఢిల్లీలో జరిగే పార్లమెంటు ముట్టడి, అదేరోజు ఢిల్లీలో వైసీపీ నిర్వహించే ధర్నా కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు. మార్చి 6,7 తేదీల్లో కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో చేపట్టిన దీక్షకు, 8న నిర్వహించనున్న చలో పార్లమెంటుకూ మద్దతిచ్చారు. మార్చి 17న వీకేసీ పార్టీ అమలాపురంలో నిర్వహించనున్న చలో అమలాపురం కార్యక్రామనికి, ఏప్రిల్ 20న రాజమండ్రిలో జరిగే బహిరంగసభకూ ఐక్యంగా మద్దతు ప్రకటించారు.

ప్రభుత్వ పరిశ్రమలను మోడీ అమ్మేస్తున్నారు

బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి అభిమన్యు



విశాఖపట్నం : ప్రధాని మోడీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం కంటే చాలా వేగంగా దేశం గర్వించే ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు అమ్మడం, పెట్టుబడులను ఉపసంహరించడం వంటి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి పి.అభిమన్యు విమర్శించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్, డిసిఐ, పోర్టు, భెల్ పరిశ్రమల కార్మికులు చేపట్టిన 36 గంటల నిరాహార దీక్షను ఆదివారం ఆయన ప్రారంభించారు. స్టీల్‌ప్లాంటులో 10 శాతం వాటాల విక్రయాలను, డీసీఐ అమ్మకానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి బీఎస్ఎన్ఎల్ తరపున మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి అన్ని వర్గాల ప్రజలూ కలిసిరావాలన్నారు. గత కాంగ్రెస్, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వాలు ఎయిరిండియా, బీఎస్ఎన్ఎల్, స్టీల్‌ప్లాంట్, రైల్వే, డిఫెన్స్ ఇలా అన్ని ప్రభుత్వ సంస్థలనూ తమ అప్రజాస్వామిక విధానాలతో నష్టాలు పాలు చేస్తున్నారని, తర్వాత నష్టాల పేరు చెప్పి ప్రయివేటుకు అమ్మేస్తున్నారని తెలిపారు. దేశంలోని సహజ వనరులను, సంపదను కార్పొరేట్లకు లూటీ చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోని కేంద్రమంత్రి ఎ.రాజా 1.57 లక్షల కోట్ల 2జీ స్పెక్ట్రమ్ అవినీతికి పాల్పడితే బీజేపీ ప్రభుత్వ హయాంలో అతనికి క్లీన్‌చిట్ వచ్చిందన్నారు. 122 ఎయిర్‌క్రాఫ్ట్ విమానాలను అవసరం లేకున్నా రూ.50 వేల కోట్లతో కొనుగోలు చేశారని, ఇప్పుడు ఆ అప్పులు తీర్చడానికి ఎయిరిండియాను అమ్ముతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాన్ని దేశంలోని కార్మికులు, కార్మిక సంఘాలే కాకుండా అన్ని వర్గాల ప్రజలూ ఉద్యమించడం ద్వారా అడ్డుకోగలమన్నారు.

తెలుగును పాలనా, బోధనా భాషగా తీర్మానించాలి

ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు

- **విశిష్ట తెలుగు భాషా కేంద్రాన్ని రాష్ట్రానికి తేవాలని డిమాండ్**



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలుగు భాషను బోధనా, పరిపాలన భాషగా గుర్తించి, వెంటనే తీర్మానం చేయాలని రచయిత, పరిశోధకులు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో జనవరిలో తెలుగు భాషాభివృద్ధిపై ప్రకటన చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారనీ, రెండు నెలలు కావస్తున్నా ఇప్పటికీ ప్రకటన రాలేదని విమర్శించారు. మార్చి 1న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం జరుపుతున్నారనీ, కానీ ప్రభుత్వం దాన్ని తెలంగాణ తెలుగు మాతృభాష దినోత్సవంగా జరపాలని కోరారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'చాటింపు' సంస్థ కన్వీనర్ ప్రొఫెసర్ ఎ.వినాయక్‌రెడ్డి, పరిశోధకులు వరప్రసాద్, చాటింపు ప్రతినిధి భూపతి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లా డారు. పన్నెండో తరగతి వరకూ తెలుగుతప్పనిసరి చేస్తామని చెప్పినా, ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని చెప్పారు. తెలుగును ఆధునిక భాషగా చేయాలంటే, ముందు రెండులక్షల పదాలతో నిఘంటువు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సాహిత్య అకాడమీని మాత్రమే ఏర్పాటు చేసి, జానపద, సంగీత, నాటక, శిల్పచిత్రకళ అకాడమీలను విస్మరించడం సరికాదని, వాటిని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. మైసూర్‌లో ఉన్న విశిష్ట తెలుగు భాషా కేంద్రాన్ని హైదరాబాద్‌కు తీసుకురావాలని తిరుమలరావు డిమాండ్ చేశారు. సమగ్ర తెలుగు నిఘంటువు నిర్మాణం కోసం పొట్లపల్లి వరప్రసాద్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ తెగల ద్రావిడ భాషా తెలుగు పదాలను సేకరించనున్నట్టు చెప్పారు. సమ్మక్కసారమ్మ చరిత్రపై కోయగాయకుల ద్వారా వీరగాథని సేకరించి 'వీరుల పోరుగద్దె మేడారం' పుస్తకం తీసుకొచ్చామని తెలిపారు. ప్రస్తుతం 'కోయ ఆదివారి వీరగాథచక్రం' పేరుతో 8 మంది కథలను సేకరిస్తున్నట్టు చెప్పారు.

ఎర్రజొన్న కంది పంటలను

ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలి

- **దళారీ వ్యవస్థను అరికట్టాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ**

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎర్రజొన్న, కంది పంటలను నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, దళారీ వ్యవస్థను అరికట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రైతుకు మద్ధతు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని పేర్కొంది. రాష్ట్రంలో ఎర్రజొన్న, కంది రైతులకు మద్ధతు ధర లభించకపోవడంతో గత మూడు రోజులుగా ఆందోళన బాట పట్టా రని తెలిపింది.

వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో పంట ధరలను రైతులు కాక వ్యాపారులు నిర్ణయిస్తున్నారని పేర్కొంది. ఇదే అంశాన్ని ఈ మేరకు ఆదివా రం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయం గిట్టు బాటు కాకపోవడంతో రైతాంగం క్రమంగా ఆందోళన బాట పడుతుందన్నారు. గిట్టుబాటు ధరల గురించి ప్రభుత్వాలే నియమించబడిన కమిషన్ల మద్దతు ధర అమలు చేయాల్సిన అవసరాన్ని తీవ్రతను తెలిపినప్ప టికీ పాలకులు అమలు చేయడం లేదన్నారు. ప్రకటించిన మద్ధతు ధరలు కూడా అమలు కావడం లేదన్నారు.

ఒక ఎకరం జొన్న పంట వేయడానికి రైతు 3560 రూపా యాలు ఖర్చు పెట్టి పండించగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా రైతుకు అందడం లేదని పేర్కొన్నారు. అదే విధంగా ఒక ఎకరా కంది సాగుకు రూ 7601లు రైతుకు ఖర్చు కాగ క్వింటాల్‌కు రూ.5450లు మాత్రమే మద్ధతు ధర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలు కందులు రూ 2000లకు కూడా అమ్ముడుపోవడం లేదన్నారు. ఒక్క తెలం గాణ రాష్ట్రంలోనే గిట్టుబాటు ధర లేక ప్రతియేటా రూ 25వేలు కోట్లు రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రజలందరికీ ఆహార ధాన్యాలు అందించి ప్రజల ప్రాణాలు కాపాడుతున్న రైతాంగం గిట్టుబాటు ధర లేక తమ ప్రాణాలు తీసుకుంటున్నారన్నారు. ప్రభు త్వం ఉత్పత్తి ఖర్చులకు 50శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించే విధంగా పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు నెపాన్ని నెట్టకుండా మద్దతు ధరపై సకాలంలో నిర్ణయాలు అమలు చేసి రైతులకు అందించాలని, అప్పుల్లో కూరుకుపోకుండా రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రైతు ఉద్యమాలు ఉధృతమవుతాయని హెచ్చరించారు.

నవీ ముంబయి ఎయిర్‌పోర్టుకు మోడీ శంకుస్థాపన



ముంబయి: మహారాష్ట్రలో నిర్మిస్తున్న నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రధాని మోడీ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఛత్రపతి శివాజీ జయంతికి ఒకరోజు ముందు ఈ కార్యక్రమం కోసం మహారాష్ట్రకు రావడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో నాణ్యతతో కూడిన మౌలిక సదుపాయాల నిర్మాణం చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. సముద్రంలో చేపట్టిన సాగరమాల ప్రాజెక్టు కోసం తమ ప్రభుత్వం అధికంగా నిధులు ఖర్చు చేస్తోందని చెప్పారు. నవీ ముంబయి విమానాశ్రయం సమస్య కొన్నేండ్లుగా నలుగుతూనే ఉన్నదని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే చాలా ప్రాజెక్టులు అటకెక్కాయన్నారు. దేశంలో ప్రస్తుతం 450 విమానాలే ప్రయాణీకులకు సేవలందిస్తున్నాయని, ఈ యేడాది మరో 900 కొత్త విమానాల్ని తీసుకురాబోతున్నామని తెలిపారు. మోడీ దీంతో పాటు రూ. 4,719 కోట్లతో పూర్తి చేసిన జేఎన్‌పీటీ(జవహార్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్)లోని నాల్గవ కంటైనర్ మొదటి దశ పనులను ప్రారంభించారు.

టీడీపీ కలిసి వస్తే.. అవిశ్వాసం

- **వై.ఎస్ జగన్**



కందుకూరు: తెలుగుదేశం పార్టీ కలిసి వస్తే నరేంద్ర మోడీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడతామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. ప్రకాశం జిల్లా కందుకూరు పట్టణంలో ఆదివారం జరిగిన ప్రజా సంకల్ప యాత్ర సందర్భంగా జరిగిన బహిరంగ సభలో జగన్ మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం ఏప్రిల్ 6న వైసీపీ లోక్‌సభ సభ్యులు పదవులకు రాజీనామా చేస్తారని ప్రకటిస్తే అలా కాదని, కేంద్ర ప్రభుత్వంపై అవి శ్వాస తీర్మానం ప్రవేశ

పెట్టాలని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సలహా ఇస్తున్నారని.. ఆయన సలహా పాటించడానికి కూడా తాము సిద్ధమేనని అన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రతిపాదనకు 54 మంది ఎంపీల సంతకాలు అవసరమని, తమ పార్టీకి ఐదుగురు లోక్‌సభ సభ్యులే ఉన్నారని చెప్పారు. తమ ఎంపీలను చంద్రబాబు రూ.20 కోట్లు, రూ.30 కోట్లు ఇచ్చి కొనుగోలు చేశారని, అందువల్లే తమకు అవిశ్వాస తీర్మానానికి సరిపోయినంత మంది లేరని చెప్పారు. అందువల్ల పవన్ కళ్యాణ్ తమ భాగస్వామి అయిన చంద్రబాబును కూడా ఒప్పిస్తే ఇద్దరం కలిసి అవిశ్వాస తీర్మానం పెడతామని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదిస్తే తమ పార్టీ సభ్యులు మద్దతిస్తారని చెప్పారు. అలా కాక తమ పార్టీ సభ్యుల ప్రతిపాదనకు తెలుగుదేశం పార్టీ సభ్యులు మద్దతు పలికినా తమకు అంగీకారమేనని చెప్పారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తీరు తెన్నులను జగన్ తీవ్రంగా దుయ్యబట్టారు. ఆయన చంద్రబాబుకు పార్టనర్ అన్నారు. చంద్రబాబు తాన అంటే పవన్‌కళ్యాణ్ తందాన అంటారని చెప్పారు. నాలుగేండ్లుగా ప్రత్యేక హోదా విషయాన్ని చంద్రబాబు మరిచిపోయారని, ప్రత్యేక ప్యాకేజీ అద్భుతంగా ఉందని అన్నారని చెప్పారు. రాష్ట్రానికి నరేంద్ర మోడీ ఎంతో చేశారని కితాబులు ఇచ్చారని, ఎన్నికలు రాబోతున్న తరుణంలో డ్రామాలు మొదలు పెట్టారని విమర్శించారు.

బీజేపీ అధ్యక్షుడిపై తిరుగుబాటు

అమరావతి: బీజేపీలో తిరుగుబాటు మొదలయ్యింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు తీరుపై పలు జిల్లాలకు చెందిన నాయకులు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. బీజేపీని చంద్రబాబు కాళ్ల వద్ద తాకట్టు పెట్టారని, తాము కష్టపడి నిర్మించిన పార్టీని నష్టపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీని ఇబ్బంది పెట్టొద్దని దండాలు పెట్టారు. కొద్దిసేపు అరుపులు కేకలతో సమావేశం దద్దరిల్లిపోయింది. బీజేపీ రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం ఐలాపురం కన్వెన్షన్ సెంటర్లో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతుండగా బిజెపి నాయకుడు లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ నాయకత్వం తీరుపై మండిపడ్డారు. రాష్ట్రంలో పార్టీని ఇబ్బందులు పెడుతున్నారని, పార్టీని రక్షించాలని వ్యాఖ్యానించారు. చంద్రబాబు ప్రాపకం కోసం పాకులాడుతున్నారన్నారు. పదవుల్లో ఉన్న వారు వాటిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారే తప్ప, పార్టీ కోసం పనిచేయడం లేదన్నారు. పలు జిల్లాలకు చెందిన నాయకులు కూడా ఆయనకు జత కలిశారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. ఎమ్మెల్సీలు మాధవ్, మంత్రి మాణిక్యాలరావు తదితరులు జోక్యం చేసుకుని వారికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. అయినా స్పందించలేదు. మాజీ మంత్రి పురంధరేశ్వరి కూడా నేరుగా జోక్యం చేసుకున్నా నాయకులు వినలేదు. పైగా అసహనం వ్యక్తం చేసిన నాయకులపై హరిబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇష్టం వచ్చినట్లు చేసుకుపోతే కుదరదని, పార్టీకి కట్టుబడి ఉండాలన్నారు. కిందిస్థాయి నాయకత్వం పార్టీకి కట్టుబడే ఉందని, పైస్థాయిలో నాయకులే టీడీపీతో అంటకాగుతున్నారని ఆయన పేర్కొన్నారు.



మరో ప్రపంచం కోసం కలలు కనండి

- **ఆనాటి యుద్ధ పరిస్థితులే తనను రచయితగా మార్చాయి : పుస్తకావిష్కరణలో గూగి వా థియోంగో**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మరో ప్రపంచం కోసం కలలు కనాలని, ఆ కలలు సాకారం చేసుకునే విధంగా కృషి చేయాలని రచయిత, కాలిఫోర్నియా యూనివర్సిటీ ప్రొఫెసర్ గూగి వా థియోంగో పిలుపునిచ్చారు. 'యుద్ధకాలంలో స్వప్నాలు- బాల్య జ్ఞాపకాలు' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం మలుపు ప్రచురణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి వీక్షణం సంపాదకు ఎన్. వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. గూగి వా థియోంగో ఆంగ్లంలో రాసిన పుస్తకాన్ని ప్రొఫెసర్ సాయిబాబా తెలుగులో అనువదించారు. ఈ పుస్తకాన్ని థియోంగో క్లాస్‌మేట్, ప్రొఫెసర్ సుశీతారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా థియోంగో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కలల కనాలని కోరారు. కలలు కనడం ఖర్చుతో కూడుకున్నది కాదని, కృషి పట్టుదల ఉంటే కలలను సాకారం చేసుకోవడం పెద్ద కష్టం కాదన్నారు. ఏ ప్రభుత్వాలైనా ప్రస్తుతం జరుగుతున్నదే అభివృద్ధిగా అభివర్ణిస్తాయని చెప్పారు. ఏ పాలకులైనా ఆ అభివృద్ధిని సమర్ధిసారని అన్నారు. కొత్త ప్రపంచం వైపు ప్రజల దృష్టి మళ్లించకుండా కుట్రలు చేస్తారని విమర్శించారు. ఎక్కడైతే అణచివేత, నిర్బంధం ప్రయోగిస్తారో, అక్కడే అసలైన అభివృద్ధికి బీజం పడుతుందని చెప్పారు. వేణుగోపాల్ మాట్లాడుతూ రెండో ప్రపంచం యుద్ధం నాటి పరిస్థితులే థియోంగోను రచయితగా మార్చాయని చెప్పారు. మొత్తం 7 నవలలు రాశారని, అందులో మూడు నవలలు గూగీ పేరుతో జైలులోనే రాశారని అన్నారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా రచనలు చేసినందుకు కెన్యా, లండన్, అమెరికాలో మూడుసార్లు హత్యాయత్నం జరిగిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు గాంచిన 8 విశ్వవిద్యాలయాల్లో 12 డాక్టరేట్లు పొందారని కొనియాడారు. సుశీతారు మాట్లాడుతూ ఆంగ్ల సాహిత్యం చదివి, ఆఫ్రికా రచయితగా పేరు తెచ్చుకున్నారని చెప్పారు. వలసాధిపత్యాన్ని తొలగించడమంటే రాజకీయంగా కాదని, మెదడులో ఉండే ఆలోచనలో మార్పులు తీసుకురావడమేనని చెప్పారు. సాహిత్య విమర్శకులు ఎకె. ప్రభాకర్ మాట్లాడుతూ గూగీతో సాయిబాబకు మానసిక సాహిత్యం ఉంది కనుకనే ఆంగ్లంలో ఉన్న పుస్తకాన్ని తెలుగులోకి అనువదించగలిగారని చెప్పారు. వలస పాలనలో విద్యా రంగం ఏవిధంగా ఉందో విశదీకరించారని అన్నారు. ఆంధ్రజ్యోతి సంపాదకులు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల మీద ఏ మేరకు నిర్భందం విధించాలనేదానికి కొంత హద్దుండాలన్నారు. ఎమర్జెన్సీ ప్రకటించకుండానే, అలాంటి పరిస్థితులను సృష్టిస్తున్నారని చెప్పారు. బుద్ధిజీవుల పట్ల ప్రభుత్వం ఏవిధంగా వ్యవహరిస్తున్నదో చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పుస్తకావిష్కరణలో విరసం నాయకురాలు వరలక్ష్మీ, మలుపు ప్రచురణ సంస్థ కె.బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండండి : డీజీపీ

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు పెరగడం, పారామిలటరీ బలగాలపై దాడులు పెరడంతో రాష్ట్ర పోలీసు యంత్రాంగాన్ని డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి అప్రమత్తం చేశారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల ఎస్పీలతో సరిహద్దుల్లో చోటు చేసుకుంటున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించి తగిన ముందస్తు జాగ్రత్తలను తీసుకోవాలని ఆయన ఆదేశించినట్టు తెలిసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుసుమ జిల్లాలో బ్రిడ్జి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ మావోయిస్టులు కొందరు కార్మికులను కిడ్నాప్ చేయడం , పోలీసులకు మావోయిస్టుల కు మధ్య జరిగిన ఎదురు కాల్పులలో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లు మరణించడం తో సరిహద్దుల్లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఖమ్మం, వరంగల్,భూపాలపల్లి, ఆసిఫాబాద్ మొదలైన ఉత్తర తెలంగాణ జిల్లాల్లో యాంటీ నక్సలైట్ విభాగం నిఘా అధికారుల కదలికలు పెంచుతు అంతర్గత ఆదేశాలు వెళ్లినట్టు సమాచారం.

టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీఎల్ఎఫ్



మన్నారం నాగరాజు

"భారతదేశం సంపదలేక పేద దేశం కాదు.. సరైన పంపిణీ లేక పేద దేశం అవుతున్నది" అని మహాకవి శ్రీశ్రీ చెప్పిన మాటలు ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ పరిపాలన గమనిస్తుంటే నిజమేనని అర్థమవుతున్నది. మన "నీళ్లు, నిధులు, నియామకాలు" మనకే అన్నారు. ఎన్నో ఆశలు.. మరెన్నో ఆకాంక్షలతో దేశంలో 29వ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ మిగతా రాష్ట్రాలకు ఎంతో ఆదర్శంగా ఉండాల్సి ఉంది. ఇటీవల ఓ ఆంగ్ల ఛానెల్ నిర్వహించిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ దేశంలోనే సర్‌ప్లస్ స్టేట్‌గా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. సర్‌ప్లస్ స్టేట్ అంటే ఆర్థికంగా మిగులు రాష్ట్రంగా ఉండటమని అర్థం. అంత మిగులు రాష్ట్రంగా పేరొందితే, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎందుకు తీర్చలేకపోతున్నదన్నది అందరికీ మిలియన్ డాలర్ల ప్రశ్న. దానికితోడు మూతపడ్డ పరిశ్రమలు తెరిపించలేకపోవడం సిగ్గుచేటు. ప్రధానమైన వాగ్దానాలేవి అమలుకు నోచుకోలేకపోయాయి. దళితులు, గిరిజనులకు ఇచ్చిన భూములను లాక్కునే దుర్మార్గానికి ప్రభుత్వం పూనుకుంది. మల్లన్నసాగర్ విషయంలో ప్రభుత్వం రైతులను ఎంతమేర ఇబ్బంది పెట్టి భూములు లాక్కున్నదో అందరికీ తెలిసిందే. చివరకు కోర్టు ప్రభుత్వానికి మొట్టికాయలేసింది. ఎస్సీ, ఎస్టీ, ఎంబీసీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చిన వాగ్దానాలు కూడా అమలుకు నోచుకోలేదు. సంక్షేమ పథకాలు ప్రజలకు సరైన విధంగా అందటం లేదు. వాటిని నిర్వహించే వ్యవస్థలో ఉన్న లోపాలపై ఏమాత్రం సర్కారు దృష్టి సారించటం లేదు. ఇంక డబుల్ బెడ్‌రూం మాట అయితే కనీసం ప్రభుత్వమే సమాధానం చెప్పుకునే స్థితిలో లేదన్నది అక్షర సత్యం. కేవలం 1350 ఇండ్లను మాత్రమే పేదలకు ఇచ్చి చేతులు దులుపుకుంది. ఆ ఇండ్ల కోసం పెట్టిన ఎంపిక విధానం కూడా హేతుబద్ధంగా లేదు.

ఎకరం, అర ఎకరం లేదా రెండెకరాల భూమి ఉన్నటువంటి ప్రజానీకం అర్హులు కారంటా! అసలు ఈ విధంగా చెబుతున్న ప్రభుత్వ ఆలోచనలో కొంచమైన హేతుబద్ధత ఉందా? తెలంగాణలో సాధారణంగా భూకమతాలన్ని చిన్న చిన్నగా ఉంటాయి. ఎక్కువగా ఎకరం, అర ఎకరం, రెండెకరాల పొలాలున్న రైతులుంటారు. బోరు బావులు, చెరువుల పైనే ఆధారపడుతుంది. దీంతో రెండు ఫసల్‌లో కేవలం ఒక దఫా పంట మాత్రమే పండేందుకు ఆస్కారం ఉంటుంది. కేవలం ఒక్క సీజన్‌లో మాత్రమే గ్యారెంటీ పంట ఉండే రైతుకు ఉండేటువంటి ఆర్థిక స్థితిని మనం అర్థం చేసుకోవచ్చు. అటువంటి రైతులను డబుల్ బెడ్‌రూమ్‌ల నుండి అనర్హులను చేయడం ఎంతవరకు సమంజమో సర్కారు ఆత్మ విమర్శ చేసుకోవాలి. సరే కనీసం గూడు, భూమి పూర్తిగా లేని నిరుపేదలకు ప్రభుత్వం ఎంతవరకు ఇచ్చిందన్న అంశాన్ని ఆత్మలోకనం చేసుకోవాలి. ఉద్యమ పనుల్లో భాగంగా కరీంనగర్‌లో ఇటీవల సమావేశానికి వెళ్లాను. అక్కడ నా ఉపన్యాసానికి ఆకర్షితుడైన సాధారణ వ్యవసాయ రైతు శంకర్ వేసిన ప్రశ్న నన్ను ఎంతగానో ఆలోచింపజేసింది. తనకు ఎకరన్నర భూమి ఉందని అయితే తనకు డబుల్‌బెడ్‌రూం రాదా? అని ప్రశ్నించాడు. ప్రభుత్వం విడుదల చేసిన గైడ్‌లైన్స్‌లో భూమి ఉన్నవారు లబ్ధిదారులుగా ఉండలేరు. కేవలం భూమి లేని నిరుపేదలు మాత్రమే దీనికి అర్హులు. తాను టీఆర్ఎస్ కార్యకర్తనని అయినా ఎందుకు రాదని అతను అడుగుతుంటే నాకు నిజంగా ఆవేదన కల్గింది. వాస్తవ పరిస్థితిని అతని కండ్లకు కట్టినట్టు వివరించిన తర్వాత ప్రభుత్వం తీరుపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంటే దీనిని బట్టి నాకు కూడా ఒక విషయం తెలిసింది. ప్రభుత్వ వ్యతిరేకతను పూర్తిగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతిపక్ష పార్టీల కృషి మరింత అవసరమని. తెలంగాణ పోరాటంలో కీలకపాత్ర పోషించిన విద్యార్థులకు కూడా సర్కారు సరైన న్యాయం చేయలేకపోయింది. కేజీ టు పీజీ ఉచిత విద్య అని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీపై ఇంతవరకు అడుగు కూడా ముందుకు వేయలేదు. విద్యాశాఖ మంత్రి ఈ విషయంపై ఏమీ చెప్పలేకపోతున్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం అంతా ఇంతాకాదు. పూర్తి స్థాయిలో ఫీజులు విడుదల చేయకపోవడంతో కోర్సు పూర్తయిన విద్యార్థులకు కాలేజీల్లో సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు అప్పులు తెచ్చుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఓ సమావేశం నిమిత్తం మంచిర్యాల వెళ్లిన నాకు ఓ విద్యార్థి చెప్పిన వ్యథ ఇది. ఇక కాంట్రాక్టు వర్కర్ల క్రమబద్ధీకరణ ఊసే లేదు. ఈ విషయంపై ప్రభుత్వం సమావేశం పెట్టిందిలేదు. దస్త్రం అడుగు కదిలిందీలేదు. అయితే కాంట్రాక్టు వర్కర్లు మాత్రం ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నారు. నిరుద్యోగ యువతకు నోటిఫికేషన్ ఇచ్చిన దాఖలాలు పెద్దగా లేవు. ఒక్కటే డీఎస్సీ పలుమార్లు ఇచ్చి దానిలోనూ కొర్రీలు పెడుతున్న విధానం మనం గమనిస్తున్నాం. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రభుత్వం అన్ని విధాలుగాను తాను ఇచ్చిన హామీలను నిలుపుకోలేకపోయింది. పైగా పెట్టుబడిదారులకు ఇష్టారీతిన భూములు అప్పజెప్పే కార్యక్రమానికి ప్రభుత్వం ఉరకలు వేస్తున్నది. ఇటువంటి సమయంలో వామపక్షాలు, సామాజిక శక్తులు, ఇతర సోషలిస్టు పార్టీలు ఏకమై "బహుజన లెఫ్ట్ ఫ్రంట్"ను ఏర్పాటు చేశాయి. నల్లా సూర్యప్రకాష్, తమ్మినేని వీరభద్రం, పి.ఎల్.విశ్వేశ్వర రావు తదితరుల నాయకత్వంలో ఏర్పడింది. అయితే ఈ ఫ్రంటు ప్రధాన లక్ష్యం టీఆర్ఎస్‌ను ఓడించి సామాన్యుడికి సరైన పాలన అందించడమే అసలు నినాదంగా ముందుకు వెళుంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి, ఆందోళన అందుకోగల్గితే గెలుపు సునాయసమేనని నా ప్రగాఢ విశ్వాసం. అందుకోసం ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

సెల్ : 95508 44433

పంచాయతీ చట్టంలో మార్పులు ఎవరికోసం?



బీరయ్య యెజ్జు

గ్రామ పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు తేనున్నట్టు ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. దీనికి సంబంధించిన ముసాయిదా బిల్లు కూడా తయారవుతున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రకటించాడు. ఇది పూర్తయిన వెంటనే ఫిబ్రవరి నెలలో పంచాయతీ ఎన్నికలకు వెళ్తామని మొదట ప్రకటించిన ముఖ్యమంత్రి ఓటరు నమోదు ప్రక్రియలో ఉన్న లోటుపాట్లను సరిదిద్దిన తర్వాత మార్చి 12న జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఈ ముసాయిదా బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు ప్రకటించాడు.

పరోక్ష పద్ధతిలో గ్రామ సర్పంచును ఎన్నుకునేట్టు పంచాయతీ రాజ్ చట్టంలో సవరణలు చేయబోతున్నట్టు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ప్రాతినిధ్య వ్యవస్థలను రద్దు చేస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఇటు రాష్ట్రంలో కానీ అటు కేంద్రంలో కానీ ఒక కొత్త చట్టం తెచ్చేటప్పుడు లేదా ఉన్న చట్టాల్లో మార్పులు చేసేటప్పుడు ఏదో ఒక గొప్ప ప్రయోజనం ప్రజలకు ఒనగూరుతున్నట్టుగా పాలకులు ప్రచారార్భాటాలు చేయటం పరిపాటిగా మారింది. ఈ చట్ట సవరణ ద్వారా గ్రామ పంచాయతీలకు నిధులు, విధులు సమకూరడమే కాకుండా గ్రామ సర్పంచు మహాశక్తివంతునిగా మారుతున్నట్టు పతాక శీర్షికల్లో వార్తలు వస్తున్నాయి. ఈ చట్ట సవరణ ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఒక వైపు ప్రభుత్వం ప్రచారం మొదలు పెట్టింది. ప్రజల చేత, ప్రజల కొరకు, స్వపరిపాలన, స్వయం సమృద్ధి వంటి ప్రజాస్వామిక విలువలు ప్రమాదంలో పడనున్నాయని మరో వైపు అనేక మంది మేధావులు విశ్లేషిస్తున్నారు. ఒకప్పుడు మండల ప్రజాపరిషత్తు అధ్యక్షున్ని, జిల్లా పరిషత్ ఛైర్మెన్‌లను ప్రజలే నేరుగా ఓట్లేసి ఎన్నుకునేవారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థలొచ్చిన తర్వాత ఈ రెంటినీ పరోక్ష పద్ధతిలో ఎన్నుకోవడం ప్రారంభమైంది. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు అధికారాలు లేవని, గ్రామ పంచాయతీలకు విధులు, నిధులు సమకూర్చాలని సర్పంచులు నిన్నమొన్నటి దాకా ప్రభుత్వంతో కొట్లాడుతూ వచ్చారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు గౌరవ వేతనాలు అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నిధులు, విధులను సమకూర్చలేకపోయింది. ఇంతలోపే పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేస్తున్నట్టు ప్రకటించింది.

ఏదైనా ఒక దేశ ప్రజాస్వామిక వ్యవస్థ గొప్పతనం ఆ దేశ గ్రామపరిపాలనా స్వరూపంలో కనబడుతుంది. ప్రజాస్వామిక ప్రక్రియ అంటే గ్రామ స్థాయిలో ప్రజల భాగస్వామ్యాన్ని పాలనా వ్యవస్థలో పెంచడం. గ్రామాభివృద్ధిలో అన్ని వర్గాలు, తరగతులను మమేకం చేయడమే కాకుండా వారి ఆలోచనలకు, అభిప్రాయాలకు అవకాశం కల్పించి గౌరవించడం. ప్రజలు నేరుగా ఓట్లేసి ప్రజా ప్రతినిధిని ఎన్నుకునే పద్ధతిని ప్రత్యక్ష పద్ధతి అంటారు. సర్పంచు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీలందర్నీ ప్రత్యక్ష పద్ధతిలోనే ఎన్నుకుంటున్నాం. ప్రజలు నేరుగా ఓట్లేయడంతో ఎన్నికైన ప్రజాప్రతినిధిని తమ వాడిగా భావిస్తారు. ఆ ప్రతినిధి పని చేయకపోయినా, పని పట్ల నిర్లక్ష్యం వహించినా నువ్వెందుకున్నావని ప్రశ్నిస్తారు, నిలేస్తారు. ఇలా ప్రశ్నించడమనేది తాము ఓట్లేశామన్న భావనలోంచి వస్తుంది. పరోక్ష పద్ధతిలో ఎన్నికైన ప్రతినిధి నువ్వు నాకు ఓటేశావా? అని ప్రజలనే తిరిగి ప్రశ్నిస్తాడు. తాను ప్రజలందరికీ ప్రతినిధినన్న స్పృహను కోల్పోతాడు. పాలకుడు, పాలితులకు మధ్య ఉండాల్సిన కనీస ప్రజాస్వామిక వాతావరణం కొరవడుతుంది. ఎన్నికలకు ముందు టీఆర్ఎస్ పార్టీ 29 అధికారాలను స్థానిక సంస్థలకు బదలాయించనున్నట్టు తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత అలాంటిదేమీ జరగకపోగా ఉన్న అధికారాల కోరలు పీకుతున్నది. గ్రామాల్లో పెట్టుబడులు పెట్టి, పరిశ్రమలు స్థాపించాలంటే పంచాయతీరాజ్ చట్టం –1994 ప్రకారం స్థానిక పంచాయతీ పాలకవర్గం అనుమతి పొందాలి. కానీ దీన్ని నిర్వీర్యం చేస్తూ జీవో నెం. 10ని జారీ చేసింది. సాగునీటి ప్రాజెక్టుల భూ నిర్వాసితులకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలను కాదని రాష్ట్రంలో 123 జీవోను తెచ్చింది. వీళ్లకు సరైన పునరావాసం కల్పించడంలో విఫలమైంది. గతంలో పంచాయతీ ఖాతాల్లోకి కేంద్రం నుంచి నిధులు నేరుగా అందేవి. ప్రస్తుత ప్రభుత్వం ఈ నిధులు పంచాయతీలకు చేరకుండా దారి మళ్లిస్తున్నది. పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి లేకపోవడంతో కార్మికులు, ఉద్యోగులు, సిబ్బందికి వేతనాలు చెల్లించే పరిస్థితి లేకుండా పోయింది.

ఈ మధ్య కాలంలో ప్రపంచ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సదస్సు మరియు ప్రపంచ తెలుగు మహాసభలను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్ నగరంలో జరిగిన "ప్రపంచ ఆర్థిక వేదిక" సదస్సుకు మన రాష్ట్ర పురపాలక మరియు ఐటీ శాఖా మంత్రి కె.తారకరామారావు హాజరై తెలంగాణలో పెట్టుబడులు పెట్టండని పారిశ్రామికవేత్తలను కోరాడు. అక్కడి నుంచి దుబాయ్ వెళ్లి ఒక పారిశ్రామిక ఒప్పందాన్ని కుదుర్చుకొని భారత్ తిరిగి వచ్చాడు. స్టార్టప్ కంపెనీలను, సాఫ్ట్‌వేర్ కంపెనీలను తెలంగాణలో పెట్టుబడులు పెట్టండని ప్రభుత్వం కోరుతున్నది. వీటికి కావాల్సిన మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించనున్నట్టు హామీలిస్తున్నది. కొత్తగా ఏర్పడిన తెలంగాణలో జిల్లా కేంద్రాల నుండి వివిధ పట్టణాలకు, గ్రామాలకు రోడ్లు వేయడం, విస్తరించడం చేస్తున్నది. పెద్దపెద్ద సాగునీటి ప్రాజెక్టులను ఇప్పటికే చేపట్టిన విషయం మనందరికీ తెలుసు. హైదరాబాద్ నగరంలో ఫ్లై ఓవర్ల నిర్మాణం, మెట్రో రైలు ప్రాజెక్టుల నిర్మాణం, అంతర్గత రోడ్లు, విమానాశ్రయ సర్వీసులు, తదితర అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. ఇంకా అనేక అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నది. ఈ పనులన్నింటినీ "పబ్లిక్ – ప్రైవేట్" పార్ట్‌నర్‌షిప్‌లో చేపడుతున్నది. వీటికి నీళ్లు, భూమి వంటి మౌలిక వసతుల అవసరం ఉన్నది. ఈ భూములన్నీ గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్నాయి. ఈ భూములను సేకరించడంలో ప్రభుత్వాలకు చట్టబద్ధ సమస్యలు ఎదురౌతున్నాయి. ఇప్పుడున్న పంచాయతీరాజ్ చట్టాలు ప్రజలకు, రైతులకు కొంత మేర అండగా ఉన్నాయి. స్థానిక ప్రభుత్వాలుగా చెప్పబడే గ్రామ పంచాయతీ పాలనా వ్యవస్థలను వాటి ప్రజాస్వామిక స్వభావాలను నాశనం చేయకుండా పెట్టుబడి స్వేచ్ఛగా ప్రవహించదు. పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు తేవడం ద్వారా పెట్టుబడి స్వేచ్ఛగా ప్రవహించడానికి కావాల్సిన అడ్డంకులు మరింత సరళీకరించుకోవడానికి వీలు పడుతుంది. అందుకే పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కేంద్ర ప్రభుత్వం ఆర్థిక రంగంలో మాత్రమే సంస్కరణలు తేవడం ఒక్కటే పెట్టుబడుల ప్రవాహానికి సరిపోదని గుర్తించింది. పాలనా రంగంలో ప్రజాస్వామిక ప్రక్రియలను బలహీనం చేయడం ద్వారా మరింత స్వేచ్ఛగా పెట్టుబడుల ప్రవాహం జరుగుతుందని భావించాయి. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీని అమలు చేయడం వలన పాలనా రంగ స్వరూపంలో కొంత మార్పును తెచ్చింది. ఈ రెండు చర్యల వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉండాల్సిన స్వయం పాలిత, ప్రజాస్వామిక, ఫెడరల్ స్ఫూర్తి ప్రమాదంలోకి నెట్టబడింది. కేంద్ర ప్రభుత్వాలు రాష్ట్రాల హక్కులను హరిస్తున్నాయని గగ్గోలు పెట్టిన రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల హక్కుల గురించి ఏనాడూ పట్టించుకోలేదు. ఈ మధ్య కాలంలో విద్యారంగంలో కూడా కేంద్ర ప్రభుత్వం కొన్ని సంస్కరణలు తీసుకొచ్చింది. ఇంజనీరింగు, మెడిసిన్‌లో జాతీయ స్థాయి ఉమ్మడి ప్రవేశ పరీక్ష నెలకొల్పింది. భవిష్యత్‌లో విద్యాసంబంధ పాలనలో కేంద్ర, రాష్ట్రాల మధ్య విబేధాలు తీవ్రమయ్యే పరిస్థితి దాపురించింది. రాష్ట్రాలకు, కేంద్రానికి ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ ప్రయత్నిస్తున్నది. దీనిద్వారా ఎన్నికల ఖర్చు తగ్గించుకోవాలన్న అసంబద్ధ వాదనలు ముందుకు తెస్తున్నది.

వార్డు మెంబర్ మొదలుకొని ప్రధాన మంత్రి ఎన్నిక వరకు ఇప్పుడున్న ఎన్నికల ప్రక్రియ అనేక లోటుపాట్లతో అప్రజాస్వామికంగా ఉన్నదని దేశంలో అనేకమంది ఏకరువు పెడుతున్నారు. అమెరికా, బ్రిటన్, జపాన్, తదితర అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఆయా రాజకీయ పక్షాలు పొందిన ఓట్ల దామాషాలో సీట్ల కేటాయింపులుంటున్నాయి. ఈ పద్ధతి ద్వారా చట్టసభలలో అన్ని పక్షాల అభ్యర్థిత్వాలకు అవకాశం లభించి ప్రజల సమస్యల పట్ల ఫలప్రదమైన చర్చలు జరుగుతున్నాయని అందుకే దామాషా ఎన్నికల విధానం తీసుకురావడం ద్వారా ఇప్పుడున్న ప్రజాస్వామిక ప్రక్రియను బలోపేతం చేయాలని అనేకమంది ప్రజాస్వామికవాదులు కోరుతున్నారు. భారతదేశంలో ఎన్నికలను, పాలనను మరింత ప్రజాస్వామీకరించుకోవాలన్న డిమాండ్లు ముందుకొస్తున్న తరుణంలో ఉన్న కొద్దిపాటి ప్రజాస్వామిక విలువలను వాటి వ్యవస్థలను పాలకులు నాశనం చేయడం ప్రారంభించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని లోపాలను సరిదిద్ది ప్రజాస్వామిక ప్రక్రియను బలోపేతం చేయాల్సిన పాలకవర్గాలు పెట్టుబడిదారుల పెట్టుబడి అవసరాల కోసం ప్రజలకు కొద్దిపాటి రక్షణ కల్పిస్తున్న చట్టాలను కూడా మార్చడం వలన ప్రజల చేత, ప్రజల కొరకు, స్వయంపాలన, స్వయం సమృద్ధి వంటి ప్రజాస్వామిక మౌలిక సూత్రాలను తుంగలో తొక్కుతున్నాయి.

సెల్ : 9441731670

సత్యం కోసం చావును ముద్దాడిన బ్రూనో



తోకల రాజేశం

ఈ సకల చరాచర సృష్టికి సంబంధించి ఎవరెన్ని ప్రశ్నలు సంధించినా వాటికి సంతృప్తికరమైన సమాధానాలందిస్తుంది సైన్స్. సమాధానాలందించకుండా తప్పించుకోవటం సైన్స్ చేసే పనికాదు. అది మతాలు చేసే పని. మతాలు సృష్టించిన పవిత్ర గ్రంథాలు చేసే పని. మతాలు ప్రశ్నినే సహించవు. ప్రశ్నించటం వాటి దృష్టిలో మహాపాపం. ప్రశ్నిస్తున్న వారినల్లా చంపుకుంటూ పోవటం మతాలు ప్రాచీనకాలం నుంచి ఒక నియమంగా పాటిస్తున్నాయి. మతాలు మారేవి కావు. వాటి విలువలు మారేవి కావు. వాటి పవిత్ర గ్రంథాలు మారటానికి అసలే వీలు లేదు. రెండు వేల ఏండ్ల కిందట రాయబడిన మత గ్రంథం అప్పుడేం చెప్పిందో ఇప్పుడూ అదే చేస్తుంది. మరో రెండు వేల ఏండ్లకూ అదే చెప్తుంది. ఈ విషయంలో అన్ని మత గ్రంథాలూ ఒక్కటే. దాదాపు అన్ని మత గ్రంథాల్లో సూర్యుడు, చంద్రుడు, భూమి లాంటి దేవుళ్లు, దేవతలుగా చిత్రీకరించబడ్డాయి. హిందూ మతంలోనైతే ఏకంగా నవ గ్రహ పూజలున్నాయి. అయితే మతస్తులందరి లెక్క ప్రకారం సూర్యుడు ఒక గ్రహం. కానీ సైన్స్ సూర్యుడిని ఒక నక్షత్రమని ధృవీకరించింది. మన నవ గ్రహాల్లో ఒకటైన చంద్ర గ్రహం భూమికి ఉపగ్రహం. దారుణమైన విషయమేమంటే క్రైస్తవ మతానికి చెందిన బైబిల్ ప్రకారమైనా, హిందూ మతానికి చెందిన వాళ్లు విశ్వసించే జ్యోతిష్యం ప్రకారమైనా సూర్యుడు భూమి చుట్టూ తిరుగుతున్నాడన్నది విశ్వాసం. కానీ నిజమది కాదు కదా. భూమే సూర్యుని చుట్టూ తిరుగుతుందని సైన్స్ నిరూపించింది. అయితే సైన్స్ చెప్పే సత్యాలు ఒకప్పుడు అంత సులభంగా ప్రజామోదం పొందలేదు. ఆయా కాలాల్లో మత భావాలు సైన్స్‌నీ, శాస్త్రవేత్తల్ని వ్యతిరేకించి అనేక ఇబ్బందులకు గురిచేశాయి. మతాల మాటలు వినకుండా సత్యం వైపు నిలబడ్డందుకు శాస్త్రవేత్తలను చంపిన ఘటనలు చరిత్రలో కోకొల్లలు. అయినా సైన్స్ పురోగమనాన్ని మతాలు అడ్డుకోలేకపోయాయి. సత్యం వైపు నిలబడి శాస్త్రవేత్తలు ఆకాశమంత ఎత్తుకు ఎదిగితే మూఢ విశ్వాసాలను సమర్థిస్తూ మతాలు పాతాళం వైపుకు ప్రయాణిస్తున్నాయి. అయితే సూర్యుని చుట్టూ భూమి తిరుగుతున్నదన్న సత్యాన్ని ప్రచారం చేసినందుకు క్రైస్తవ మతం బ్రూనోను సజీవ దహనం చేయించింది. మన పార్లమెంటుపై టెర్రరిస్టులు దాడి జరిపినప్పుడు పార్లమెంటు వాస్తు ప్రకారం నిర్మించబడలేదనీ, కాబట్టే అలాంటి దాడి జరిగిందనీ, అందుకోసం పార్లమెంటు వాస్తు ప్రకారం మార్చాలనీ వాస్తు, జ్యోతిష్య పండితులు కొందరు డిమాండ్ చేశారు. 20వ శతాబ్దంలోనే ఇంత తెలివిమంతులుంటే 16వ శతాబ్దంలో ఇంకెంత తెలివిగలవారు ఉండేవారో అర్థం చేసుకోవచ్చు. జోర్డాన్ బ్రూనో (ఇటలీ), కోపర్నికస్ (1473–1543) వెవరించిన సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని (సూర్యుని చుట్టే గ్రహాలు తిరుగుతున్నాయని) ప్రచారం చేశాడు. కోపర్నికస్‌కు ముందు అరిస్టాటిల్ ఆయన తరువాత టాలెమిలాంటి భావవాదులు కూరుకుపోయిన తత్త్వవేత్తలు భూ కేంద్రక సిద్ధాంతాన్ని బలపరిచారు. వీళ్ల కాలంలోని వాడే పైథాగరస్. ఆయన కూడా సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని సమర్థించాడు. భూ కేంద్రక, సూర్య కేంద్రక సిద్ధాంతం మీద సమగ్రమైన అధ్యయనం చేసిన కోపర్నికస్ సూర్య కేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించి అప్పటి వరకు ఎవ్వరూ చెప్పని అనేక కొత్త విషయాలను చెప్పారు. అయితే ఈ కృషిని కోపర్నికస్ మతానికి విధేయుడుగా ఉంటూనే చేశాడు. మతానికి వ్యతిరేకమైన భావాలను ప్రచారం చేసిన వాళ్లను శిక్షించటానికి ఆనాటి క్రైస్తవ మతానికి 'ఇంక్విడిషన్' అనే మత న్యాయస్థానం ఉండేది. ఇది శాస్త్రజ్ఞులకు కఠోరమైన శిక్షలు విధించేది. మరణ శిక్షలు కూడా వేసేది. దీనికి భయపడి కోపర్నికస్ తన శాస్త్రీయ సత్యాలను ప్రచారం చేయలేదు. ఆ బాధ్యతను భుజం మీద వేసుకున్న వాడే బ్రూనో.

బ్రూనో కూడా మొదట దైవ భక్తుడే. 1572లో క్రైస్తవ మత ప్రచారకుడిగా నియమింపబడ్డాడు. అయినప్పటికీ నిర్భయంగా కోపర్నికస్ సిద్ధాంతాన్ని ప్రచారం చేశాడు. సూర్యకేంద్రక సిద్ధాంతానికి తన పరిశోధనలు కూడా జోడించి "అనంత విశ్వ సిద్ధాంతాన్ని" ప్రతిపాదించాడు బ్రూనో. విశ్వం గురించి ఈయన చెప్పే విషయాలు బైబిల్ చెప్పిన వాటికి విరుద్ధంగా ఉండేసరికి క్రైస్తవ మత పెద్దలకు ఆగ్రహం కల్గింది. ఎన్ని సార్లు బెదిరించాలని చూసినా బ్రూనో భయపడలేదు. సత్యానికే కట్టుబడి ఉన్నాడు. 1592లో వెనిస్‌లో మత బోధకులు పట్టుకొని దాదాపు 8 ఏండ్లపాటు గదిలో బంధించి చిత్ర హింసలకు గురిచేసినా ఆయన వెనుకంజ వేయలేదు. తన భావాలకే కట్టుబడి ఉంటానని ప్రకటించాడు. చంపుతామన్నా బెదరలేదు. చివరికి కాళ్లు, చేతులు కట్టేసి బ్రూనోను క్రీ.శ. 1600 ఫిబ్రవరి 17నాడు సజీవ దహనం చేశారు. చనిపోతూ ఆయన "నేను చెప్పే సత్యాల వల్ల నా మరణ శిక్ష వల్ల నేను పొందే బాధకంటే మీరు ఎక్కువ బాధపడుతున్నారు. భయపడుతున్నారు. సత్యం ఎల్లప్పటికీ శాశ్వతమైనది. విశ్వం గురించిన సత్యాన్ని ప్రజలు త్వరలోనే తెలుసుకుంటారని" అన్నాడు. తరువాత కాలంలో సత్యం కోసం ఆ మహానుభావుని బలిదానానికి గుర్తుగా సత్యాన్వేషణ దినోత్సవం (ఫిబ్రవరి 17) జరుపుకోవడం ప్రారంభమైంది. చరిత్రలో ఎందరో తమ అమూల్యమైన జీవితాలు త్యాగం చేస్తే కానీ మనం ఈనాడు అనుభవిస్తున్న సౌకర్యాలన్నీ సమకూరలేదు. మతం మనల్ని పాతాళంలోకి తీసుకెళ్తే సైన్స్ ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్తుంది. మన మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ అన్నట్టు దేశం ప్రగతి పథంలో పయనించటానికి ప్రధాన మార్గం సైన్స్ మాత్రమే.

సెల్ : 9676761415

పాలన ప్రజలకు చేరువ కావాలి



వినోద్‌కుమార్ సుద్దాల

కండలేని వాడికే గండం అన్నట్టుగా తయారైంది నేడు దేశంలోని పేద ప్రజల పరిస్థితి. స్వాతంత్ర్యం వచ్చి 70 వసంతాలు గడిచినా పేదవాడికి సంక్షేమ పథకాలైనా అందని దుర్భరస్థితి. ప్రభుత్వ సేవలను పొందటంలో ఎదురవుతున్న ఇబ్బందులు తీర్చేలా నేటికీ వ్యవస్థలో మార్పు రాలేదు. స్వాతంత్ర్య అనంతరం 14 రాష్ట్రాలుగా ఉన్న మన దేశం నేడు 29 రాష్ట్రాలుగా మారినప్పటికీ నేటికీ పాలన సామాన్యుడికి చేరువ కాలేకపోయింది. అవినీతి, అక్రమాలు, బంధుప్రీతి, అధికార దుర్వినియోగం, అలక్ష్యం లాంటి అంశాలు ప్రభుత్వ పాలనా వ్యవస్థను పట్టిపీడిస్తుండగా, నిరక్షరాస్యులైన సామాన్యులకు, అక్షరాస్యులైనా ఆర్థికంగా లేనివారికి సేవలు, న్యాయం అందని ద్రాక్షగానే మారిందనటంలో అతిశయోక్తి లేదు. అదే స్థాయిలో ఉద్యోగ నియామకాలు జరగకపోవడంతో నిజమైన పాలనా సౌలభ్యం రాలేదనే చెప్పాలి. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటయ్యాక చేపట్టిన అనేక వినూత్న సంక్షేమ కార్యక్రమాల వల్ల, ఉన్న ఉద్యోగులపైనే తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. ముఖ్యంగా భూ దస్త్రాల పక్షాళన, సాదాబైనామా, కళ్యాణలక్ష్మి, గొర్రెల పంపిణీ వంటి వినూత్న పథకాలతో ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇలాంటి పథకాలు విజయవంతం కావాలంటే మరింతగా మానవ వనరులను పెంచుకోవాలి. అర్హులను దూరం చేస్తూ అనర్హులను ఎంపిక చేయడం, చేతివాటం ప్రదర్శించడం, రాజకీయ ఒత్తిళ్లు, దళారుల ప్రమేయం, అలసత్వం లాంటి అంశాలతో నేటి పాలనా వ్యవస్థ కొట్టుమిట్టాడుతున్నది. అంతా అంతర్జాలమయమైన నేటి సమాజంలో ఇప్పటికీ పాత దరఖాస్తు పద్ధతులపై ఆధారపడటం విడ్డూరం. ఆధునిక ఆవిష్కరణలను ఆలంబనగా చేసుకొని ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేసి ప్రతి వ్యక్తినీ అనుసంధానించి జవాబుదారీతనం పెరిగేలా, పారదర్శక వ్యవస్థ ఏర్పాటుకు కషి చేయాలి. అందుకుగాను ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపకల్పన, యాప్‌ల తయారీ (రాష్ట్ర సర్వీసులు అన్నింటికీ కేంద్రీకతంగా ఉండేలా), చరవాణి ద్వారానే వీలైనన్ని పనులు జరిగే విధానం, సంబంధిత అధికారులపై పర్యవేక్షణ పెరగాలి. పేద వర్గాలకు అందుబాటులో ఉండే అధికారుల నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు ఫిర్యాదు చేయగలిగేలా వ్యవస్థలో మార్పు తీసుకొస్తేనే నిజమైన అభివద్ధి, పారదర్శకమైన పాలన సాధ్యమవుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉమంగ్, నమో వంటి యాప్‌లు బాగానే ఉన్నా ప్రతి రాష్ట్రంలోనూ అలాంటివి వచ్చేలా కేంద్రం ఒత్తిడి చేయాలి. ఇప్పటికీ సర్టిఫికేట్ జారీకి కొందరు, ప్రభుత్వ ఆసరా కోసం కొందరు ఆర్థికంగా, మానసికంగా సతమతమవుతూ, లంచాల వల్ల బాధపడుతున్న నిర్భాగ్యులు ఎందరో ప్రతిరోజూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద తారసపడుతూనే ఉన్నారు. ప్రభుత్వానికి పన్నులు చెల్లించి ప్రజాస్వామ్యానికి మద్దతుగా నిలుస్తున్న సామాన్యులకు పాలన చేరువైనప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టుగా భావించవచ్చు. అందువల్ల ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆదర్శ పాలన కోసం జవాబుదారీతనం, పారదర్శకత పెంచేలా, త్వరితగతిన సమస్యలు పరిష్కారమయ్యేలా, పౌరుడి ఇంటికే పాలన చేరేలా ఆధునిక అంతర్జాల వ్యవస్థను వాడుకొని ప్రతి పౌరుడి ఫిర్యాదును విలువైనదిగా స్వీకరించేలా అధికార వ్యవస్థను సమూలంగా ప్రక్షాళించాలి. అందుకు అనుగుణంగా మార్పులు తెచ్చి ఫిర్యాదు వివరాలతో సహా దాని పరిష్కారం, గడువు, ప్రస్తుత స్థితి, నిర్ణయం, తుది ఫలితం, ఒకవేళ తిరస్కరణకు గురైతే కారణాలు తెలిపేలా అధికార వ్యవస్థ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించేలా పౌర సేవల హక్కు చట్టం (సమాచార హక్కు చట్టం మాదిరిగా) తీసుకురావాలి. అప్పుడే పౌరులు పనులు మానుకొని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తగ్గటమే కాక, దళారీల దందాను అదుపు చేసే వీలవుతుంది. ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో ఫిర్యాదులు తగ్గితేనే నిజమైన అభివద్ధిగా భావించాలి.

సెల్ : 9908312949

మార్పు ఇంటి నుండే రావాలి



ఎల్.బుచ్చిరెడ్డి

ప్రస్తుతం దేశంలో యువ భారతం, మానవ వనరుల మీద చర్చ సాగుతున్నది. మానవ వనరులు అనగానే మనకు మొదట స్ఫురించేది యువత. దేశ భవిష్యత్తు యువత మీద ఆధారపడి ఉంటుందని వివేకానందుడు ఏనాడో చెప్పారు. యువత ఎలా ఉండాలి, వారి వ్యక్తిత్వం ఎలా నిర్మించబడాలనేది చాలా ప్రాముఖ్యత కలిగిన విషయం. మనం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక యుగంలో ఉన్నాం. వీటి ఫలితంగానే పలు రంగాలలో కొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో కూడా అవి కొనసాగుతాయి. యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఉపకరణాలను ఉపయోగించడంలో ముందుంటారు. యువత భవిష్యత్, గమనం అందంగా ఉండాలనే ప్రతి ఒక్కరు ఆశిస్తారు. కానీ నేటి యువత/ బాల్యం అడుగులు సవ్యమైన దిశలో సాగే పరిస్థితుల గురించి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. దీనికి బీజం ప్రాథమికంగా ఇంట్లోనే పడాలి. ఇంటి భౌతిక, బౌద్ధిక వాతావరణం సానుకూలంగా ఉండాలి. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు తగిన శ్రద్ధ వహించాలి. భారతదేశంలో పిల్లల పెంపకం మీద పెండ్లయిన యువతీ యువకులకు సరైన అవగాహన కల్పించడం కోసం ఎలాంటి శిక్షణలు లేవు. కనుక పిల్లల పెంపకంలో మనం వెనుకటి తరాలకన్నా అంత భిన్నంగాలేమని చెప్పాలి. అతి క్రమశిక్షణ, అతి గారాబం, పిల్లల్ని దండించడం ఇలాంటివి ఇంకా చూస్తూనే ఉన్నాం. పెంపకం విషయంలో తగినంత శిక్షణ లోపమే ఇది. ధనార్జన ప్రాముఖ్యత సంతరించకోవడం మూలాన బిడ్డల మానసిక అభివృద్ధికి సమయం కేటాయించడంలేదు. చదువు, సంపాదన దాని కోసం ఉద్యోగం అనే దృక్పథం పెరగటం, పాఠశాలలు, ఉపాధ్యాయులు ఈ విషయంలో పిల్లలకు తగిన ఆసక్తి కల్పించకపోవడం కొన్ని కారణాలు. సాహిత్యం మీద ఆసక్తి ఉన్న కుటుంబాలను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. కేబుల్ టీవీల ప్రభావం వలన గణనీయంగా పుస్తక పఠనాసక్తిపోయింది. మొబైళ్ల ప్రభావం వలన దురదృష్టవశాత్తూ పుస్తకాలకు బదులుగా వాట్సాప్, ఫేస్‌బుక్‌లను గంటల తరబడి చూడటం మొదలైంది. ఉన్నత చదువులు చదివిన వారి నుంచి సాధారణ స్థాయి విద్యావంతులు కూడా సామాజిక వెబ్‌సైట్లకు దాసోహమైపోతున్నారు. బిడ్డల అభివృద్ధి సవ్యంగా ఉండాలంటే పుస్తక పఠనం చేయించాలి. వారిలో ఆసక్తిని పెంచాలి. ఇంటిని గ్రంథాలయంగా మార్చాలి. ఇంటి వాతావరణం తప్పక ఉపయోగపడుతుంది. కథలు, కవితలు, నాటికలు గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదివించాలి. సమకాలీన సమాజం పట్ల అవగాహన పెంచే విధంగా చదవడం అవసరం. ముఖ్యమైన విషయాల గురించి చర్చ జరిగే సందర్భంలో చర్చలు ప్రజాస్వామ్య బద్ధంగా ఉండాలి. పెద్దలు తమ అభిప్రాయాలను పిల్లల మీద రుద్దకూడదు. తల్లిదండ్రులు ఈ ప్రమాదంలోకి పిల్లల్ని నెట్టకూడదు, ఎదుటి వారి మాట్లాడే స్వేచ్ఛను గౌరవించాలి. మన అభిప్రాయాలను స్పష్టంగా చెప్పాలి. కొత్తగా తెలుసుకున్న విషయాలను నేర్చుకున్న విషయాల నేపథ్యంలో సవరించుకోవడం పిల్లలకు నేర్పాలి. ఆటలు, సంగీతం, నృత్యం, చిత్రలే ఖనం, అభ్యసించేవిధంగా ప్రేరణ కలిగించాలి. వారిలో ఒక కవి, రచయిత, గాయకుడు, చిత్రకారుడు తప్పక ఉంటాడు. వెలికితీసే ప్రయత్నం చేయాలి. సామాజికాంశాల పట్ల ఆసక్తి పెంచాలి. సామాజికాంశాలు చర్చించే సభలకు పిల్లలను తీసుకెళ్లాలి. వాటి ప్రభావంతో మార్పువచ్చే అవకాశం ఉన్నది. నేడు ప్రధానంగా పట్టణ, నగరాల పిల్లలు వ్యసనాల బారిన పడుతున్నారు. పది, 12 సంవత్సరాల పిల్లలు మద్యం సేవించి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. తోటి వారిని హింసించి వికృతానందం పొందుతున్నారు.

ఇది నెమ్మదిగా గ్రామాలకు పాకింది. కార్పొరేటు విద్యా సంస్థల్లో చదివే పిల్లలు మద్యం, మాదకద్రవ్యాలు సేవిస్తున్న వార్తలు చదువుతున్నాం. మాదకద్రవ్య స్మగ్లర్లు, విక్రేతలు పిల్లలను, యువకులను టార్గెట్ చేస్తున్నారు. మాదక ద్రవ్య విక్రేతలపై సర్కారు మెతక వైఖరి కలవరపరుస్తున్నది. చట్టాల నుండి తప్పించుకునే వెసులుబాటు పుష్కలంగా ఉన్నది. అనేక విషయాలలో ప్రభుత్వాల అలసత్వం, బాధ్యతారాహిత్యం, కనబడుతూ ఉన్నది. మద్యం అమ్మకాలపై ఆంక్షలు లేవు సరికదా! ప్రభుత్వమే మద్యాన్ని ప్రోత్సహిస్తుంది. రోడ్లకు, పాఠశాలలకు అతి సమీపంలో మద్యం విక్రయించబడుతోంది. సమాజంలో పురుషుల ఆధిపత్యం కొనసాగుతున్నది. స్త్రీని భోగ వస్తువుగా చూసే సంస్కృతి వలన వారి మీద దాడులు, అత్యాచారాలు, మానభంగాలు జరుగుతున్నవి. కార్పొరేట్ విద్యాలయాల్లో చదివే విద్యార్థులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. ర్యాంకులు, మార్కులే కొలమానంగా భావించే పరిస్థితి దాపురించింది. ఈ మధ్య "బ్లూ వేల్" అనే వికృత క్రీడ భారతదేశంలో నలుగురి బంగారు భవిష్యత్తును చిదిమేసిన విషయం దారుణం. ఇదొక దుర్మార్గమైన ఆన్‌లైన్ గేమ్. దీనికి మానసిక దుర్బలురు, దారితప్పిన యువకులు మాత్రమే గురౌతారు. మాదక ద్రవ్యాలు నీలిచిత్రాల విష సంస్కృతి వెనుక సర్కారు నిర్లక్ష్యం వహించడం దుర్మార్గమైనది. నేడు దేశంలో విద్యా వ్యాపారం జరుగుతున్నది. విద్యార్థి మార్కెటు సరుకు అంటే విద్య వినిమయ వస్తువు. వ్యాపార లక్ష్యం ధనార్జన. ధనార్జనకు విలువలుండవు సమాజం ఏమైపోయినా వారికి పట్టదు. వారి నుంచి మంచి ఆశించడం ఇసుక నుంచి తైలాన్ని తీసినంత కష్టం. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమ విద్య అందించాలని ఆశించడం, వారు తమకన్నా గొప్పగా జీవితంలో రాణించాలని కోరుకుంటారు. పిల్లల కోసం డబ్బు సమకూర్చడం ఒక్కటే మన బాధ్యతవుతుందా! డబ్బు జీవితానికి కావాల్సిన సంతృప్తిని ఎప్పటికీ ఇవ్వలేదు. డబ్బు వేరు జీవితం వేరు. పిల్లలు శారీరక శ్రమను గౌరవించేవిధంగా తర్ఫీదును ఇవ్వాలి. కొన్ని వృత్తులు శారీరక శ్రమతో కూడుకున్నవైతే మరికొన్ని మానసిక శ్రమతో. శారీరక శ్రమను మానసిక శ్రమను సమానంగా ఆదరించేట్టు మన విద్యా విధానం ఉండాలి. పిల్లలు శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆరాధించేలా తల్లిదండ్రులు చేయాలి. విద్యలో కూడా అది భాగం కావాలి. చదువు శ్రమనుంచి విముక్తి కల్గిస్తుందనే భ్రమతో పిల్లల్ని పెంచుతున్నాం. మార్కులకు, గ్రేడులకు, ర్యాంకులకు విలువనిచ్చే విద్యా వ్యవస్థ పోవాలి. ప్రతి విద్యార్థిపై శ్రద్ధపెట్టే చదువు, ప్రగతికి శ్రమకి, జీవితానికి శ్రమకు, ఉన్న సంబంధాల్ని ప్రత్యక్షంగా పిల్లలు అనుభవించి నేర్చుకునే చదువు కావాలి. అప్పుడే చదువు ప్రతి ఒక్కరి వికాసానికి తోడ్పడగలదు. అనుభవం, విజ్ఞానం అందరి సొత్తు. భవిష్యత్ ప్రపంచానికి ప్రతి బిడ్డ తన పాత్రను పోషించే శక్తిని, నైపుణ్యాన్ని అందించే చదువును మనం అందుబాట్లోకి తెచ్చుకోవాలి.

సెల్ : 8074040133

నాసిరకం మందుల విక్రయాలు



శ్రీనివాస్ చిరిపోతుల

తెలుగు రాష్ట్రాల్లో నాసిరకం మందుల దందా విచ్చలవిడిగా సాగుతున్నది. దేశంలోని 675 జిల్లాల నుండి 57,450 మందుల నమూనాలు సేకరించారు. షాపుల్లో విక్రయించే మందులకన్నా ప్రభుత్వ వ్యవస్థాపరంగా సరఫరా చేసే మందుల్లోనే అత్యధిక శాతం నకిలీవే. దీని వెనక వ్యవస్థలోని లొసుగులు, లోపాలు, అవినీతి, అక్రమాలు చాలా చోటుచేసుకుంటున్నాయని స్పష్టమవుతోంది. మందులు సరఫరా చేసే ముందు ప్రయోగశాలల్లో వాటి నాణ్యతను పరీక్షించాలి. అలా ప్రయోగశాలకు మందులను పంపే విధానం గాడితప్పిందని చెప్పవచ్చు. దీనికి ఉదాహరణగా హైదరాబాదులోని ఓ ప్రైవేటు కంటి ఆస్పత్రిలో జరిగిన దుర్ఘటన మనందరికీ తెలిసిందే. ఆ ఆస్పత్రిలో పంపిణీ చేసిన కౌంపౌండ్ సోడియం లాక్టేట్ ఇంజక్షన్‌ను 2016మార్చిలో కొనుగోలు చేసి ఆస్పత్రికి పంపించారు. వీటికి ముందుగా ప్రయోగశాలల్లో నాణ్యత పరీక్షలు చేయించలేదు. ఔషధాల పరికరాల కొనుగోలుకు 2014–16లో బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 35శాతం వరకూ లోటు ఏర్పడింది. అలాగే ఔషధాల వాడకం వలన ఏర్పడిన లోటు భర్తీ కావడం లేదు. ఆ విధంగా ఆదిలాబాద్, హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్‌లలో పలుసార్లు భర్తీ చేయని సందర్భాలున్నాయి. 385 రకాల మందుల గడువు 2015 నాటికే ముగిసినా దీన్ని పొడిగించడంతో ప్రభుత్వ సరఫరా సంస్థలు మందులను సకాలంలో అందించలేకపోయాయి. సాధారణ రోగాల చికిత్సకు ఉపయోగపడే దాదాపు 300రకాల జనరిక్ మందులు మనదేశంలో అందుబాటులోకి వచ్చినా వాటికి తగిన ప్రజాధారణ కనిపించడం లేదు. వైద్య వ్యయంలో 70శాతం వరకూ ప్రజలే భరించాల్సివస్తోంది. ఔషధాల నియంత్రణ వ్యవస్థ ప్రకారం షోకాజ్ నోటీసులు జారీ చేసి ఏ మందులకు ఎంత తక్కువ చార్జీలకు విక్రయించారో ఆయా కంపెనీల నుండి అది తిరిగి వసూలు చేసుకొనే వెసులుబాటు ఉంది. అయితే ఇదంతా చట్టప్రకారం జరగాల్సి ఉంటుంది. ప్రస్తుత 2017–18లో ఔషధ ధరల క్రమబద్ధీకరణ వ్యవస్థ నిర్ణయించిన 56 కేసులను పరిశీలించింది.

సెల్ : 9603471199

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

షో



జెన్నీఫర్ లారెన్స్..

భిన్న పాత్రలకు, ప్రయోగాత్మక చిత్రాలకు కేరాఫ్. పాత్ర ఏదైనా సరే ప్రేక్షకులతో శభాష్ అనిపించుకున్న విలక్షణ నటి. జెన్నీ యాక్షన్ సీక్వెన్స్‌లకు ప్రేక్షకులే కాదు విమర్శకులు సైతం ఫిదా అయిపోయిన సందర్భాలు కోకొల్లలు. పారితోషికాల విషయంలో సరికొత్త రికార్డులు సృష్టించిన స్టార్ హీరోయిన్. ఉత్తమ నటిగా ప్రతిష్టాత్మక ఆస్కార్‌ను దక్కించుకున్న జెన్నీఫర్ లారెన్స్ గురించి ఈ వారం అందిస్తున్న స్పెషల్ షో...

ఎవ్వరైనా ఫిదా అయిపోవాల్సిందే..



తండ్రే గురువు..

కమర్షియల్ కథానాయికగా పేరొందిన జెన్నీఫర్ ష్రాడర్ లారెన్స్ బాల్యం సాధారణంగానే సాగింది. 1990, ఆగస్ట్ 15న అమెరికాలోని కెంటుకీలోని ఇండియన్ హిల్స్ ప్రాంతంలో జన్మించిన ఆమె తండ్రి గ్యారీ, కన్‌స్ట్రక్షన్ వర్కర్. తల్లి కరెన్, సమ్మర్ క్యాంప్ మెనేజర్. జెన్నీకి ఇద్దరు సోదరులు బెన్, బెయినె ఉన్నారు. జెన్నీ తల్లి కరెన్‌కు నాటకాలన్నా, సినిమా రంగమన్నా ఇష్టం ఉండేది కాదు. అందుకే జెన్నీని ఆ వైపు ప్రోత్సహించే ప్రయత్నం చేయలేదు అంతేకాదు జెన్నీ ఆ వైపు వెళ్ళాలనుకున్నప్పుడు కూడా వ్యతిరేకించారు. కమ్మరర్ మిడిల్ స్కూల్‌లో పాఠశాల విద్యను పూర్తి చేసిన జెన్నీ చాలా హైపర్‌యాక్టివ్. దీంతో సామాజిక ఆందోళన కలిగి ఉందన్న ఆరోపణతో తోటి విద్యార్థులు, స్నేహితులు జెన్నీపై తప్పుడు భావన కలిగి ఉండేవారు. దీని వల్ల చిన్నతనంలో పొందాల్సిన సంతోషానికి జెన్నీ దూరమైంది. నాటకాల్లో పాల్గొన్న తర్వాత తన ఆందోళనలు, ఇబ్బందులు పోయాయని పలు సందర్భాల్లో జెన్నీఫర్ తెలిపింది. జెన్నీ మంచి క్రీడాకారిణి కూడా. ఛీర్‌లీడింగ్, సాఫ్ట్‌బాల్, హాకీ, బాస్కెట్‌బాల్, గుర్రపు స్వారీ వంటి వాటిల్లో నిష్ణాతురాలు. తండ్రే గురువుగా ఇవన్నీ జెన్నీ నేర్చుకోవడం విశేషం.

అర్థం చేసుకున్న అమ్మ..

స్కూల్ టైమ్‌లోనే జెన్నీకి చర్చ్ నాటకాల్లో నటించే ఛాన్స్ వచ్చింది. అందులో ఆమె ప్రాస్టిట్యూట్‌గా నటించి మెప్పించింది. 14 ఏండ్లున్నప్పుడు యాక్టింగ్‌కు సంబంధించి ఓ ఆడిషన్ కోసం జెన్నీ పాల్గొనేందుకు వాళ్ళమ్మ అంగీకరించలేదు. ఆ తర్వాత కొన్ని రోజులకు కూతురి ఇష్టాన్ని అర్థం చేసుకున్నారు. లాస్ ఏంజెల్స్‌లో నిర్వహించిన ఆడిషన్‌లో పాల్గొనేందుకు ఒప్పుకున్నారు. అంతేకాదు గ్రాడ్యుయేషన్ పూర్తి చేయాలనే కండీషన్ కూడా పెట్టారు. ఆ తర్వాత చిన్న చిన్న మోడలింగ్ ఈవెంట్స్‌లో పాల్గొంది. ఈ క్రమంలో 2006లో మొదట టెలివిజన్‌లో నటించే ఛాన్స్ వచ్చింది. 'కంపెనీ టౌన్' అనే టెలివిజన్ ఫిల్మ్‌లో చిన్న పాత్ర పోషించింది. ఆ తర్వాత 'మంక్', 'మీడియం' వంటి చిత్రాల్లో అతిథి పాత్రల్లో కనిపించారు. టీబీఎస్ నిర్మించే టెలివిజన్ ఫిల్మ్ 'ది బిల్ ఎంగ్వాల్ షో' లో రెగ్యులర్ కాస్ట్‌గా జెన్నీ ఎంపికైంది. ఇందులో రెబల్ టీనేజ్ డాటర్‌గా నటించి మెప్పించారు. ఇది మూడు సీజన్స్‌లో టెలికాస్ట్ అయ్యింది. దీనికిగానూ 'ది వాషింగ్టన్ పోస్ట్' అందించే యంగ్ ఆర్టిస్టు అవార్డును దక్కించుకుంది. జెన్నీ సినిమా ఎంట్రీ 2008లో జరిగింది. 'గార్డెన్ పార్టీ' చిత్రంలో ఇబ్బందులు పడే టీనేజ్ అమ్మాయిగా నటించి అందరినీ మంత్రముగ్దుల్ని చేసింది. పూర్తి స్థాయి పాత్ర పోషించిన ఫీచర్ ఫిల్మ్ 'ది బర్నింగ్ ప్లెయిన్'. ఇందులో టీనేజ్ డాటర్‌గా అలరించింది. ఆ తర్వాత చేసిన 'ది బోస్టన్ గ్లోబ్' చిత్రంలో తనదైన నటనతో ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇక డ్రామా నేపథ్యంలో రూపొందిన 'ది పోకర్ హౌస్' చిత్రంలో మద్యానికి బానిసైన తల్లికి చెందిన ముగ్గురు కూతుళ్ళలో ఒకరిగా జెన్నీ నటన ప్రేక్షక హృదయాలను కట్టిపడేస్తుంది. ఆ తర్వాత చేసిన 'వింటర్ బోన్', 'ది న్యూ యార్కర్' జెన్నీకి మంచి బ్రేక్ ఇచ్చిన చిత్రాలు. ఈ చిత్రాల్లో స్ట్రగుల్స్ పడే అమ్మాయిగా, ఊహించని నటనా ప్రతిభను కనబర్చి విమర్శకుల ప్రశంసల్ని సైతం అందుకుంది. 'రోలింగ్ స్టోన్' చిత్రంలో అత్యద్భుతమైన నటన ప్రతిభను కనబర్చి ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. నేషనల్ బోర్డ్ రివ్యూ అవార్డును అందుకోవడం విశేషం. ఇలా వరుసగా 'లైక్ క్రేజీ', 'ది బీవర్' చిత్రాలతో అందరినీ ఆకట్టుకుంది.

నట విశ్వరూపానికి తెర రూపాలు

2011లో వచ్చిన 'ఎక్స్‌మెన్: ఫస్ట్ క్లాస్' చిత్రం జెన్నీ కెరీర్‌నే మలుపు తిప్పింది. ఈ సూపర్ హీరో చిత్రంలో మిస్టిక్ పాత్రలో అద్భుతమైన యాక్షన్ సీక్వెల్‌లతో యావత్ ప్రపంచ ప్రేక్షకులను ఫిదా చేసింది జెన్నీ. ఆ తర్వాత 'ది హంగర్ గేమ్స్'లో నటించింది. ఈ రెండు చిత్రాలు జెన్నీని కమర్షియల్ హీరోయిన్‌గా మార్చాయి. అంతేకాదు వరల్డ్ వైడ్‌గా మోస్ట్ పాపులర్ హీరోయిన్‌ని చేశాయి. ఈ క్రమంలో సిల్వర్ లైనింగ్స్ ప్లేబుక్', 'హౌస్ ఎట్ ది ఎండ్ ఆఫ్ ది స్ట్రీట్', 'ది డెవిల్ యు నో', 'ది హంగర్ గేమ్స్: క్యాచ్ ఫైర్', 'అమెరికన్ హస్టిల్', 'ఎక్‌మెన్: డేస్ ఆఫ్ ఫ్యూచర్ పాస్ట్', 'సెరెనా', 'ది హంగర్ గేమ్స్: మాకింగ్‌జాయ్' – పార్ట్ 1, పార్ట్ 2, 'డియోర్ అండ్ ఐ', 'జాయ్', 'ఏ బ్యూటిఫుల్ ప్లానెట్', 'ఎక్స్‌మెన్ : అపోకలిప్సె', 'ప్యాసెంజర్స్', 'మదర్' చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషించి తన నట విశ్వరూపం చూపించింది. అంతేకాదు ప్రపంచంలోనే అత్యధిక పారితోషికం అందుకున్న కథానాయికగానూ పేరు తెచ్చుకుంది. దీంతోపాటు 'రెడ్ స్పారో', 'ఎక్స్‌మెన్: డార్క్ ఫోనిక్స్' చిత్రాలు ఈ ఏడాదిలో విడుదల కానున్నాయి. జెన్నీ చేసిన టెలివిజన్ ఫిల్మ్ 'కంపెనీ టౌన్', 'మంక్', 'కోల్డ్ కేస్', 'మీడియం', 'ది బిల్ ఎంగవాల్ షో', 'సాటర్డే నైట్ లైవ్', 'జిమ్మీ కిమ్మెల్ లైవ్' ప్రధానంగా ఉన్నాయి. జెన్నీ మంచి సింగర్ కూడా. 'ది హంగర్ గేమ్స్' చిత్రంలో 'ది హ్యాంగింగ్ ట్రీ' అనే పాట పాడి అందరినీ అలరించింది. ఇది అప్పట్లో బాగా పాపురల్ సాంగ్.

సాఫీగా సాగని ప్రేమ జీవితం..

'ఎక్స్‌మెన్: ఫస్ట్‌క్లాస్' సినిమా టైమ్‌లో సహనటుడు నికోలస్ హాల్ట్‌ని ప్రేమించింది. దాదాపు మూడేండ్ల వీరి ప్రేమబంధానికి 'ఎక్స్‌మెన్: డేస్ ఆఫ్ ఫ్యూచర్ పాస్ట్' చిత్రంతో బ్రేక్ పడింది. ఆ టైమ్‌లోనే జెన్నీకి చెందిన నగ్న ఫొటోలు సోషల్ మీడియాలో లీక్ అయ్యాయి. దీంతో ఇదొక పెద్ద వివాదంగా మారింది. జెన్నీ దీన్ని అతిపెద్ద 'సెక్స్ క్రైమ్'గా అభివర్ణించింది. ఈ లీకేజీకి కారణం ప్రియుడు నికోలస్ హాల్ట్ అనే ఆరోపణలు కూడా వచ్చాయి. 2014 తర్వాత తన నివాసాన్ని కాలిఫోర్నియాకు మార్చింది. అక్కడ మరో నటుడు క్రిస్ మార్టిన్‌తోనూ అనుబంధాన్ని కొనసాగించినప్పటికీ అది కూడా సాఫీగా సాగలేదు. ప్రస్తుతం 'మదర్' సినిమా డైరెక్టర్ డర్రెన్ అరోనోఫ్స్కీతో డేటింగ్‌లో ఉంది.

సేవా కార్యక్రమాలు..

బర్త్ కంట్రోల్‌కి సంబంధించిన 'ప్లాన్డ్ పేరెంట్‌వుడ్' ఆర్గనైజేషన్‌కు సపోర్ట్‌గా జెన్నీ ప్రచారం చేసింది. మహిళల ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంది. అంతేకాదు హాలీవుడ్‌లో జెండర్ పే గ్యాప్(మహిళలకు తక్కువ వేతనానికి సంబంధించినది) విషయంలోనూ బహిరంగంగానే పోరాటం చేసింది. సొంత అనుభవాలతో ప్రముఖ ఆన్‌లైన్ మీడియాకు కథనం కూడా రాసింది. పేదల కోసం, తిండిలేని వారి కోసం జెన్నీ 'వరల్డ్ ఫుడ్ ప్రొగ్రామ్, ఫీడింగ్ అమెరికా' వంటి పలు ఛారిటబుల్ సంస్థలకు విరాళం అందించడంతోపాటు వాటి తరపున సేవా కార్యక్రమాలు, ఫండ్ రైజింగ్ చర్యలూ చేపట్టింది. ఓమేజ్, డూ సమ్‌థింగ్ వంటి సంస్థల తరపున పలు ఛారిటీ కార్యక్రమాలు నిర్వహించింది. ఆ తర్వాత జెన్నీఫర్ లారెన్స్ ఫౌండేషన్‌ను స్థాపించింది. దీని ద్వారా స్పెషల్ ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు ప్రోత్సహించేవారు. 2016లో రెండు మిలియన్ డాలర్లను కోస్టైర్ హస్పిటల్‌కు విరాళం అందించి మానవత్వాన్ని చాటుకుంది. రిప్రెసెంట్ యుస్ సంస్థలో బోర్డ్ మెంబర్‌గానూ ఉన్నారు. అవినీతి రహిత సమాజం కోసం ఈ సంస్థ పనిచేస్తుంది. మహిళలపై వేధింపుల నిరోధానికి సంబంధించి హాలీవుడ్‌లో 300 మంది మహిళలతో ఓ టీమ్‌ను తయారు చేశారు. 2011లో అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కమిటీలో సభ్యురాలిగానూ జెన్నీ పని చేసింది.

స్వీట్ హార్ట్..

నటిగా ఆమె అగ్ర స్థానానికి చేరుకున్నప్పటికీ జెన్నీ ఎలాంటి యాక్టింట్ స్కూల్‌కి వెళ్ళలేదు. ఇతరులను గమనిస్తూనే నటనలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అంతేకాదు చాలా డౌన్ టు ఎర్త్ పర్సన్. చాలా చురుకైన అమ్మాయి కూడా. ఫన్నీగా ఉంటుంది. ఎంతటి సక్సెస్ వచ్చినా తలకెక్కించుకోకుండా, ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండే లక్షణం ఆమెను హాలీవుడ్‌లో అగ్ర స్థానంలో నిలబెట్టింది. ఆమె సక్సెస్‌కు ఈ లక్షణాలు కూడా ఓ ప్రధాన కారణమని అంతర్జాతీయ మీడియా 'స్వీట్‌హార్ట్'గా జెన్నీని అభివర్ణించింది. నవతరానికి ఓ రోల్ మోడల్ అని, అత్యంత ప్రతిభ కలిగిన కథానాయికగా జెన్నీని రోలింగ్ స్టోన్ అనే మ్యాగజైన్‌లో పేర్కొన్నారు. ఎఫర్ట్‌లెస్ యాక్ట్రెస్‌గా, బ్రిలియంట్ యాక్టర్‌గా తోటి నటీనటుల ప్రశంసలనూ అందుకుంది. హాలీవుడ్ నటిగా హై ప్రొఫైల్‌ను మెయింటేన్ చేస్తూనే కొత్త తరాన్ని, నూతన ప్రతిభను ప్రోత్సహిస్తూ చిన్న బడ్జెట్ చిత్రాలు, ఇండిపెండెంట్ చిత్రాల్లోనూ నటిస్తోంది.

పారితోషికాల రికార్డులు..

2014 తర్వాత అత్యధిక పారితోషికం అందుకుంటున్న హీరోయిన్‌గా జెన్నీ రికార్డ్ సృష్టించింది. అప్పుడామె ఒక్కో సినిమాకు పది మిలియన్ డాలర్లను అందుకుంది. ఏడాదికి ఆమె పారితోషికం 34 మిలియన్ డాలర్లుగా ఉంది. 2016లో కూడా 52 మిలియన్ డాలర్ల పారితోషికాన్ని అందుకుని అత్యధిక పారితోషికం తీసుకుంటున్న కథానాయికగా మరోసారి రికార్డు సృష్టించారు. గ్లామర్ పరంగానూ పలు కాస్ట్యూమ్స్ బ్రాండ్ యాడ్స్‌లో నటించి సెక్సీయెస్ట్ ఉమెన్‌గానూ నిలిచింది. 2016లో ప్రపంచంలోనే అత్యంత ప్రభావితం చేసే వంద మంది వ్యక్తుల జాబితాలో చోటు సంపాదించింది. అలాగే ఫోర్బ్స్ ప్రకటించిన వినోద వ్యాపారంలో అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో 50వ స్థానంలో నిలిచింది. ఇక 'హంగర్‌గేమ్' సిరీస్‌కుగానూ అత్యధిక ఆదాయం పొందుతున్న యాక్షన్ హీరోయిన్‌గా గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోనూ స్థానం పొందింది. 'ఎక్స్‌మెన్', 'హంగర్ గేమ్' సిరీస్ చిత్రాలతో జెన్నీ హాలీవుడ్‌లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అగ్రస్థాయి కథానాయికగా ఓ ప్రత్యేక గుర్తింపు పొందింది.

ఉత్తమ నటిగా ఆస్కార్..

సిల్వర్ లైనింగ్స్ ప్లే బుక్' చిత్రంలోని నటనకు జెన్నీ ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డు అందుకుంది. 'వింటర్స్ బోన్', 'అమెరికన్ హస్టిల్', 'జాయ్' చిత్రాల్లో తన నటనకుగానూ ఉత్తమ నటిగా ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. దీంతోపాటు మూడు గోల్డెన్ గ్లోబ్ అవార్డులు, ఒక బ్రిటీష్ అకాడమీ అవార్డు, రెండు ఆస్ట్రేలియన్ అకాడమీ అవార్డులతోపాటు అనేక ఇతర జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను జెన్నీ దక్కించుకుంది.




భిన్న పాత్రలు.. విభిన్న చిత్రాలు

ఇమేజ్‌కు అతీతంగా ఆర్ట్ తరహా చిత్రాలు చేసి జెన్నీ నట వైవిధ్యాన్ని చూపించింది. ముఖ్యంగా కొన్ని సినిమాల్లో ఆమె నటనకు ఫిదా అవ్వలేని ప్రేక్షకులండరంటే అతిశయోక్తి లేదు. ఒక టీనేజ్ అమ్మాయి స్ట్రగుల్స్‌ను తెలిపే 'గార్డెన్ పార్టీ' చిత్రం. తల్లి చెడు అలవాట్లకు బానిసై తమని నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో ఎదుగుతున్న తోటి సోదరులను సరైన క్రమంలో తీర్చిదిద్దడం, వారి బాగోగులు చూసుకునే 14ఏండ్ల టీనేజ్ అమ్మాయిగా నటించిన 'ది పోకర్ హౌస్' సినిమా. తల్లి, కూతురు మధ్య అనుబంధం, బాల్య జీవితంలో వచ్చే ఇబ్బందులు, స్ట్రగుల్స్ తెలిపే 'ది బర్నింగ్ ప్లెయిన్' చిత్రంలో ప్రేమను వెతుక్కునే మరియానా అనే అమ్మాయిగా జెన్నీ నటన అత్యద్భుతం. ఇక పేదరికంతో మగ్గే అమ్మాయి తన శక్తి సామర్థ్యాలను, తెలివిని ఉపయోగించి ఎలా ముందుకు సాగింది, ఈ క్రమంలో రీ డాలీ పాత్రలో జెన్నీ నటనా వైవిధ్యం 'వింటర్ బోన్' చిత్రంలో ప్రత్యేకం. ఈ చిత్రం మహిళా శక్తిని చాటింది. 'లైక్ క్రేజీ', 'ది బీవర్', సిల్వర్ లైనింగ్ ప్లేబుక్' వంటి చిత్రాల్లో జెన్నీ నటనా విశ్వరూపానికి అవార్డులు క్యూ కట్టాయి. ఉత్తమ నటిగా ఆస్కార్ అందుకుంది. 'సెరెనా' చిత్రంలో సరెనాగా గొప్ప ప్రేమికురాలిగా జెన్నీ అద్భుతమైన నటన మంత్రముగ్దుల్ని చేస్తుంది. ఆ తర్వాత 'డైయోర్ అండ్ ఐ' అనే డాక్యుమెంటరీలోనూ నటించి నూతన ప్రతిభను ప్రోత్సహించింది. సమస్యల్లో ఉన్న మహిళ స్వతహాగా ఓ పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకునే కథాంశంతో రూపొందిన 'జాయ్' చిత్రంలో వ్యాపారవేత్తగా జెన్నీ మెచ్యూర్డ్ యాక్టింగ్ ఆద్యంతం కట్టిపడేస్తుంది. జాయ్ మంగానో జీవితం ఆధారంగా రూపొందిన ఈ బయోగ్రాఫికల్ కామెడీ చిత్రానికి డేవిడ్ ఓ రస్సెల్ దర్శకత్వం వహించారు. జెన్నీ నటించిన మూడో బయోపిక్ చిత్రం కావడం విశేషం. ఆ తర్వాత 'ఏ బ్యూటిఫుల్ ప్లానెట్' అనే సైన్స్ ఫిక్షన్ ప్రధానంగా రూపొందిన డాక్యుమెంటరీలోనూ నటించి ఆకట్టుకుంది. జెన్నీ నట జీవితంలో నిలిచిపోయే చిత్రాల్లో 'మదర్' ఒకటి. గతేడాది విడుదలైన ఈ సినిమా ఒక మిస్టీరియస్ జంట రావడంతో ఓ ఇంటిలోని భార్యభర్తల మధ్య వచ్చే క్లాషెస్‌ను తెలుపుతుంది. ఈ చిత్రంలో భార్య పాత్రలో జెన్నీ నటన ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తుంది. ఇక 'ప్యాసెంజర్' చిత్రంలో స్పేస్ జర్నీలో మధ్యలోనే నిద్రలేచిన ప్రేమజంటగా క్రిస్ పాట్‌తో కలిసి నటించి మెప్పించింది. నటించిన ప్రతి చిత్రంలోని ప్రతి పాత్ర భిన్నంగా ఉండటమే జెన్నీ సక్సెస్‌కి మూలకారణం.

డైరెక్టరేట్‌లో ముదురుతున్న వివాదం

- కొందరినే బదిలీ చేయడంపై విమర్శలు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో ఉద్యోగుల మధ్య వివాదం ఇప్పట్లో సద్దుమనిగేలా కనిపించడం లేదు. కొందరు ఉద్యోగులపైనే ఉన్నతాధికారులు బదిలీవేటు వేయడంపై సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డైరెక్టరేట్ కార్యాలయ ప్రక్షాళనలో భాగంగా ఇటీవల జరిగిన గొడవలతో సంబంధం ఉన్న ఆరుగురు ఉద్యోగులను వివిధ విభాగాలకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీనిలో ఇద్దరు ఉద్యోగుల డిప్యూటేషన్ కూడా రద్దు చేశారు. అయితే డైరెక్టరేట్‌లోని మహిళా ఉద్యోగిని అక్కడే పనిచేస్తున్న ఇద్దరు సూపరింటెండెంట్లపై సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో వారిపై జనవరి మూడున 506,509 సెక్షన్ల కింద కేసు కూడా నమోదైంది. ఇటీవల కమిషనర్ చేసిన బదిలీల్లో ఈ ఇద్దరిలో ఒకరిని మాత్రమే బదిలీ చేశారు. ఏ1 నిందితుడిగా ఉన్న ఓ సూపరింటెండెంట్‌ను బదిలీ చేయకుండా, ఏ2గా ఉన్న ఉద్యోగిని అధికారులు బదిలీ చేశారు. ఈ విషయాన్ని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మహిళా ఉద్యోగిని విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకుపోయింది. అయితే ఈ వివాదాల్లో ఎస్ఎస్ఏలోని మరో ఉద్యోగిని పాత్ర ఉన్నట్టు కొందరు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. ఎస్ఎస్ఏలోని ఓ ఉన్నతాధికారి వారిపై చర్యలు తీసుకోకుండా కాపాడుతున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ఫిర్యాదు చేసిన వారిపైనా చర్యలు తీసుకున్న అధికారులు, ఒక ప్రాంతానికి చెందిన వారినే బదిలీ చేయడం సరికాదని అంటున్నారు. అయితే ఇప్పటికే ఈ గొడవలపై కమిషనర్ జి కిషన్ విచారణ కమిటీ వేసిన విషయం తెలిసిందే.

'గులాబీ'లో గుబులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎల్ఎఫ్, ఇతర పార్టీలు 119 నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను నిలబెడితే ఆ పార్టీలకు ఎంత శాతం ఓట్లు పోల్ అవుతాయన్న విషయాలపై ఆయా నియోజకవర్గాల్లో టీఆర్ఎస్ ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నది. కాంగ్రెస్‌కు కోదండరామ్ చేయిందిస్తే రాష్ట్రంలో ఎన్ని సీట్లు వస్తాయి. ఈ రెండు పార్టీలు బలంగా ఉన్న నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా వ్యూహాలపై పార్టీ టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దృష్టి సారించారు. ఈ సర్వే ఆధారంగానే సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు ఇవ్వాలా? వద్దా? ఈ పార్టీలకు బలంగా ఉన్న నియోజకవర్గాల్లో ఓట్ల శాతం తగ్గకుండా ఎలాంటి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఇప్పటి నుంచే టీఆర్ఎస్ వ్యూహాలను రచిస్తున్నట్టు తెలిసింది.

బీఎల్ఎఫ్ ప్రభావంపై ఆరా?

వచ్చే సాధారణ ఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) 119 అసెంబ్లీ నియోజకవర్గాలల్లో పోటీ చేయనున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో దాని ప్రభావంపై కేసీఆర్ ఆరా తీస్తున్నారు. దీనిపై ఆ పార్టీ నేతలను, మంత్రులను అడిగినట్టు తెలిసింది. టీఆర్ఎస్‌పై కొత్త పార్టీ ఆ పార్టీ ప్రభావం ఎంత పడుతున్నదన్న దానిపై కూడా కేసీఆర్ సర్వే చేయిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో బీఎల్ఎఫ్ పోటీ చేస్తే బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఓటర్లు ఆ పార్టీకి ఓటు వేస్తారా? ఆ సామాజికవర్గాలను బీఎల్ఎఫ్ ప్రభావితం చేస్తుందా? మొత్తంగా ఆ ఫ్రంట్‌కు ఎంత శాతం ఓట్లు పోలౌతాయన్న అంశాలపై కూడా సర్వే చేస్తున్నట్టు తెలిసింది.

సిట్టింగులకు కష్టమే...

ప్రజల్లో వ్యతిరేకత, అసంతృప్తి ఉన్న ఎమ్మెల్యేల స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించనున్నట్టు వార్తలొస్తున్నాయి. దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించిన తర్వాత పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది. దానికి అనుగుణంగానే సొంత పార్టీ ఎమ్మెల్యేల పనితీరుపై కూడా సర్వే చేయిస్తున్నారు. ఒక్కొక్క నియోజకవర్గంలో సుమారు 2.30 లక్షల నుంచి 2.50 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. అందులో ఎమ్మెల్యేల పని తీరుపై ఒక్కో నియోజకవర్గంలో సుమారు 2,600 మంది ఓటర్ల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నట్టు తెలిసింది. సర్వేలో ఎమ్మెల్యేలపై ఓటర్ల నుంచి ఏ మాత్రం వ్యతిరేకత వచ్చినా ఆ నియోజకవర్గంలో కొత్త వారికి టికెట్ ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇప్పటికే కొంత మంది ఎమ్మెల్యేల పని తీరు బాగా లేదని, వారి వల్ల పార్టీకి తీవ్రమైన నష్టం జరిగిందన్న భావనలో టీఆర్ఎస్ అధినేత ఉన్నారు. మచ్చపడ్డ ఎమ్మెల్యేల స్థానంలో కొత్త వారికి టికెట్లు ఇవ్వాలన్న ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది.

హద్దులు దాటుతున్న నేతలపైనా సర్వే...

హద్దులు దాటుతున్న నేతలు, అక్కడక్కడ పార్టీ పట్ల అసంతృప్తితో ఉన్న నేతలపైనా సర్వే నిర్వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో అటువంటి నాయకులు పార్టీకి సహకరిస్తారా? లేక పార్టీకి నష్టం కలిగిస్తారా? అన్న అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఒకవేళ సర్వేలో పార్టీకి విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్టు వెల్లడవుతే కొత్త నాయకత్వాన్ని ప్రకటించాలన్న ఆలోచనలో ఉంది. ఏది ఏమైనప్పటికీ టీఆర్ఎస్‌కు ఓటింగ్ శాతం తగ్గకుండా చూడాలన్న ఆలోచనలో ఆ పార్టీ అధినేత ఉన్నట్టు సమాచారం.

సంక్షేమ పథకాలపై కూడా..

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై కూడా సర్వే నిర్వహిస్తున్నది. సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్నాయా? వాటితో ప్రజలు సంతృప్తిగా ఉన్నారా? ఇంకా ఎలాంటి కొత్త పథకాలు చేపట్టాలన్న అభిప్రాయాలను కూడా సేకరిస్తున్నారు. ఇప్పటి నుంచే పార్టీ పటిష్టతకు చర్యలు చేపట్టకుంటే వచ్చే ఎన్నికల్లో విజయం అంత సులువు కాదన్న అభిప్రాయంతోనే టీఆర్ఎస్ అధినేత ఈ సర్వేలు నిర్వహిస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

హైదరాబాద్‌లో మరో 'నిర్భయ'

నవతెలంగాణ - సిటీబ్యూరో

హైదరాబాద్ నడి బొడ్డును దారుణం జరిగింది. నిర్భయ తరహాలో బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. నోట్లో బట్టలు గుక్కి.. తలపై బండ రాళ్లతో మోది.. స్పృహ కోల్పోయిన బాలికపై మానవ మృగాలు దారుణానికి ఒడిగట్టాయి. ఈ ఘటన జరిగి రెండు నెలలు కావస్తున్నా నేటి వరకూ నిందితులను పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలొస్తున్నాయి. ఈ దారుణమైన ఘటన సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఒడిశాకు చెందిన ఆర్మీజవాన్ తన కుటుంబంతో కలిసి అమ్ముగూడ లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. ఆయన కూతురు (15) స్థానికంగా ఓ పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. బాలిక 2017 డిసెంబర్ 21న అమ్ముగూడలోని ఆశా ఆఫీసర్స్ కాలనీలో ఉన్న స్నేహితుడిని కలిసి సాయంత్రం ఇంటికి వస్తోంది. అమ్ముగూడ రైల్వే ట్రాక్ నుంచి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బాలికను అడ్డగించి బెదిరించాడు. అనంతరం చెట్ల పొదల్లోకి లాక్కెళ్లాడు. అరవకుండా ఆమె నోట్లో గుడ్డలు కుక్కి కర్రతో దాడిచేశాడు. తలపై రాళ్లతో బాదాడు. తీవ్ర గాయాలవ్వడంతో బాలిక స్పృహ కోల్పోయింది. తర్వాత ఆమెపై లైంగికదాడి చేసి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ బాలికను గమనించిన స్థానికులు తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారమందించారు. వారు అక్కడికి చేరుకుని బాధితురాలిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన జరిగిన రోజు అర్ధరాత్రి బాలిక తండ్రి తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఇప్పటి వరకూ పోలీసులు నిందితులను గుర్తించలేదు. బాధితురాలు కలవడానికి వెళ్లిన స్నేహితుడే ఈ దారుణానికి ఒడిగట్టాడా..? లేక ఎవరైనా బాలిక కదలికలు గమనించి లైంగికదాడి చేశారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విచారణ చేస్తున్నాం : పోలీసులు

ఎఫ్ఎస్ఎల్ నివేదిక కోసం ఎదురు చూస్తున్నామని, ఆ నివేదిక ఆధారంగా నిందితులను గుర్తిస్తామని పోలీసులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనుమానిత వ్యక్తులు, ఇతర నేరస్తులైన 12 మందిని విచారించామని తెలిపారు. నిందితుడి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్టు, ఈ కేసును నార్త్‌జోన్ డీసీపీ పర్యవేక్షణలో ఏసీపీ ద్వారా దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

ప్రశాంతంగా త్రిపుర ఎన్నికలు

- 74 శాతం పోలింగ్ నమోదు
- మొరాయించిన ఈవీఎంలు
- మార్చి 3న ఓట్ల లెక్కింపు

అగర్తల : త్రిపురలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్రంలోని మొత్తం 60 నియోజకవర్గాలకు గానూ 59 స్థానాలకు మాత్రమే పోలింగ్ జరిగింది. చారిలాం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి రామేంద్ర నారాయణ దేవ్ వర్మ ఇటీవల కన్ను మూయడంతో ఆ స్థానానికి పోలింగ్ మార్చి 12కు వాయిదా పడింది. ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం వరకూ కొనసాగింది. రాష్ట్ర సీఎం మాణిక్ సర్కార్ అగర్తలలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 74 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల కమిషన్(ఈసీ) అధికారులు వెల్లడించారు. అయితే.. గతసారితో పోల్చుకుంటే ఈసారి పోలింగ్ బాగా తగ్గింది. 2013లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 91.82 శాతం పోలింగ్ నమోదైంది. 3,214 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగగా.. అన్ని చోట్ల ఓటింగ్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీపీఏటీ) మిషన్లు ఏర్పాటు చేశారు. 59 అసెంబ్లీ స్థానాలకు 292 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. లెఫ్ట్ కూటమిలోని సీపీఐ(ఎం) 57 సీట్లలో పోటీ చేస్తుండగా.. ఆర్ఎస్పీ, ఫార్వర్డ్ బ్లాక్, సీపీఐ ఒక్కో స్థానం నుంచి బరిలో ఉన్నాయి. బీజేపీ 51, ఆ కూటమిలోని ఇండిజీనస్ పీపుల్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర(ఐపీఎఫ్‌టీ) 9 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఒంటరిగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ 59 నియోజకవర్గాల నుంచి అభ్యర్థులను బరిలోకి దించింది. ఓట్ల లెక్కింపు మార్చి 3న జరగనున్నది.

180 కేంద్రాల్లో మందకొడిగా పోలింగ్

ఈవీఎం, వీవీపీఏటీ మిషన్లు మొరాయించడంతో 180 పోలింగ్ కేంద్రాల్లో మందకొడిగా సాగింది. పోలింగ్ ప్రారంభమైన కొద్ది సేపటికే ఈవీఎంలు మొరాయించినట్టు ఈసీకి ఫిర్యాదులందాయి. పోలింగ్ నెమ్మదిగా సాగడంతో ఓటర్లు అసహనానికి గురయ్యారు. అయితే.. ఫిర్యాదు వచ్చిన చోటల్లా ఈవీఎంలు మొరాయించలేదని ఈసీ అధికారులు చెబుతు న్నారు. కొన్ని చోట్ల నిజంగానే ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తిందని తెలిపారు. మరి కొన్ని చోట్ల ఈవీఎంలు బాగానే పని చేస్తున్నా ఫిర్యాదులొచ్చాయని వివరణ ఇచ్చారు. 12 ఈవీఎంలను మార్చినట్టు అధికారులు తెలిపారు. మరోవైపు.. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ చాంబర్‌లో ఎన్నికల పర్యవేక్షణాధికారి ఆర్‌కె పచ్‌నందాతో బీజేపీ రాష్ట్ర చీఫ్ విప్లవ్‌కుమార్ దేవ్ జరిపిన రహస్య మంతనాలు వివాదానికి దారి తీశాయి. దీనిపై సీపీఐ(ఎం) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

తప్పు చేసినా...చర్యలుండవా..?

- స్పోర్ట్స్‌కోటాలో మెడికల్ సీట్ల వ్యవహారం
- అక్రమార్కులకు ప్రభుత్వ పెద్దల అండ!
- విచారణ పేరుతో కాలయాపన



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఏ శాఖలోనైనా ఉద్యోగులు తప్పుచేసినట్టు తేలితే వెంటనే వారిపై చర్యలు తీసుకుంటారు. కానీ తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలో మాత్రం దీనికి పూర్తి విరుద్ధం. తప్పుచేసినట్టు ఒప్పుకున్నా...చర్యలకు మాత్రం ససేమిరా అంటున్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారు. క్రీడాకోటా మెడికల్ సీట్ల వ్యవహారంలో అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం చేస్తున్న జాప్యంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

2017-18 విద్యాసంవత్సరానికి గానూ స్పోర్ట్స్ కోట మెడికల్ సీట్లలో అక్రమాలు జరిగినట్టు ఒక్కొక్కటి బయటి కొస్తున్నాయి. క్రీడాకోటలో పది సీట్లలో ఇప్పటికీ రెండుసీట్లలో గోల్‌మాల్ జరిగినట్టు ఆధారాలున్నాయి. వీటికితోడు ఈసారి ముగ్గురు అంతర్జాతీయ క్రీడాకారులనూ కావాలనే పక్కనపెట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'ప్రతిభ ఉంటే కాదు..పైసలుంటేనే' శీర్షికతో నవతెలంగాణ జనవరి ఒకటిన కథనం ప్రచురించింది. స్పందించిన అధికారులు ఇద్దరు అధికారులతో విచారణ చేయించారు. ఓ విద్యార్థినికి ప్రాధాన్యత పాయింట్లు వేయడంలో తప్పిదం జరిగినట్టు కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. విచారణ అధికారులూ పనిఒత్తిడి, సమయం తక్కువగా ఉండటంతోనే ఈ తప్పిదం జరిగినట్టు చెప్పినట్టు తెలిసింది. నివేదిక ఇచ్చి దాదాపు నెలరోజులు దాటింది. అయినా ఇప్పటికీ ఆ సర్టిఫికెట్ల అధికారులపై చర్యలు తీసుకోలేదు. నివేదిక సరిగా లేదని ప్రభుత్వం ఇద్దరు సభ్యులతో మరో కమిటీని నియమించింది. తాజాగా మరో ఘటనలో ఓ దళిత క్రీడాకారిని సీనియర్ విభాగంలో జాతీయస్థాయిలో పోటీల్లో పాల్గొంటే.. అధికారులు మాత్రం స్కూల్ గేమ్స్ విభాగంలో మాత్రమే ఆడినట్టు ప్రాధాన్యత పాయింట్లు ఇచ్చారు. దీంతో ఆ విద్యార్థిని సీటు కోల్పోవాల్సి వచ్చింది.

నిజంగానే పనిఒత్తిడి ఉందా..?

ఈ విద్యాసంవత్సరం స్పోర్ట్స్‌కోటాలో 235 దరఖాస్తులు చేసుకోగా, వాటిలో 162మంది అర్హులుగా గుర్తించారు. నెలరోజుల సమయంలో వీరందరి సర్టిఫికెట్లను పరిశీలించి, కాలేజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి నివేదిక పంపించారు. దీనికి 9మంది సభ్యులతో పాటు ఇద్దరు సప్పోర్టింగ్ స్టాఫ్‌తో కూడిన కమిటీని వేశారు. టాప్ ఫైనల్ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన కోసం నలుగురితో మరోకమిటీ వేశారు. నిజంగా పని ఒత్తిడితో ఈపొరపాటు జరిగితే, మొదటి కమిటీ తప్పును గుర్తించకపోయి నా, ఫైనల్‌లిస్ట్ కమిటీ ఎందుకు గుర్తించలేదు అనేదానికి సమాధానం లేదు. కేవలం పదిమంది వివరాల్లోనూ సమగ్రంగా పరిశీలించకుండా ఉం డటాన్ని పనిఒత్తిడి అనుకోవాలా..? నిర్లక్ష్యంగా భావించాలా? అని బాధి తులు ప్రశ్నిస్తున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన కమిటిలో ఆరోపణలు ఉన్న వారి ని తీసుకోవద్దు. కానీ ఈ కమిటీలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తి కీల కంగా ఉండటం గమనార్హం. అయితే తప్పు జరిగిందని కమిటీ నివేదిక ఇచ్చి న తర్వాత కూడా చర్యలు తీసుకోకపోవడానికి ప్రభుత్వంలోని ఒకరిద్దరు పెద్దల హస్తం ఉన్నట్టు సాట్స్‌లో ప్రచారం జరుగుతోంది. ఈనెల 24న ఇద్దరు సీనియర్ అధికారులతో వేసిన కమిటీ తన నివేదిక ఇవ్వనున్నది. దీనితోనైనా సర్కారు అక్రమార్కులపై చర్యలు తీసుకుంటుందా.? లేదా వారిని కాపాడే

నిధుల్లో ప్రాధాన్యత ఇస్తేనే విద్యాభివృద్ధి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రాములు

నవతెలంగాణ - భువనగిరి

నిధుల్లో ప్రాధాన్యత ఇస్తేనే విద్యాభివృద్ధి జరుగుతుందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రాములు అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. విద్యాభివృద్ధికి కేంద్రం గతంలో కంటే ప్రస్తుతం 3.4శాతం నిధులు మాత్రమే పెంచిందని, ఇది ఏ మాత్రమూ సరిపోవని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య బలోపేతం కోసం ఆలోచించడం లేదని విమర్శించారు. తల్లిదండ్రులు కోరుకునే విధంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ ప్రవేశపెట్టాలని కోరారు. ప్రతి మండలంలో 6 నుండి 12 పాఠశాలలు ఎల్‌కేజీ నుంచే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మూడేండ్లు నిండిన వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చుకునే విధంగా నిబంధన తీసుకురావాలని చెప్పారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీచేయాలని డిమాండ్ చేశారు. సర్వీస్ రూల్స్ చేపట్టి వేసవిలోనే బదిలీలు చేపట్టాలని కోరారు. ఎయిడెడ్ పాఠశాలలను స్వాధీనం చేసుకొని నడిపించాలన్నారు. ఎయిడెడ్ టీచర్లకు హెల్త్‌కార్డులివ్వాలని, మోడల్ స్కూల్స్, హాస్టళ్లకు నిధులు కేటాయించాలన్నారు. బాలికల విద్యాభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా వేతనంతో కూడిన సెలవులతో పాటు చైల్డ్‌కేర్ సదుపాయం, హెల్త్‌కార్డులు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెతుకు సైదులు, ముక్కెర్ల యాదయ్య, నాయకులు దామోదర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మోడీని నిలదీద్దాం...



నవతెలంగాణ-నిజామాబాద్‌ప్రతినిధి

'అంగన్‌వాడీల కనీస వేతనాల కోసం మోడీని నిలదీద్దాం. అందుకు జూలైలో భారీ ఎత్తున ఆందోళనలు చేపట్టనున్నాం. దీనికి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు భారీగా తరలిరావాలి' అని ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ప్రధాన కార్యదర్శి ఎ.ఆర్. సింధు పిలుపునిచ్చారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) యూనియన్ రాష్ట్ర ద్వితీయ మహాసభ ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అట్టహాసంగా ప్రారంభమైంది. మహాసభ ప్రారంభ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వరకు సాగింది. ఈ ర్యాలీలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అనంతరం రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.ఆర్.సింధు ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లయినా ఇప్పటికీ దేశంలో పోషకాహార లోపంతో ప్రతియేటా ఆర్నెల్లలోపు చిన్నారులు 20,400 మంది మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు లేకపోతే ఈ నిష్పత్తి మరింత పెరిగేదని నిపుణులు హెచ్చరించినా ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. దేశంలో 16 కోట్ల మందిలో ఎనిమిది కోట్ల మంది పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు పోషకాహారం అందిస్తున్నాయని వివరించారు. శిశుమరణాలపై పార్లమెంటులో ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు. జాతీయ మీడియా కూడా దీనికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు పైసా కూడా కేటాయించలేదని చెప్పారు. ఐసీడీఎస్‌ను పీపీపీలో నడిపేందుకు కుట్ర జరుగుతోందని, వీటిని అక్షయపాత్ర, వేదంతా కంపెనీలకు ఇచ్చేందుకు మొగ్గుచూపుతున్నారని అన్నారు. ఇందుకు రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం కూడా వత్తాసు పలుకుతోందని విమర్శించారు. అంగన్‌వాడీకి నిధులు కేటాయించాలనే సోయి లేని కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీల ఆదాయం మాత్రం పెంచుతోందని విమర్శించారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పథకం కింద పిల్లలకు ఒక్కొక్కరికి రూ.261 అకౌంట్‌లో వేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని అన్నారు. నగదు బదిలీ బదులు బడా కంపెనీల నుంచి ఆహార ప్యాకెట్లు పంపిణీ చేయాలని కేంద్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకాగాంధీ అంటున్నారని తెలిపారు. ఇదంతా బడా కంపెనీల నుంచి కమీషన్లు పొందాలనే ఉద్దేశమేనని చెప్పారు. అంగన్‌వాడీలకు పెంచిన వేతనాలేమీ ప్రభుత్వాల సొంత సొమ్ముకాదని, ప్రజల డబ్బేనని స్పష్టం చేశారు. అంగన్‌వాడీల పక్షాన సీఐటీయూ రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు.

హక్కుల కోసం తిరగబడే వీరనారీమణులు : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు

అంగన్‌వాడీలు హక్కుల కోసం తిరగబడే వీరనారీమణులని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు కొనియాడారు. తమ ప్రభుత్వం జీతాలు పెంచినప్పుడు సీఐటీయూకు సభ్యత్వం ఎందుకివ్వడమని మంత్రి హరీష్‌రావు అనడం కార్మిక సంఘాల హక్కులను కాలరాయడమేనన్నారు. హరీష్‌రావు సొంత భూములమ్మి వేతనాలు పెంచిండా..? లేక కేసీఆర్ ఫామ్ హౌజ్ భూముల్లో పండించిన పంటకు వచ్చిన లాభాలతో పెంచిండా..? అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ అనుబంధ సింగరేణి కార్మిక సంఘం సభ్యత్వ డబ్బుల్లో అవకతకలు జరిగి జైలుకుపోయిన చరిత్ర మీదని, కార్మికుల హక్కుల కోసం పోరాడిన చరిత్ర సీఐటీయూదని గుర్తుచేశారు.

50 కోట్ల మంది జనాభాకు ఆరోగ్య రక్షణ కల్పిస్తామని చెప్పిన మోడీ బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించలేదన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తెరిపిస్తామని చెప్పిన బోధన్‌షుగర్స్, బిల్ట్ పరిశ్రమ, సిర్పూర్ కాగజ్‌నగర్ పరిశ్రమలకు ఇంత వరకు అతీగతీలేదని అన్నారు. రాష్ట్రంలో 2 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే అందులో 26 వేలు భర్తీ చేస్తే సగం పోలీసులే ఉన్నారన్నారు. పోలీసుల నిర్బంధంతో ఆందోళనలు ఆగవని స్పష్టం చేశారు. అంగన్‌వాడీల హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో సీఐటీయూ సమరశీల పోరాటాలకు ఈమహాసభల్లో కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఒంగరి రాములు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.రమ, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి తదితరులు ప్రసంగించారు. ఈ సభలో సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు, అధ్యక్షుడు పల్లపు వెంకటేష్, కామారెడ్డి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు దేవగంగు, స్వర్ణ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌కు దళిత మహిళా కార్పొరేటర్ రాజీనామా

(మొదటిపేజీ తరువాయి)

భర్తకు గాని ఏ హాని జరిగినా ఎమ్మెల్యే ఇంటి ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని ఆమె హెచ్చరించారు. హక్కుల సాధన కోసం దళిత్, ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తే ఎమ్మెల్యే తనపై కక్ష గట్టి అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని కార్పొరేటర్ భర్త మెండి చంద్రశేఖర్ (మార్షల్) ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి వసీం అహ్మద్ మాట్లాడుతూ దళిత మహిళా కార్పొరేటర్లపై వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు. టీమాస్ ఫోరం రాష్ట్ర నాయకులు సుంకరి సంపత్ మాట్లాడుతూ టీఆర్ఎస్ సర్కారు అగ్రకుల దురహంకారంతోనే దళిత ప్రజాప్రతినిధులు అణిచివేత, వేధింపులకు గురౌతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ కేసుపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు.

ఇరాన్‌లో కూలిన విమానం

(మొదటిపేజీ తరువాయి)

చర్యలకు కొంత అంతరాయం ఏర్పడింది. ఘటనాస్థలికి అంబులెన్స్‌లు చేరుకోలేకపోతున్నాయని ఇరానియన్ ఎమర్జెన్సీ ఆర్గనైజేషన్ ప్రతినిధి తెలిపారు. దీంతో ఘటనా స్థలానికి హెలికాప్టర్లను పంపించినట్టు ఆయన వెల్లడించారు. ప్రత్యక్ష సాక్ష్యుల కథనం ప్రకారం విమానాన్ని అత్యవసరంగా కిందికి దించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో విమానం కూలిపోయినట్టు చెబుతున్నారు. టెహ్రాన్ నుంచి 480 కిలోమీటర్ల దూరంలో ఉన్న దెనా పర్వత ప్రాంతంలో విమానం కూలిపోయింది.

విమానంలో సాంకేతిక సమస్యలు...

ఏటీఆర్-72లో గతంలో సాంకేతిక సమస్యలు తలెత్తినట్టు ఇరాన్ ఏస్ మ్యాన్ ఎయిర్‌లైన్స్ అంగీకరించింది. గతేడాది అక్టోబర్26న సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు నిపుణుల పర్యవేక్షణలో పరిష్కరించామని తెలిపింది. గతనెల 25న మరోసారి సమస్య వచ్చినప్పుడు ఈ విమానం అత్యవసరంగా ల్యాండింగ్ అయిందని పేర్కొన్నది. అప్పటి నుంచి ఏటీఆర్-72 విమానాన్ని మెహ్రాబాద్ విమానాశ్రయంలో నిపుణుల పర్యవేక్షణలో ఉంచామని ఏస్‌మ్యాన్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. విమానంలో సాంకేతిక సమస్యలు లేవని, గతంలో తలెత్తిన సమస్యలన్నింటినీ పరిష్కరించామని అన్నారు. ఈ ప్రమాదంపై దర్యాప్తునకు ఇరాన్ ప్రభుత్వం ఆదేశించింది.

ఏప్రిల్ 20 నుంచి పెట్టుబడి పథకం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

వ్యవసాయానికి పెట్టుబడి పథకం కింద ఎకరాకు రూ.4వేలు అందజేసే పథకాన్ని ఏప్రిల్ 20 నుంచి అమలు చేయాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. యాసంగి సీజన్‌కు నవంబర్ 18నుంచి అమలు చేస్తామ న్నారు. ఈ డబ్బులను నగదు రూపంలో కాకుం డా చెక్కుల రూపంలో ఇవ్వనున్నట్లు ముఖ్య మంత్రి వెల్లడించారు. మండల రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సులను ఈనెల 25న హైదరాబాద్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం లో, 26న కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఈ సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయాన్ని లాభసాటి చేయడం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రైతులకు అందించే విషయంలో రైతు సమన్వయ సమితిలు నిర్వహించాల్సిన పాత్రకు సంబంధిం చిన ఈ సదస్సుల్లో సభ్యులకు వివరించాలన్నారు. వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించినందున దీనికి సంబంధించిన ముసాయిదాను రూపొందించాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు సబ్సిడీ పై నాట్టు వేసే యంత్రాలను అందించే యోచనలో ఉన్నట్టు సీఎం వెల్లడించారు. అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ, వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం కషి చేస్తున్న నిపుణులు, శాస్త్ర వేత్తలతో కూడిన రాష్ట్ర స్థాయి రైతు సమన్వయ సమితిని త్వరలోనే నియమిస్తామన్నారు. ప్రగతి భవన్‌లో ఆదివారం వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజెందర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, ఎంపీలు గుత్త సుఖేందర్ రెడ్డి, బాల్క సుమన్, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మెన్ వేముల ప్రశాంత్ రెడ్డి, కార్పొరేషన్ల చైర్మన్లు గ్యాదరి బాలమల్లు, శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు ఎస్.నర్సింగ్ రావు, రామ కష్ణరావు, పార్థసారథి, వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్మోహన్ రావు, వ్యవసాయ యూనివర్సిటీ విసి ప్రవీణ్ రావు, ఆర్థిక సలహాదారు జిఆర్ రెడ్డి, సీఎంఓ కార్యదర్శులు స్మితా సభర్వాల్, రాజశేఖర్ రెడ్డి, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులతో సీఎం ముఖాముఖి

ఈ నెల 25న హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగే ప్రాంతీయ సదస్సుకు జనగామ, మెదక్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన మండల రైతు సమన్వయ సమితి సభ్యులను ఆహ్వానించాలని సిఎం ఆదేశించారు. ఈనెల 26న కరీంనగర్‌లో జరిగే ప్రాంతీయ సదస్సుకు ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కొ మురంభీమ్ ఆసిఫాబాద్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట జిల్లాలకు చెందిన సభ్యులను ఆహ్వానించాలని చెప్పారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సద్సులో ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రుల సందేశాలతో పాటు రైతులతో ముఖ్యమంత్రి నేరుగా సంభాషించే కార్యక్రమా లుంటాయి.

రైతు సంక్షేమం కోసం, వ్యవసాయా భివద్ధి కోసం ప్రభుత్వ చేపట్టిన అనేక కార్యక్రమా లు చేపడుతున్నామని, ఈ కార్యక్రమాల్లో రైతు సమన్వయ సమితిల సభ్యులు ఎలాంటి పాత్ర పోషించాలనే విషయంపై ఈ సదస్సుల్లో కూలం కశంగా చర్చించనున్నట్లు సిఎం చెప్పారు. వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికా రులు కూడా ఈ సదస్సుల్లో పాల్గొంటారని వెల్ల డించారు. సదస్సులకు హాజరయ్యే మండల రైతు సమన్వయ సమితుల సభ్యుల ప్రయాణ, భోజన సదుపాయాలన్నీ వ్యవసాయశాఖ సమకూర్చాలని సిఎం చెప్పారు. రైతులను సంఘటితం చేయడం, రైతు వేదికల నిర్మాణం-నిర్వహణ, రైతులకు నిరంతర శిక్షణ, పంట పెట్టుబడి మద్దతు పథకం, పంటలకు కనీస మద్దతు ధర అందేలా చూడడం, మార్కెట్లకు ఉత్పత్తులు తీసుకువచ్చే విషయంలో నియంత్రణ పాటించడం, మేలైన సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయ విధానం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, కోల్డ్ స్టోరేజి చైన్, క్రాప్ కాలనీలు తదితర అంశాల్లో రైతు సమన్వయ సమితిలు నిర్వహించాల్సిన పాత్రపై కరదీపిక అందించడంతో పాటు, సదస్సుల్లో ఈ అంశాలపై విస్తతంగా చర్చించాలన్నారు.

ప్రస్తుతం వ్యవసాయదారులు కూలీల కొరతను ఎదుర్కొంటు న్నారని, భవిష్యత్తులో ఈ సమస్య మరింత ఎక్కువవుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితిని దష్టిలో ఉంచు కుని వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్స హించనున్నట్టు చెప్పారు. వరినాట్లు వేసే యం త్రాలను సబ్సిడీపై అందించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన కార్యాచరణ రూపొందిం చాలని అధికా రులను ఆదేశించారు. నిధుల సమస్య రాకుండా ఉండేందుకు వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్‌ప్రవేశ పెడతామన్నారు. వ్యవసాయ బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి అనుగుణంగా ముసాయిదాను రూపొందించాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

నవతెలంగాణ-భద్రాచలం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఆదివారం ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లతో పాటు కాంట్రాక్టర్ మేనేజర్ మృతి చెందారు. మరో ఆరుగురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. 12 వాహనాలూ దగ్ధమయ్యాయి.

సుకుమా జిల్లా చింతకుప్ప-బెర్జి మధ్య ఎర్లార్‌మడుగునల్లా వద్ద అడవిలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనులు నిలిపేయాలని మావోయిస్టులు గతంలో హెచ్చరికలు జారీ చేశారు. కాంట్రాక్టర్ పోలీసుల బందోబస్తు నడుమ నిర్మాణ పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 11.45 నిమిషాల ప్రాంతంలో మావోయిస్టులు పనులు జరుగుతున్న ప్రాంతానికి వచ్చి అక్కడున్న 12 వాహనాలకు నిప్పు చేశారు. అనంతరం కాంట్రాక్టర్ మేనేజర్ అనిల్‌ను చంపేశారు. ఈలోగా అక్కడికి డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు చేరుకున్నాయి. మావోయిస్టులు, జవాన్లకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి.

ఈ ఎదురుకాల్పుల్లో మార్కం ఆదా, కాంతి ముఖేష్ అనే జవాన్లు మృతి చెందారు. మరో ఆరుగురు జవాన్లు అయిన సోరి బూశా, చాపా రాకేష్, సల్వాన్ రాజా, పాదం సన్, సోడి శివరామ్, ఆర్ పోయంలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడ్డ జవాన్లను చికిత్స నిమిత్తం హెలికాప్టర్ ద్వారా రాయ్‌పూర్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ ఐదు బృందాలు, 202 కోబ్రా బలగాలతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. సాయంత్రం వరకు మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఎదురు కాల్పులు జరిగినట్టు సమాచారం.

సెన్సెక్స్ ▲295	నిఫ్టీ ▲85	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)
34,300	10,539	64.31	రూ. 30,812	రూ. 40,600





సోమవారం మార్కెట్లు ముగింపునాటికి

కోడిగుడ్లు			
హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



15 నగరాలు..45 ప్రాంతాల్లో ఈడీ సోదాలు

- బ్యాంకు అధికారులకు కమీషన్లు:సీబీఐ



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడీ)15 నగరాలు,45 వేర్వేరు చోట్ల సోదాలు నిర్వహిం చింది.ఇందులో గీతాం జలి,నక్షత్ర సంస్థలకు చెందిన కొల్‌కతాలో ఉన్న ఆరు షోరూమ్‌లలోనూ తనిఖీలు నిర్వహించారు. ఈడీ,సీబీఐ సంయుక్తంగా దోషులను పట్టుకో వటం,సాక్ష్యాధారాలను సేకరించేపనిలో భాగంగా ఆదివారం విస్తృతంగా ఆకస్మిక సోదాలు జరిపాయి.పీఎన్బీ అక్రమాలకు సంబంధించి లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్(ఎల్ఓయూ) జారీ చేయటానికి బ్యాంకు అధికారులకు కమీషన్లు ముట్టజెప్పినట్టు గుర్తించామని సీబీఐ అధికారులు తెలిపారు. ప్రధానపాత్రధారులైన నీరవ్‌మోడీ లాంటి పెద్దలు విదేశాలకు చెక్కేసేదాకా దర్యాప్తుసంస్థలు,నిఘా వర్గాలు ఏం చేస్తున్నాయని సామాన్యుడి ప్రశ్న.

ఇంటి దొంగలు

- చేతివాటం ప్రదర్శిస్తున్న బ్యాంక్ అధికారులు
- 1538 మందితో ఎస్‌బీఐ టాప్:

ఆర్బీఐ విశ్లేషణలో బయటపడ్డ నిజాలు



బెంగుళూరు: నీరవ్ మోడీ కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ బ్యాంకుల నిర్వహణపై సర్వత్రా సందే హాలు వ్యక్తమవుతు న్నాయి. బ్యాంకు అధికారుల హస్తం లేనిదే భారీ ఆర్థిక మోసాలు జరగవన్నది నిపుణుల అభిప్రాయం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సమాచారం.. వీటికి మరింత బలాన్నిచ్చేలా ఉన్నది. ఈ సమాచారం ప్రకారం..2015 జనవరి 1నుంచి 2017 మార్చి 31మధ్య కాలంలో 5,200మంది బ్యాంకు అధికారులు మోసాలకు పాల్పడి శిక్షను అనుభవిస్తున్నారని వెల్లడించింది. అంటే ప్రతి నాలుగు గంటలకు ఒక ఉద్యోగి పట్టుబడుతున్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ ఆర్థిక నేరాలు మరింత పెరుగుతుండటం గమనార్హం. 1,538 మంది ఎస్‌బీఐ అధికారులు ఈ మోసాల్లో శిక్షను అనుభవిస్తున్నారు. ఈ జాబితాలో ఎస్‌బీఐ మొదటిస్థానంలో ఉన్నది. తర్వాతి స్థానాల్లో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 449 అధికారులు రెండో స్థానంలో, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 406 మంది అధికారులతో మూడో స్థానంలో ఉన్నాయి. 2017 ఏప్రిల్ నుంచి ఫ్రాడ్‌లకు సంబంధించిన సమాచారాన్ని ఆర్‌బీఐ పొందుపరు స్తున్నది. ఆర్బీఐ పొందుపరిచిన ఇతర సమాచారం ప్రకారం 2013 ఏప్రిల్1 నుంచి 2016 డిసెంబర్ 31 మధ్య కాలంలో ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల్లో జరిగిన 17, 504 ఫ్రాడ్‌లలో 66,066 కోట్ల రూపాయలు మోసపోయాయి. ఇందులో 2,084 కేసుల్లో (12శాతం) బ్యాంకు ఉద్యోగుల ప్రమేయమున్నది. మోసాలను రిపోర్టు చేయడం, నివారిం చడమెలాగో తెలుపుతూ బ్యాంకులన్నింటికీ ఆర్బీఐ సర్క్యులర్‌లను జారీ చేస్తున్నది. ఆర్థిక నేరాలను తక్కువ సమయంలో గుర్తించేందుకు తగిన నియమాలను అమలు చేయాలని 2016 జూలైలో జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నది. మోసాలను అరికట్టేం దుకు వివిధ స్థాయిల్లో అధికారిక గుర్తింపు(ఆథెంటికేషన్) ఉండాలని ఓ మల్టీనేషనల్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ తెలిపారు. భారత బ్యాంకుల్లో ఉన్నతాధికారి ఒక్కరు చెప్పితే చాలు మిగతా ఎవ్వరూ సమీక్షించాల్సిన అవసరం లేని విధంగా ఇక్కడి విధానాలున్నాయని అన్నారు.

రావిరాలలోని గీతాంజలి లో కొనసాగుతున్న ఈడీ సోదాలు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి



అక్రమంగా వేల కోట్ల రూపాయల రుణం పొందిన కుంభకోణంలో ప్రదాన నింది తుడు నీరవ్‌మోడీకి చెందిన రావిరాలలోని గీతాంజలి నగల షాపు లో ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల సోదాలు ఆదివారం కొనసాగాయి. ఢిల్లీ నుంచి వచ్చిన ఈడీ కి చెందిన ప్రత్యేక టీమ్ అధికారులు రంగారెడ్డి జిల్లాలోని రావిరాలలో గల ఈ షోరూమ్‌లో అణువణువు సోదా చేస్తున్నట్టు సమాచారం. నీరవ్‌మోడీకి చెందిన సమీప బంధువుదిగా చెబుతున్న ఈ జ్వెలర్స్‌లోని 16కు పెగా ఉన్న లాకర్లలో నిలువ ఉంచిన విలువైన వజ్రాలను ఈడీ అధికారులు గణిస్తున్నారని తెలిసింది. అలాగే ఒక్కో వజ్రం ఒక్కో రూపంలో ఉండి వాటి ఒక్కొక్క దాని విలువ వేరు వేరుగా ఉండటం, వాటి విలువ లక్షలలో ఉండటంతో మరింత జాగ్రత్తగా విలువను ఈడీ అధికారులు అంచనా వేస్తున్నారని సమాచారం. ఇందుకు ముంబయి నుంచి ప్రముఖ వజ్రాల నిపుణులను రప్పించి వజ్రాల విలువను మదింపు చేస్తున్నారని తెలిసింది. అత్యంత భద్రతా ఏర్పాట్ల మధ్య ఈడీ అధికారుల సోదాలు సాగుతున్నాయని సమాచారం ఇందులో జరుగుతున్న సోదాల గురించి న సమాచారం ఏమాత్రం బయటికి పొక్కకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారని తెలిసింది.

బీజేపీ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించిన మోడీ



న్యూఢిల్లీ: దేశరా జధానిలోని దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ మార్గ్‌లో నిర్మించిన బీజేపీ ప్రధాన కార్యాలయాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, పార్టీ సీనియర్ నేత ఎల్‌కె అద్వానీ సమక్షంలో మోడీ ఆది వారం ప్రారంభించారు. లూయిటెన్స్ బంగ్లా జోన్ నుంచి అన్ని రాజ కీయ పార్టీలు తమ కార్యాలయాలను వేరే చోటుకు మార్చుకోవాలని సుప్రీంకోర్టు సూచించిన విషయం విదితమే. శంకుస్థాపన చేసిన ఏడాదిలోనే ప్రధానకార్యాలయ నిర్మాణం పూర్తి చేసి.. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను మిగతా పార్టీలకంటే బీజేపీ ముందుగా అమలు చేసినట్టయింది. గతేడాది ఆగస్టులో నరేంద్ర మోడీ, అమిత్ షా ఈ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. నిర్దేశించిన సమయంలో నిర్మాణాన్ని పూర్తి చేసినందుకు అమిత్ షా, ఆయన టీమ్‌కు ప్రారంభోత్సవ సభలో మోడీ కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీకి ఈ రోజు ప్రత్యేకమైనదని అమిత్ షా పేర్కొన్నారు.

టెలికాం కంపెనీల మధ్య స్మార్ట్ వార్

దేశంలో ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో 2జీ కనెక్టివిటీ కూడా సరిగ్గా లేదు. 3జీ నెట్ వర్క్ ద్వితీయ శ్రేణి మొదలు పైపెచ్చు నగరాలకే పరిమితం. ఇక 4జీ సేవలు అన్ని పట్టణాల్లో పూర్తి స్థాయిలో విస్తరించనూ లేదు. ఐతే, జియో అరంగేట్రం చేసినప్పటి నుంచి భారత టెలికాం రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఉచితంగా అన్ లిమిటెడ్ ఫోన్‌కాల్స్, మెసేజ్‌లతో పాటు పలు ఆఫర్లను జియో సంస్థ ప్రకటించడమే గాక, రూ.1500 సెక్యూరిటీ బాండ్‌తో పూర్తి ఉచితంగా 4జీ ఫీచర్ ఫోన్‌ను సైతం అందిస్తున్న సంగతి తెలిసిందే! ఈ నేపథ్యంలో.. భారత్‌లో టాప్ ఆపరేటర్లు భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఇండియా, ఐడియా సెల్యులార్ తదితర సంస్థలు ఫీచర్ ఫోన్ల కన్నా తక్కువ ధరకే (ఈ ధర రూ.500గా ఉండొచ్చు) 4జీ స్మార్ట్ ఫోన్లను అందించేందుకు హ్యాండ్‌సెట్ కంపెనీలతో చర్చిస్తుండటం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఐతే, ఇప్పటికే, ఆర్థికంగా పీకల్లోతు నష్టాల్లోకి కూరుకుపోయిన టెలికాం పరిశ్రమను ఈ చర్య ఎక్కడికి తీసుకుపోతుందోనని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

- జై



రూ.2700 స్మార్ట్ ఫోన్ .. రూ.500కే ఇచ్చే యోచన

- కస్టమర్లను తిప్పుకొని, మార్కెట్ వాటాను సొంతం చేసుకోవడమే లక్ష్యం!
- రీచార్జ్ ప్లాన్‌తో సబ్సిడీ సొమ్ము రికవరీకి యత్నాలు..
- మూడేండ్ల పాటు ఒకే ఆపరేటర్ ను కస్టమర్ వాడుతాడా?
- అంచనా తప్పితే, పరిశ్రమకు పాతిక వేల కోట్లు నష్టం..

ఐదింతల తక్కువ రేటుకే..

డిసెంబర్, 2017 ట్రాయ్ లెక్కల ప్రకారం.. దేశవ్యాప్తంగా దాదాపు 119 కోట్ల టెలికాం సబ్ స్క్రైబర్లు ఉన్నారు. ఇందులో ఎంతలేదన్నా 78 కోట్ల మంది ఫీచర్ ఫోన్ వాడుతున్నట్టు తేలింది. మొత్తం వినియోగదారుల్లో సుమారు 65శాతం వాటా కలిగిన ఫీచర్ ఫోన్ వినియోగదారులకు స్మార్ట్ ఫోన్ అనుభవాన్ని కల్పిస్తూ.. తమ వైపు తిప్పుకోవాలన్న ఉద్దేశంతో.. దేశంలోని వివిధ టెలికాం ఆపరేటర్లు రూ.500 కన్నా తక్కువ ధరకే 4జీ స్మార్ట్ ఫోన్‌లను మార్కెట్‌లోకి తీసుకురావడానికి కసరత్తు చేస్తున్నాయి. మార్కెట్ లెక్కల ప్రకారం.. ఎంట్రీ-లెవల్ 4జీ ఎనాబుల్డ్ స్మార్ట్ ఫోన్‌ను తయారు చేయడానికి ఎంతలేదన్నా సగటున 3వేల రూపాయల మేర ఖర్చు అవుతుంది. ఒకవేళ, ఎక్కువ మొత్తంలో బల్క్ గా ఆర్డర్ చేస్తే.. దీని ఖర్చు మరో మూడొందలు తగ్గి రూ.2700గా ఉండే అవకాశం ఉన్నది. కానీ దీని కంటే ఐదింతల తక్కువ రేటుకు అంటే 500 రూపాయలకే 4జీ స్మార్ట్ ఫోన్‌ను వినియోగదారులకు ఆఫర్ చేస్తామని ఆయా కంపెనీలు చెబుతున్నాయి. ఐతే, ఇంత తక్కువలో ఫోన్లను అందిస్తే, సంస్థలపై అసలెంత భారం పడుతుందోనన్న విషయాలను ఆయా కంపెనీలు అంచనా వేశాయో లేదోనన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది.

రికవరీ కాకపోతే.. ఇక, అంతే!

ముందు ప్రకటించినట్టు ఒకవేళ కంపెనీలు వినియోగదారులకు 500 రూపాయలకే స్మార్ట్ ఫోన్లను అందించడం వల్ల ఆయా మొబైల్ కంపెనీలు దాదాపు 26వేల కోట్ల భారాన్ని భరించాల్సి ఉంటుందని టెలికాం రంగ విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారాన్ని కొంత తగ్గించుకునే ఉద్దేశంతో.. నెలకు 60 రూపాయల రీచార్జ్ ప్లాన్‌తో ఈ డివైజ్‌లను టెలికాం కంపెనీలు ప్రవేశపెట్టబోతున్నట్టు తెలుస్తున్న పుటికీ, మొత్తం సబ్సిడీ సొమ్ము రికవరీ చేసుకోవాలంటే దాదాపు మూడేండ్లకు పైగా ఆయా సంస్థలు వేచి చూడాలి. ఐతే, ఒక కస్టమర్ మాతృ సంస్థ(మొబైల్ ను సబ్సిడీకి అందించిన కంపెనీ) ఆపరేటర్‌ను చివరివరకు వాడతాడన్న గ్యారెంటీ లేదు. ఒకవేళ, ఇది ఆచరణలో ఏమాత్రం బెడిసికొట్టినా సదరు టెలికాం కంపెనీలు పాతికవేల కోట్ల నష్టాలను చవిచూసే ప్రమాదమున్నది.

చౌక స్మార్ట్ ఫోన్ - ఆసక్తికర అంశాలు

- మోడీ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి మద్దతుగా.. ప్రపంచంలోనే అత్యంత చౌకైన(రూ. 251) స్మార్ట్ ఫోన్ అంటూ.. తెరపైకి వచ్చిన 'ఫ్రీడమ్ 251' ఫోన్ ఆదిలోనే బొక్కబోర్లా పడటం విదితమే!
- స్మార్ట్ ఫోన్లను రూ.2వేల లోపు ధరల్లో అందించడం సాధ్యం కాదన్న కంపెనీలు.. ప్రస్తుత మార్కెట్ పోటీ దృష్ట్యా రూ. 500 కంటే తక్కువ ధరకే అందిస్తుండటం విశేషం.
- ప్రముఖ చిప్ తయారీ సంస్థ క్వాల్‌కామ్.. 5జీ టెక్నాలజీతో పనిచేసే ఓ నూతన తరహా స్మార్ట్ ఫోన్ మోడెమ్‌ను తాజాగా లాంచ్ చేసింది. దీన్ని బట్టి 2019లోనే 5జీ స్మార్ట్ ఫోన్లు మార్కెట్‌లో లభించే అవకాశం ఉందని టెక్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

డిజిటల్ తో పెరుగుతున్న మోసాలు

- హోం మంత్రిత్వ శాఖ ఆందోళన



న్యూఢిల్లీ: డెబిట్, క్రెడిట్ కార్డులు, ఈ-వాలెట్ వంటి డిజిటల్ చెల్లింపులతో మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని కేంద్ర హోం శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి మోసాలు అడ్డుకోవడానికి రాష్ట్రాలు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది. ఇలాంటి మోసపూరిత కేసుల్లో విచారణ సులభతరం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సమన్వయానికి ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)ను నోడల్ ఏజెన్సీగా హోం శాఖ నియమించింది. మొబైల్ ఫోన్లు, ఈ-వాలెట్‌లతో కూడిన ఆర్థికమోసాలకు మోసగాళ్లు వివిధ మార్గాలు ఎంచుకుంటున్నారని హోంశాఖ తెలియజేసింది. డిజిటల్ పేమెంట్ల పెరగడలతో ఇలాంటి మోసాలు పెరుగుతున్నాయని స్పష్టం చేసింది. మోసాల పై ఎప్పటికప్పుడు సమీక్షిం చడానికి హోం శాఖ పరిధిలో అంతర్గత మంత్రిత్వ కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపింది. అన్ని ఈ-వాలెట్ ప్రొవైడర్లు చట్ట అమలు సంస్థలతో సమన్వయంతో ఉండాలని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) సూచించింది. కాగా ఫోన్ మోసాలకు చెక్ పెట్టడానికి వివిధ ఏజెన్సీలతో సమన్వయం కోసం అన్ని రాష్ట్రాల్లో అదనపు డీజీపీ లేదా ఐజీ స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించుకోవాలని గతంలో హోంశాఖ సూచించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో సమాచార మార్పిడి వ్యవస్థను బలపరుచుకోవాలని సూచించింది. కాగా, ఫోన్ మోసాలు ఎక్కువగా జరిగే గ్రామాలు, పట్టణాల్లో సమన్వయ సంస్థలు తమ కార్యకలాపాలు జరుపుతాయని తెలిపింది

కార్పొరేట్లకు రుణ మాఫీ

ఐదున్నరేండ్లలో రూ.3.68 లక్షల కోట్లు

- ఇందులో ప్రభుత్వ బ్యాంకుల వాటానే అత్యధికం
- ప్రతీ ఏటా పెరుగుతున్న 'రైట్ ఆఫ్'ధోరణి

భారతదేశంలో బ్యాంకుల తీరు ఎంతో ఆందోళన కలిగిస్తోంది. దేశంలోని ప్రభుత్వ, ప్రయివేటు రంగ బ్యాంకులు గత 5ఏండ్లలో రూ.3.68 లక్షల కోట్లను 'రైట్ ఆఫ్' చేసిపారేశాయి. అంటే...రూ.3.68 లక్షల కోట్ల విలువైన రుణాలు వసూలు చేసుకోలేకపోయామని అధికారికంగా ఒప్పకొని, రుణ ఖాతాను మూసేయటం. బ్యాంకుల్లో ఈ ధోరణి ప్రతి ఏటా పెరుగుతూ రావటం పట్ల ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్యాలన్స్ షీట్‌ను (రాబడి, వ్యయం, పరపతి) మెరుగుపర్చుకోవటం కోసమే 'రైట్ ఆఫ్' చేస్తున్నామని బ్యాంకులు సమర్థించుకుంటున్నాయి. కానీ ఇందులో కనిపించని కుట్రలు, ఆర్థిక మోసాలు దాగి ఉన్నాయన్నది ఆర్థిక రంగ నిపుణుల అంచనా. విజయ్ మాల్యా కేసే ఇందుకు పక్కా ఉదాహరణ.



న్యూఢిల్లీ : ప్రభుత్వ, ప్రయివేటు రంగ బ్యాంకులు రైట్ ఆఫ్' చేసిన రుణాల విషయంలో సమాచార హక్కు ద్వారా ఆర్‌బీఐను ప్రశ్నిస్తే, వచ్చిన సమాధానం '2012-13 నుంచి సెప్టెంబరు 2017 నాటికి రైట్ ఆఫ్ చేసిన రుణాలు రూ.3,67,765 కోట్లు". కార్పొరేట్ కంపెనీలతో రాజీ ఒప్పందం కుదుర్చుకొని రైట్ ఆఫ్' చేసిన మొత్తం కూడా ఇందులోనే ఉంది. రుణాల్ని రైట్ ఆఫ్ అని ప్రకటించటమంటే, వసూలు చేసుకోలేని స్థితి లేదా రుణాలు ఎగ్గొట్టటం.

ఇందులో ఒక్కొక్క కేసు ఒక్కోలా ఉంటుంది. కొన్ని కేసుల్లో రుణ గ్రహీతలతో రాజీ ఒప్పందం కుదురుతుంది. "మా దగ్గర ఇంతే ఉంది. దీంతో ముగించేయండి" అంటూ చెప్పేస్తారు. ఆస్తి తనఖా పెడితే...బ్యాంకు దాన్ని వేలం వేసి రుణం కింద జమకడుతుంది. కానీ కింగ్ ఫిషర్ యజమాని విజయ్ మాల్యా విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. రూ.9 వేల కోట్లు ప్రభుత్వ రంగ బ్యాంకులు అప్పులు ఇచ్చాయి. ముంబయిలో అతని స్థిరాస్థుల్ని అమ్మడానికి చూస్తే కొనేనాథుడు లేడు. బ్యాంకులు ఇచ్చినదానికి...వేలం ద్వారా అందుతున్నదానికి పొంతనే లేదు.

ప్రతి ఏటా పెరుగుతున్న 'రైట్ ఆఫ్'లు

రైట్ ఆఫ్' ఖాతాల వివరాలు తెలపండి' అంటూ...సమాచార హక్కు చట్టం ద్వారా ఆర్‌బీఐను సామాజిక కార్యకర్త చంద్రశేఖర్ గౌర్ కోరారు. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ బయటపెట్టిన లెక్కలు చూస్తే, ప్రతీ ఏటా బ్యాంకులు చేస్తున్న 'రైట్ ఆఫ్' మొత్తాలు పెరుగుతున్నాయన్న విషయం బయటకొచ్చింది. 2012-13లో రూ.32,127 కోట్లు, 2013-14లో రూ.40,870 కోట్లు, 2014-15లో రూ.56,144 కోట్లు, 2015-16లో రూ.69,210 కోట్లు, 2017-18 తొలి 6నెలల్లో రూ.66,162 కోట్లు...రుణాల్ని పరస్పర ఒప్పందంతో బ్యాంకులు రైట్ ఆఫ్' చేశాయి.

అత్యధికం ప్రభుత్వ బ్యాంకులవే...

ఆర్‌బీఐ ఇచ్చిన సమాచారంలో మరో ఆందోళనకరమైన విషయం, ప్రభుత్వ రంగ బ్యాంకులే అత్యధిక మొత్తంలో రుణాల్ని రైట్ ఆఫ్ చేశాయి. గత 5ఏండ్ల కాలంలో ప్రయివేటు రంగ బ్యాంకులు రూ.64,187 కోట్లు రైట్ ఆఫ్ చేస్తే, ప్రభుత్వ రంగ బ్యాంకులు చేసినవి రూ.3,03,578 కోట్లు. బ్యాంకింగ్ రంగ నిపుణులు చెబుతున్నదాని ప్రకారం, సహజంగా బ్యాంకులు ఆస్తుల్ని తనఖా పెట్టుకొని రుణాలు ఇస్తాయి. మరి రుణాన్ని చెల్లించకపోతే తనఖా ఆస్తిని అమ్మేసి సొమ్మును రాబట్టుకోవచ్చు కదా ! అంటే ఇక్కడో కిటుకు ఉంది. అదేంటంటే... ముఖ్యంగా బడా కార్పొరేట్ ప్రముఖులు పొందే రుణాల్లో ఆస్థి తనఖా, ప్రభుత్వ సబ్సిడీ ఉంటుంది. అయితే ఈ ఆస్తిని విలువ కట్టడంలో 'అతి అంచనా' ఉంటుంది. రాజకీయ, అధికార వర్గాల ఒత్తిడితో విజయ్ మాల్యా లాంటి వ్యక్తుల ఆస్తి, వ్యాపార విలువ వేల కోట్లలో లెక్కగట్టి రుణాల్ని అందజేశారు. తీరా ఇప్పుడు అమ్మబోతే ఏం జరుగుతోంది. అందులో పదో వంతు కూడా రావటం లేదు.

ఉదాహరణకు ఒక బడా వ్యాపారవేత్త రూ.1000



కోట్లు రుణాల్ని పొంది, చేతులెత్తేశాడు అనుకుందాం. అతని తనఖా ఆస్తిని బ్యాంకు వేలం వేస్తుంది, కానీ అప్పుడు ఆ ఆస్తి, వ్యాపార విలువ రూ.300 కోట్లు చేసిందన్న నిజం బయటపడుతుంది. మరి మిగతా రూ.700 కోట్ల మాటేంటి ? దీనిని ఏదో విధంగా రాబట్టుకోవడానికి బ్యాంకులు అనేక మార్గాల్లో ప్రయత్నాలు చేస్తాయి. అంటే క్రిమినల్, చట్టపరమైన చర్యలు ఉంటాయి. ఈడీ, సీబీఐ దాడులు చేపడతాయి. కానీ ఏం లాభం. బ్యాంక్ రుణాలు తిరిగి వస్తాయన్న భరోసా ఉండదు.

రూ.700 కోట్లను వసూలు చేసుకోలేక పోయామని బ్యాలన్స్ షీట్‌లో చూపించుకుంటే సదరు బ్యాంకు పరపతి, వ్యాపారం దెబ్బతింటుంది. షేర్ మార్కెట్‌లో స్టాక్ విలువ పడిపోతుంది. దీని నుంచి తప్పించుకోవడానికి బ్యాంకులు ఎంచుకున్న మార్గమే రైట్ ఆఫ్'. అంటే భౌతికంగా బ్యాలన్స్ షీట్‌లో ఆ రూ.700 కోట్లను చూపించవు. కానీ అందుకోసం ఏ రాజీ ఒప్పందమో, చట్టపరమైన చర్యలో కొనసాగుతున్నాయని బ్యాంక్ యాజమాన్యం ప్రకటిస్తుంది. ఇంతటితో ఈ రైట్ ఆఫ్' కథను ముగిస్తుంది.

ఈ ధోరణి మంచిది కాదు..

బ్యాంకులు ఇలా రుణ ఖాతాల్ని రైట్ ఆఫ్' చేయటం మంచి ధోరణి కాదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే బ్యాంక్ వినియోగదారులకు ఒక తప్పుడు సందేశం అందుతోందని, ఒకనాటికి మొత్తం బ్యాంకు దివాలా తీస్తుందనివారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైట్ ఆఫ్' పొందిన వ్యక్తులు, ప్రయివేటు సంస్థలు మరో కొత్త కంపెనీ ఎలా ప్రారంభిస్తున్నారని ఆర్థిక విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. అంటే ఇక్కడ మోసం, కుట్రం దాగి ఉన్నాయన్న విషయం అర్థమవుతోందని వారు చెబుతున్నారు. బడా బాబులకు, పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలకు అప్పులివ్వటం ఎందుకు ? ఇచ్చాక, వసూలు చేసుకోలేక చతికిలపడటమెందుకు ? అన్నది సగటు భారతీయుడికి అర్థం కాని విషయంగా మారింది.

'ప్రభుత్వ బ్యాంకులను ప్రయివేటీకరించాలి'

జవాబుదారీతనంతో పనిచేయాలంటే తప్పనిసరి : అసోచామ్

న్యూఢిల్లీ : విజయ్ మాల్యా, నీరవ్ మోడీ కుంభకోణాల అనంతరం అసోచామ్ అనుహ్యమైన డిమాండ్ చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులపై అత్యధిక నియంత్రణను కేంద్రం వదులుకోవాలని సూచించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రయివేటు రంగ రుణదాతల మాదిరిగా పనిచేసేందుకు అనుమతించాలని కోరింది. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో "బ్యాంకుల్లోని వాటాలను 50 శాతం కన్నా తక్కువకు తగ్గించుకోవడానికి ప్రభుత్వం అనుమతించాలన్నది. బ్యాంకులు ప్రయివేటు రంగ రుణదాతల మాదిరిగా పనిచేసేందుకు అనుమతించాలి, వాటిలోని డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడుతూ, వాటి వాటాదారులకు సంపూర్ణ జవాబు దారీతనంతో నడిచేలా చేయాలి" అని పేర్కొంది. పబ్లిక్ సెక్టర్ బ్యాంకుల సీనియర్ మేనేజ్‌మెంట్ హానికరం కానటువంటి అంశాలపై కూడా బ్యూరోక్రాట్ల నుంచి ఆదేశాలను తీసుకుని అమలు చేయడానికే తమ సమయంలో అధికంగా ఖర్చు చేస్తోందని ప్రస్తావించింది. ఈ ప్రక్రియలో ప్రధాన బ్యాంకింగ్ కార్యకలాపాలు, అన్ని ముఖ్యమైన నష్ట నివారణ చర్యలతో సహా, వెనుకబడుతున్నట్లు తెలిపింది. అంతేకాకుండా బ్యాంకులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నాయని, ఇది ఒక విధంగా వరం, మరో విధంగా శాపమని పేర్కొంది.

తరతరాలుగా సాగుజేసుకుంటున్న దళిత భూముల్ని అభివృద్ధి పేరుతో అడ్డంగా ఆక్రమించేస్తున్నారు. బిఫారం పట్టాలను రద్దుచేసి నీరూ-చెట్టూ పేరుతో చెరువులు తవ్వుతున్నారు. ఇది అన్యాయమని గొంతెత్తిన దళితుల నోరు నొక్కుతుంది. వీరికి అండగా ఉన్న వామపక్ష నాయకుల్ని, దళిత నాయకుల్ని అక్రమంగా అరెస్టు చేసి కేసులు పెడుతున్నారు. బలహీనులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వ అధికారులు అధికార పక్షానికి లోబడి చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఈ స్థితిలో దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున ఉద్యమం నిర్మించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. కులాలు, ఉపకులాలు, పార్టీలు, రాజకీయాలు పక్కనపెట్టి దళితులంతా ఏకం కావాలి.

ఆంధ్రప్రదేశ్‌లోనూ...

దళితులపై దాడులు




పెద్దగొట్టిపాడులో దళితవాడలో పోలీసుల పికెట్, పోలీసుల తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధితుల బంధువులు (ఫైల్)

2018 జనవరి 1వ తేదీ ప్రపంచమంతా నూతన సంవత్సర సంబరాలు జరుపుకుంటున్న శుభవేల గుంటూరు జిల్లా, పెదగొట్టిపాడు దళితవాడ ఒక్కసారిగా ఉలికిపడింది. ట్రాక్టర్లపై కత్తులు, రాడ్లు, రాళ్ల, కర్రలు, ఖాళీ బీరు సీసాలు వేసుకొని అరుపులు, కేకలతో అగ్రకుల పెత్తందార్లు ఒక్కసారిగా విరుచుకుపడి దాడి చేశారు. అనేకమందిని గాయపరిచారు. ప్రార్థనా మందిరంలో తలదాచుకున్న మహిళలకు లుంగీలెత్తి చూపిస్తూ బూతులు తిడుతూ అవమాన పర్చారు. దాడిలో గాయపడిన వారు ఇప్పటికీ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో సరైన వైద్యం అందక బాధపడుతున్నారు. ఈ దాడికి గురైన పెదగొట్టిపాడు దళితులు చేసిన నేరమేమిటి? 31వ తేదీ కొత్త సంవత్సరం ప్రవేశిస్తుందనగా కొంతమంది దళిత యువకులు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ప్రధాన వీధుల్లో మోటార్‌సైకిళ్లపై వెళ్తుండగా స్కిడ్ అయి పడిపోయారు. పక్కనే ముగ్గులు వేసుకుంటున్న బీసీ మహిళలు మంచినీరు ఇచ్చి జాగ్రత్తలు చెప్పి పంపించారు. సమీపంలోనే ఉన్న అగ్రకులస్తులు వెంటనే బూతులు లంకించుకుంటూ కులం పేరుతో దూషిస్తూ వారిపై దాడిచేసి కొట్టారు. వారు తప్పించుకొని వెళ్లి దళిత పెద్దల సాయంతో పోలీసుకు ఫిర్యాదు చేశారు. అగ్రకుల అహం దెబ్బతిన్న పెత్తందార్లు తమపై ఫిర్యాదునివ్వడాన్ని సహించలేకపోయారు. దళితవాడపైనే దాడికి దిగారు. అంతేగాదు ఎదురు కేసు కూడా బుక్‌చేశారు. దాడి జరుగుతున్న ప్రదేశంలో ఉన్నా పోలీసులు సరిగ్గా స్పందించలేదు. పైగా రాజీ పేరుతో దళితులను బెదిరించారు. గ్రామంలోకి ఎవ్వరూ దళితులకు మద్దతుగా రాకుండా కట్టుదిట్టం చేశారు. వీరిని పరామర్శించడానికి వెళ్లే వామపక్ష పార్టీ నాయకులు, దళిత నాయకులను అరెస్టు చేసి దిగ్బందించారు. ఇప్పటికీ దళితులు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. అగ్రకులస్తులు దళితుల్ని సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ఆరునెలల క్రితం ఇదే గ్రామంలో మాదిగ చెరువును ఆక్రమించడానికి ప్రయత్నిస్తే మాల, మాదిగలంతా ఏకమై ప్రతిఘటించారు. తరువాత పంచాయతీ నిధులకోసం ప్రశ్నించారు. ఇది సహించలేని అగ్రకుల పెత్తందార్లు సమయం కోసం వేటగాళ్లలా ఎదురుచూసి మాటు వేశారు. ముగ్గులపై పడ్డ బైకులు వారికి ఆ అవకాశాన్నిచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇలా జరగడం ప్రథమం కాదు. గత కొద్ది నెలలుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతల్లో దళితులపై దాడులు జరుగుతూనే వున్నాయి. విజయనగరం జిల్లా ముదువలన గ్రామం, విశాఖ జిల్లా పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెం గ్రామం, తూర్పుగోదావరి జిల్లా ఒప్పుల గుప్తం మండలం సుధాపాలెం గ్రామం, పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రు, ప్రకాశం జిల్లా దేవరాపల్లి, కర్నూలు జిల్లా నక్కలదిన్నె గ్రామం, చిత్తూరు జిల్లా పచ్చికాపల్లం ఇలా ఏడాది కాలంగా దాడులు పెచ్చరిల్లిపోతున్నాయి.

పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రులో దళితుల సాంఘిక బహిష్కరణ సమస్య ఇప్పటికీ పరిష్కారం కాలేదు. అంబేద్కర్ విగ్రహం పెట్టుకున్న పాపానికి దళితులకు అగ్రకుల పెత్తందార్లు విధించిన శిక్ష ఇది. వీరికి సంఘీభావంగా రాష్ట్రవ్యాపితంగా ఆందోళన జరిగినా గరగపర్రు గ్రామాన్ని సీల్ చేసి రాకపోకల్ని దిగ్బంధం చేశారు. నాయకులు, కార్యకర్తల్ని కేసులు మోపి అరెస్టు చేయించారు తప్ప దళితులకు మాత్రం ఊరట కల్పించలేదు. ఇప్పటికీ చేస్తామన్న సహాయం అందరికీ అందలేదు. అంబేద్కర్ విగ్రహాన్ని అధికారికంగా నెలకొల్పుతామని ప్రకటించి మాట తప్పారు. పైగా దళితుల్లో చీలికలు తెచ్చి పెత్తందార్ల కొమ్ముగాయాలని చూస్తున్నారు.

ఒకవైపు దళిత తేజం అంటూ శుష్క వాగ్దానాలు చేస్తూ దళితుల్ని ఆకర్శించే ప్రయత్నం చేస్తున్నది. మరోవైపు దళితులపై దాడికి తెగబడుతున్న అగ్రకులస్తుల్ని అక్కున జేర్చుకుంటుంది. దాడులకు గురైన దళితులను ఆదుకోవడానికి బదులుగా బెదిరించి రాజీల పేరుతో అణచాలని చూస్తుంది. ఈ చాణిక్య నీతికి దళితులు బలిపశువులుగా మారిపోతున్నారు. ఈరోజు దేశంలోనే దళితులపై జరిగే దాడుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 4వ స్థానంలో ఉంది. కరుడుగట్టిన భూస్వామ్య దురహంకారులున్న బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల తరువాత స్థానంలో ఎంతో అభివృద్ధి చెందిందని గొప్పలు చెప్పుకునే ఆంధ్రప్రదేశ్ ఉంది. జనాభాలో 4వ వంతుకు పైగా ఉన్న దళితుల్ని, ఆదివాసీల్ని అభివృద్ధి కానివ్వకుండా అణగదొక్కి రాష్ట్రాన్ని నవ్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తాననడం మోసం చేయడం కాదా?

తరతరాలుగా సాగుజేసుకుంటున్న దళిత భూముల్ని అభివృద్ధి పేరుతో అడ్డంగా ఆక్రమించేస్తున్నారు. బిఫారం పట్టాలను రద్దుచేసి నీరూ-చెట్టూ పేరుతో చెరువులు తవ్వుతున్నారు. ఇది అన్యాయమని గొంతెత్తిన దళితుల నోరు నొక్కుతుంది. వీరికి అండగా ఉన్న వామపక్ష నాయకుల్ని, దళిత నాయకుల్ని అక్రమంగా అరెస్టు చేసి కేసులు పెడుతున్నారు. బలహీనులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వ అధికారులు అధికార పక్షానికి లోబడి చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఈ స్థితిలో దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున ఉద్యమం నిర్మించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. కులాలు, ఉపకులాలు, పార్టీలు, రాజకీయాలు పక్కనపెట్టి దళితులంతా ఏకం కావాలి.

ఇది దళిత సమస్య మాత్రమే కాదు. మానవహక్కుల సమస్య. మానవతావాద సమస్య. అంటరాని తనం, కులవివక్షని వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ వీరికి మద్దతుగా నిలబడాలి. పెత్తందార్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే గ్రామాల్లో దళితులు బలహీనవర్గాలే కాదు పేద, మధ్యతరగతి రైతులు, వృత్తిదార్లు కూడా నిలబడలేరు. కాంట్రాక్టర్లు వీరే, మిల్లర్లు వీరే, వడ్డీ వ్యాపారస్తులు వీరే, ఎరువుల షాపులు వీరివే, మార్కెట్ దందా వీరిదే. ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన సబ్‌ప్లాన్ నిధుల్ని వీరే కైంకర్యం చేసుకుంటారు. పేరు దళితులది నిధులు పెత్తందారులకు. దళితులు పంచాయతీ సర్పంచులుగా ఉన్నా, ఎమ్మెల్యేలైనా ఆచరణలో పెత్తనం వీరిదే. అయినా దళిత ఎమ్మెల్యేలు, మంత్రులు ఇది అన్యాయమని నోరెత్తి ఒక్కమాట అనలేకపోతున్నారు. తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి వీరు కూడా అగ్రకుల పెత్తందార్లకే అండగా ఉంటున్నారు. తమ తోటి సోదరులకు అన్యాయం చేస్తున్నారు. కులాల పేరుతో పెత్తందార్లు ప్రజల మధ్య చీలికలు పెట్టి తమ స్వప్రయోజనాలను కాపాడుకుంటున్నారు. వీరి ఆగడాలకు దళితులతోపాటు ఇతర తరగతుల ప్రజలు నష్టపోతున్నారు. అందుకే దళితులపై దాడుల్ని దళిత సమస్యగా కాకుండా పీడితులందరి సమస్యగా చూసి వారికి మద్దతుగా నిలబడాలి. పెత్తందార్ల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తేనే గ్రామాలు ప్రశాంతంగా వుంటాయి. పెత్తందార్ల దాడులకు వ్యతిరేకంగా, దళితులపట్ట ప్రభుత్వ వివక్షకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 23 యావత్తు ప్రజానీకం గుంటూరుకు తరలిరావాలి. ఊరూరూ కదలి దండుగా రావాలి. దళిత హక్కులను కాపాడాలి.


రండి.
దళితుల అణచివేతకు వ్యతిరేకంగా విశాల ఐక్యతను సాధిద్దాం.
ఆత్మరక్షణ - ప్రతిఘటన పోరాటాలు నిర్మిద్దాం.
సామాజిక న్యాయం కోసం ఉద్యమిద్దాం.

"పెదగొట్టిపాడు దళిత బాధితుల పోరాట సంఘీభావ కమిటీ"

అగ్రవర్ణాల వత్తిడితో

అంబేద్కర్ విగ్రహం తొలగింపు

ఓగోటి కిరణ్‌కుమార్



భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ప్రపంచ మేధావి. నేడు ఆయన పేరును, కీర్తిని ప్రపంచ దేశాలన్నీ కొనియాడుతున్నాయి. పాలకులు సైతం అంబేద్కర్ పేరు ఉచ్చరించకుండా ఉండలేని పరిస్థితి నేడు నెలకొంది. ఆయన ఏ ఒక్క సామాజిక వర్గానికి పరిమితమైన వ్యక్తి కాదు. దేశమంతా ఆరాధించే నాయకుడు. సంఘ సంస్కర్త. కార్మిక, రాజకీయ, జాతీయ నాయకుడు. ఓ విప్లవ శక్తి. పేద ప్రజల విముక్తి కోసం జీవితాంతం తపించిన నేత. అతిపెద్ద రాజ్యాంగాన్ని ఒంటి చేత్తో రచించి దేశంలోని ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిన గొప్ప వ్యక్తి. అలాంటి వ్యక్తిని నేటికీ అగ్ర కులాల వారు ఓ వర్గానికి పరిమితం చేస్తూ చూస్తుండటం సిగ్గుపడాల్సిన విషయం. అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టడాన్ని జీర్ణించుకోలేని వ్యక్తులు ఉండటం దురదృష్టకరం.

ఓ కాలనీలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు దళితులు ఐక్యమయ్యారు. విగ్రహ ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. విగ్రహాన్ని కూడా తెచ్చిపెట్టారు. ఇక ప్రారంభోత్సవమే తరువాయి. ఈనేపథ్యంలోనే ఆ ప్రాంతంలోని అగ్రవర్ణ కులాలు విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నాయి. వినాయకుడి మండపం ముందు అంబేద్కర్ విగ్రహం పెట్టడమేంటని ఘర్షణకు దిగారు. ఇక్కడ మందిరం నిర్మించాలని నిర్ణయించామని, ఆ ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహం పెడితే మంచిది కాదని అడ్డు తగిలారు. ఈ దుస్సంఘటన ఎక్కడో మారుమూల పల్లెలో కాదు. రాష్ట్ర రాజధానిలోనే. హైదరాబాద్ నగర శివారు ప్రాంతమైన బోడుప్పల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.

జైభీమ్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యువకులు బోడుప్పల్‌లోని ఎన్ఆర్ఎస్ కాలనీలో అంబేద్కర్ విగ్రహం ప్రతిష్ఠించాలని నిర్ణయించారు. దానికి స్థలం ఎంపిక చేసి దాతను సంప్రదించారు. సినీ నిర్మాత బొమ్మక్ మురళీ విగ్రహం ఇప్పించేందుకు అంగీకరించారు. దీంతో ఎన్ఆర్ఎస్ కాలనీలోని ఖాళీ స్థలంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. విగ్రహాన్ని తెచ్చి దిమ్మెపై నిలబెట్టారు. ప్రారంభోత్సవానికి సిద్ధమైన విగ్రహం ఏర్పాటును స్థానిక అగ్రవర్ణాలు, బ్రాహ్మణులు అడ్డుకున్నారు. వినాయక మండపం ఎదుట అంబేద్కర్ విగ్రహం పెట్టొద్దని ఓ రోజు ధర్నా చేసి హడావిడి చేశారు. జైభీమ్, ఆర్ఎస్ఎస్ యువకులు వెళ్లి వారిని వారించే ప్రయత్నం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో విధిలేని పరిస్థితుల్లో కాలనీలో ప్రశాంతత కోసం విగ్రహాన్ని మరోచోటికి మార్చివేశారు.

ఇలా అగ్రవర్ణాల వాళ్లు అంబేద్కర్‌ను నేటికీ ఓ దళిత నాయకుడిగానే చూడటం ఇక్కడ ఆందోళన కలిగించే అంశం. ప్రపంచ మేధావిగా ఎదిగి, ఎన్నో గ్రంథాలు రాసిన గొప్ప సామాజిక విశ్లేషకులు, తత్వవేత్త అంబేద్కర్. అతిపెద్ద దేశానికి రాజ్యాంగాన్ని రచించి మనుషులంతా ఒక్కటేనని చాటిన గొప్ప మేధావి. అలాంటి వ్యక్తిని ఒక వర్గానికి పరిమితం చేస్తూ అగ్రవర్ణాల వారు నేటికీ కట్రలు చేస్తూనే ఉన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం నీడలో జీవిస్తూ ఆయననే విస్మరించే కుయుక్తులకు పాల్పడుతుండటం దుర్మార్గమైన విషయం.

సెల్ : 9666011107

తక్కువ కులపోడు మా ఇంటిపక్కన ఉండటమా?

వి.తరుణ్‌తేజా



రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న బాధితుడు రాములు, రజక సంఘం నాయకులు

రోజురోజుకూ అగ్రవర్ణాల్లో కుల పిశాచం పెరిగిపోతున్నది. కలిసి తినే పరిస్థితి లేదు. స్వేచ్ఛగా మాట్లాడి ఒకరి భావాలు ఒకరు పంచుకునే పరిస్థితి అంతకన్నా లేదు. చివరికి కష్టపడి పని చేస్తూ నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నా సహించే పరిస్థితి లేదు. ఓ తక్కువ కులపోడు మా ఇంటి పక్కన ఉండటమా? అంటూ ఆగ్రహించారు. చిన్న సమస్యను పెద్దదిగా చేసి అనేక రకాలుగా వేధింపులకు పాల్పడ్డారు. ఈ ఘటన హైదరాబాద్ నగర శివారులోని బోడుప్పల్‌లో చోటు చేసుకుంది.

బోడుప్పల్ మండలం మారుతినగర్ కాలనీలో కలుకూరి మంగ, రాములు దంపతులు నివాస ముంటున్నారు. రజక సామాజిక వర్గానికి చెందిన వీరు కయాకష్టం చేసిన డబ్బులకు తోడు అప్పో సప్పో చేసి ఇల్లు నిర్మించుకున్నారు. ఆ కాలనీకి గతంలో రాములు అధ్యక్షుడిగా పని చేయడంతో అందరికీ మంచి పరిచయస్తులు కూడా. ఈ నేపథ్యంలో గత సంవత్సరం ఆగస్టు 26న వినాయక చవితి పండుగ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో ఓ రోజు సాయంత్రం వినాయక ఉత్సవాల్లో భాగంగా చిన్న పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమయంలో అదే కాలనీకి చెందిన అవంతికరెడ్డి వచ్చి మైక్ బంద్ చేసింది. అంతటితో ఆగకుండా రాములును టార్గెట్ చేస్తూ నానా బూతులు తిట్టింది. మండపం ప్రాంతంలో 50-60 మంది ఉన్నారు. ఉత్సాహంగా గడుపుతున్నారు. రాములు ఇంటి పక్కనే ఉండే అవంతికరెడ్డి భర్త రఘోత్తంరెడ్డి మైక్ విషయంలో గొడవకు దిగారు. మైక్ విషయంలో గొడవకు రావడం సరికాదని, ఇబ్బందికరంగా ఉంటే తీసివేసేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెబుతున్నా వినిపించుకునే సహనం కోల్పోయింది ఆ అగ్రవర్ణపు స్త్రీ. " మా మోచేతి నీళ్లు తాగే మీరు మా ఇంటి పక్కన ఉండటమేమిటీ?, మా కింద బతికేటోళ్లు మీరు, ఎక్కువ మాట్లాడితే రేప్ కేసు పెట్టి అరెస్టు చేయిస్తా" అంటూ రెచ్చిపోయింది. ఆమె మాటలు విన్నవారంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఏదైనా ఉంటే మాట్లాడుకుందాం, ఇలా గొడవకు దిగడం సరికాదని స్థానికులు ఆమెకు ఎంత చెప్పినా వినిపించుకోలేదు. దీంతో చేసేది లేక వినాయక నిమజ్జనం తర్వాత మాట్లాడుకుందాం. కేసుల జోలికి వెళ్లొద్దని రాములుకే సర్ది చెప్పి ఇంటికి పంపించారు. వినాయక నిమజ్జనం పూర్తి చేసుకున్న తర్వాత ఆ కాలనీ పెద్ద మనుషులు ఓ 20 మంది సమక్షంలో మాట్లాడేందుకు పంచాయతీ ఏర్పాటు చేశారు. అక్కడికి అవంతికరెడ్డిని రావాలని పెద్ద మనుషులు పిలిచినా వచ్చేందుకు నిరాకరించింది. "నేను పెద్ద మనుషుల వద్దకు రావడం ఏమిటి? మా పరువు బజారున పడేస్తారా? నేను రాను. మీరు ఏమైనా చేసుకోండి" అని బదులు సమాధానమిచ్చి పంపించింది. ఆమె తలలో తిరుగుతున్న కుల అహంకారపు విష పురుగు ఆమెను అంతటితో ఆగనివ్వలేదు. వీరిని ఎలాగైనా బదునాం చేయాలని రాములు అనే వ్యక్తి తనను వెంటబడి వేధిస్తున్నాడని అవంతికరెడ్డి షీటీమ్స్‌కు ఫిర్యాదు చేశారు.




బాధిత దంపతులు కలుకూరి మంగ, రాములు

ఈ కాలనీలో కలుకూరి రాములు సుమారు రెండు సార్లు కాలనీ అధ్యక్షుడిగా ఉన్నారు. అనంతరం రాంచందర్ అధ్యక్షుడయ్యారు. రాంచందర్ ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తి. ఈ నేపథ్యంలో ఆయన మాట తీరు, పద్ధతి నచ్చక కొద్ది కాలానికే దీనికి ప్రత్యామ్నాయంగా మరో కాలనీ కమిటీని ఎన్నుకున్నారు. దానికి రాములునే కారణమని రాంచందర్ మనసులో పెట్టుకున్నాడు. అవంతికరెడ్డికి కలుకూరి రాములుకు మధ్య జరుగుతున్న గొడవను ఉపయోగించుకునే పనిలో భాగంగా ఆమెకు మద్దతిస్తూ ఇలాంటి పనులన్నీ చేయిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. అవంతికరెడ్డి వెనుకాల అదే కాలనీకి చెందిన భిక్షపతిగౌడ్, అంజయ్య యాదవ్, ఉపేందర్, బచ్చు రాజేష్, పి.నర్సింహ్మారెడ్డి ఉన్నట్టు బాధితులు అనుమానిస్తున్నారు. షీటీమ్స్‌లో అవంతికరెడ్డి ఫిర్యాదు చేసిన అనంతరం పోలీసులు విచారణ చేస్తామని చెప్పినప్పుడు ఆమె స్పందించలేదు. దీంతో ఇందులో ఎలాంటి నిజం లేదని వారు కేసును మూసి వేశారు. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితం ఎంత చేసినా తన ప్రయత్నం ఫలించడంలేదని మధనపడింది. ఈ క్రమంలో అవంతికరెడ్డి ఇంట్లో ఏం జరిగిందో తెలియదు. భార్యా భర్తల మధ్య జరిగిన గొడవలతో నిద్రమాత్రలు మింగింది. ఆస్పత్రిలో చికిత్స పొందింది. దానికి రాములు కుటుంబమే కారణమని ప్రచారం చేశారు. దీనిపై అవంతికరెడ్డి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చేందుకు ప్రయత్నించగా "ముందు ఆమె ఆత్మహత్యాయత్నం చేసినందుకు కేసు నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత నిందితుడిపై కూడా కేసు పెడతాం. రెండు కేసులూ పెట్టాల్సి ఉంటుంది" అని పోలీసులు హెచ్చరించడంతో ఆ ప్రయత్నం మానుకున్నారు. ఇలా మరోటి జరిగితే తమకు ఇబ్బందులు ఎదురవుతాయని రాములు కుటంబం వాపోతున్నది.

సెల్ : 8639518341

పోలీసులు పట్టించుకోవడం లేదు



ఈ ఘటనలన్నింటిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా సీఐ జగన్నాథరెడ్డి నిర్లక్ష్యం వహిస్తున్నారు. త్వరలో సీఐపై సీపీకి, హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలనుకుంటున్నాం. రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోనూ పోలీసులకు ఫిర్యాదు చేశాం. అయినా స్పందన లేదు.

- కలుకూరి రాములు, బాధితుడు



నిరీక్షణ ముగియలేే..

- మూడో టీ20లో అమ్మాయిల ఓటమి
- సిరీస్‌పై సఫారీ ఆశలు సజీవం

నవతెలంగాణ-జోహనెస్‌బర్గ్

దక్షిణాఫ్రికా గడ్డపై ఒకే పర్యటనలో రెండు (వన్డే, టీ20) సిరీస్ విజయాలు సాధించిన తొలి జట్టుగా నిలిచేందుకు టీమ్ ఇండియా అమ్మాయిలు మరో మ్యాచ్ వరకూ నిరీక్షించాల్సిందే!. మూడో మ్యాచ్‌లోనే సిరీస్‌పై కన్నేసిన హర్మన్‌ప్రీత్ సేన వాండరర్స్ వార్‌లో ఓటమిపాలైంది. స్వల్ప స్కోర్లు నమోదైన మ్యాచ్‌లో 134 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా మరో ఓవర్ ఉండగానే ఛేదించింది. ఐదు వికెట్ల విజయంతో పొట్టి సిరీస్‌పై సఫారీ అమ్మాయిల ఆశలు సజీవంగా నిలుపుకున్నారు. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో భారత్ తొలి రెండు పోరుల్లో గెలుపొందింది. అయినా సిరీస్‌లో మనోళ్లు 2-1తో ఆధిక్యంలోనే కొనసాగుతున్నారు.

మిథాలీ విఫలం :

తొలి రెండు మ్యాచుల్లో భారత్‌ను విజయపథాన నడిపిన దిగ్గజ బ్యాట్స్‌వుమన్ మిథాలీరాజ్ (0) వాండరర్స్‌లో నిరాశపరిచింది. ఖాతా తెరవకుండానే నిష్క్రమించిన మిథాలీ వరుస అర్ధ సెంచరీల పరంపర కొనసాగించలేదు. మరో ఓపెనర్ స్మృతి మంధాన (37) ఆకట్టుకున్నది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (48, 30 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేసింది. కౌర్ తనదైన శైలిలో రెండు భారీ సిక్సర్లు కొట్టగా, మంధాన ఐదు బౌండరీలు బాదింది. దీంతో భారత్ భారీ స్కోరు దిశగా సాగింది. మంధాన, కౌర్‌లు స్వల్ప వ్యవధిలోనే వికెట్లు కోల్పోగా.. యువ క్రీడాకారిణి జెమీమా రొడ్రిగ్స్ (6) రాణించలేదు. ఈ తరుణంలో వేద కృష్ణమూర్తి (23) నాల్గు ఫోర్లతో అలరించింది. 124/5తో ఫర్వాలేదనిపించిన అమ్మాయిలు.. ఒక్కసారిగా కుప్పకూలారు. కేవలం తొమ్మిది పరుగుల వ్యవధిలోనే ఆఖరి ఐదు వికెట్లు చేజార్చుకున్నారు. సఫారీ పేసర్ షబ్నిం ఇస్మాయిల్ ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నది. మహిళల క్రికెట్‌లో ప్రపంచంలోనే వేగవంతమైన బౌలర్‌గా పేరున్న షబ్నిం భారత్ లోయర్ ఆర్డర్ పనిపట్టింది.

సూపర్ సునె :

స్వల్ప ఛేదనలో దక్షిణాఫ్రికా ఆరంభంలోనే ఓపెనర్ లీ (5)ని కోల్పోయింది. కానీ కెప్టెన్ నికెర్క్ (26), సునె లుస్ (41, 34 బంతుల్లో 5 ఫోర్లు)లు గెలుపు ఇన్నింగ్స్ ఆడారు. లక్ష్యం చిన్నదే కావటంతో ఒత్తిడి లేకుండా ఆడేసిన ఈ జోడీ రెండో వికెట్‌కు 72 పరుగులు జోడించింది. నికెర్క్ నిష్క్రమించినా డు ప్రీజ్ (20)తో కలిసి సునె మెరిసింది. ఆఖర్లో ట్రయాన్ (34) ఇన్నింగ్స్‌తో సఫారీలు లాంఛనం ముగించారు.

సంక్షిప్త స్కోర్లు : భారత్ ఇన్నింగ్స్ : 133/10 (హర్మన్‌ప్రీత్ కౌర్ 48, స్మృతి మంధాన 37, వేద కృష్ణమూర్తి 23, షబ్నిం ఇస్మాయిల్ 5/30)

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : 134/5 (సునె లుస్ 41, ట్రయాన్ 34, నికెర్క్ 26, పూజ 2/21)

సింధు, సైనాలే ఆదర్శం

ఆత్మ విశ్వాసంతో ఆడటం అలవర్చుకున్నా : హెచ్‌ఎస్ ప్రణయ్



ముంబయి : భారత అగ్ర శ్రేణి మహిళా షట్లర్లు పివి సింధు, సైనా నెహ్వాల్‌లే తనకు ఆదర్శమని బ్యాడ్మింటన్ క్రీడాకారుడు హెచ్‌ఎస్ ప్రణయ్ అన్నాడు. మెరుగైన ప్రత్యర్థులతో తలపడాల్సి వచ్చినపుడు సానుకూలంగా ఆడటం వారిని చూసే నేర్చుకున్నానన్నాడు. ఆదివారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో ప్రణయ్ మాట్లాడుతూ..'గత ఆరేండ్ల కాలంలో భారత షట్లర్లలో వచ్చిన అతి పెద్ద మార్పు.. ఆత్మ విశ్వాసంతో ఆడగలగటం. గెలుస్తామన్న నమ్మకంతో ఆడటం. ఒకప్పుడు స్టార్ షట్లర్లతో ఆడాలంటే కష్టంగా అనిపించేది. ఇపుడు పరిస్థితి మరోలా ఉంది. కఠిన ప్రత్యర్థి ఎదురైతే ఆత్మ విశ్వాసం రెట్టింపవుతోంది. తొలి నాళ్లలో అగ్ర శ్రేణి క్రీడాకారులతో తలపడతానని అనుకోలేదు. ఆత్మ విశ్వాసంతో దూకుడుగా ఆడటం అలవాటైంది. దీనికి ప్రధాన కారణం సింధు, సైనాలే. ఎందుకంటే వాళ్లే సూపర్ సిరీస్‌ల్లో గెలుపొందారు, చైనా సహా ఇతర దేశాల నాణ్యమైన షట్లర్స్‌పై విజయాలు నమోదు చేశారు. సింధు, సైనా ప్రదర్శనలతో మిగతా భారత షట్లర్లలో నమ్మకం పెరిగింది. మేమూ సాధించగలమనే విశ్వాసం పెరిగింది. అదే భారత షట్లర్ల తాజా విజయాలకు కారణం' అని ప్రణయ్ తెలిపాడు.

సూసైడ్ చేస్కుంటానన్న అథ్లెట్

సిల్వర్ సాధించింది!



న్యూఢిల్లీ : సరిగ్గా నెలక్రితం.. ఈ ఏడాది గోల్డ్ కోస్ట్‌లో జరుగనున్న కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే ఆటగాళ్ల జాబితా వెల్లడైంది. అందులో తన పేరు లేదంటూ ఓ క్రీడాకారిణి వాపోయింది. కామన్‌వెల్త్ గేమ్స్‌లో పాల్గొనటానికి అన్ని అర్హతలున్నా తన పేరును తొలిగించటంతో ఆవేదన చెందింది. తిరిగి జాబితాలో తన పేరును చేర్చకపోతే భారత ఒలింపిక్ అసోసియేషన్ ఆఫీసు ముందు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. కట్ చేస్తే.. నెల తర్వాత దుబాయ్‌లో జరిగిన పారా పవర్ లిఫ్టింగ్ ప్రపంచ కప్‌లో ఆ అమ్మాయి రజతం గెలిచింది. 80 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి భారత దేశ కీర్తిని అంతర్జాతీయ వేదిక మీద ఇనుమడింపజేసింది. ఆమె మరెవరో కాదు, గ్లాస్గో కామన్‌వెల్త్ గేమ్స్‌లో లైట్ విభాగంలో కాంస్య నెగ్గి రికార్డు సృష్టించిన 28 ఏండ్ల పారా పవర్ లిఫ్టర్ సకినా కాటూన్. గత నెల వివాదం అనంతరం సకినా.. ప్రధాని మోడీ సహా పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియాకు ఉత్తరాలు రాసింది. గోల్డ్ కోస్ట్ గేమ్స్‌కు తనను ఎంపిక చేయాలని కోరింది. అయితే, ఇప్పటి వరకూ అధికారుల నుంచి ఆమెకు ఎలాంటి జవాబు రాలేదు. తాజా విజయంతోనైనా, కామన్‌వెల్త్ గేమ్స్‌లో తనకు ఎంట్రీ లభిస్తుందని సకినా ఆశాభావంతో ఉన్నది.

ఫెడరర్‌దే టైటిల్

రోటర్‌డామ్ ఫైనల్లో దిమిత్రోవ్ చిత్తు



రోటర్‌డామ్ : లేటు వయసులోనూ అద్భుత ఫామ్‌తో చెలరేగుతోన్న స్విస్ దిగ్గజం ఖాతాలో మరో టైటిల్ చేరింది. తాజా ప్రపంచ నెంబర్ వన్ రోజర్ ఫెడరర్.. రోటరడామ్ ఓపెన్‌లో రెండో సీడ్ గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా)ను టైటిల్ పోరులో 6-2, 6-2తో చిత్తు చేశాడు. గంటలోపే ముగిసిన ఏకపక్ష ఫైనల్ మ్యాచ్‌లో ఫెడరర్ తనదైన షాట్లతో విరుచుకుపడ్డాడు. ఒక్క తప్పిదమూ చేయకుండా మూడు ఏస్‌లు సంధించాడు. అంతకు ముందు జరిగిన సెమీస్‌లో ఫెడరర్‌ను అన్‌సీడెడ్ ఆండ్రియాస్ సెప్పీ (ఇటలీ) కాస్త ఇబ్బంది పెట్టాడు. తొలి సెట్లో 6-3తో సులువుగా నెగ్గాడు ఫెడరర్. కానీ పుంజుకున్న సెప్పీ 6-7తో రెండో సెట్లో గట్టి పోటీనిచ్చాడు. అయితే టైబ్రేకర్‌లో మాత్రమే ఫెడరర్‌దే పైచేయి అయింది. 7-3 విజయంతో టైబ్రేకర్ నెగ్గిన ఫెడరర్ అదే జోరుతో ఫైనల్లోనూ గెలుపొంది రోటరడామ్ ఓపెన్ టైటిల్ సొంతం చేసుకున్నాడు.

ఫార్మాట్ మారింది, కానీ మనోళ్ల ప్రదర్శన ఏమాత్రం తగ్గలేదు. మరింత దర్జాగా, మరింత దూకుడుగా చెలరేగారు. శిఖర్ ధావన్ (72) అర్ధ సెర ˜రీతో చెలరేగిన వేళ టీమ్ ఇండియా 203 పరుగుల భారీ స్కోరు చేసింది. బంతితో భువనేశ్వర్ (5/24) మెరుపు ప్రదర్శనతో విజృంభించటంతో సఫారీలు 175 పరుగులకే పరిమితమయ్యారు. తొలి టీ20లో ఏకపక్ష విజయం సాధించిన కోహ్లిసేన సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది.



భువనేశ్వర్ (5/24)

దర్జాగా దంచేశారు



శిఖర్ ధావన్ 72
(39 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లు)

- ధావన్ అర్ధ సెంచరీ, భువి ఐదు వికెట్ల జోరు
- తొలి టీ20లో 28 పరుగులతో ఘన విజయం
- పొట్టి సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సొంతం

నవతెలంగాణ-జోహనెస్‌బర్గ్

సఫారీ గడ్డపై మరో సిరీస్ విజయం దిశగా కోహ్లిసేన తొలి అడుగు వేసింది. దక్షిణాఫ్రికాతో తొలి టీ20లో ఏకపక్ష విజయం సాధించిన టీమ్ ఇండియా పొట్టి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. ఓపెనర్ శిఖర్ ధావన్ (72, 39 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీతో చెలరేగటంతో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఐదు వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. కెప్టెన్ కోహ్లి (26), రోహిత్ శర్మ (21) క్రీజులో ఉన్నంతసేపు ఆకట్టుకున్నారు. భారీ ఛేదనలో స్వింగ్‌స్టర్ భువనేశ్వర్ (5/24) దెబ్బకు సఫారీలు విలవిల్లాడారు. ఐదు వికెట్ల ప్రదర్శనతో రెచ్చిపోయిన భువి.. ప్రత్యర్థిని 175 పరుగులకే పరిమితం చేశాడు. సఫారీ ఓపెనర్ హెండ్రిక్స్ (70, 50 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) మెరిసినా ప్రయోజనం దక్కలేదు. సిరీస్‌లో రెండో టీ20 బుధవారం జరుగుతుంది.

ఆహా భువి : భారీ విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా ఆరంభంలోనే ఓపెనర్‌ను కోల్పోయింది. మూడు బౌండరీలతో జోరందుకున్న జాన్ జాన్ స్మట్స్ (14)ను భువనేశ్వర్ వెనక్కి సాగనంపాడు. తర్వాత వచ్చిన కెప్టెన్ డుమిని (3)ని చూడచక్కని క్యాచ్‌తో రైనా అవుట్ చేశాడు. ప్రమాదకర డేవిడ్ మిల్లర్ (9)నూ మనోళ్లు ఎంతోసేపు క్రీజులో నిలువనీయలేదు. కానీ యువ సంచలనం రీజా హెండ్రిక్స్ (70, 50 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడి సఫారీని రేసులో నిలిపాడు. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 37 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన హెండ్రిక్స్.. బెహర్డీన్ (39, 27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) తోడుగా రెచ్చిపోయాడు. వీరిద్దరి మెరుపులతో దక్షిణాఫ్రికా మిడిల్ ఓవర్లలో మ్యాచ్‌పై పట్టు సాధించింది. పాండ్య, చాహల్ ఓవర్లలో ధారాళంగా పరుగులు రాబట్టుకున్నారు. బెహర్డీన్ బెడద తప్పినా.. హెండ్రిక్స్ జోరు తగ్గలేదు. ఇతడికి క్లాసెన్ (16) కాసేపు సహకారం అందించాడు. ఆఖర్లో సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగినా.. భువనేశ్వర్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్లో దక్షిణాఫ్రికా ఏకంగా నాల్గు వికెట్లు కోల్పోయింది. హెండ్రిక్స్, క్లాసెన్, మోరీస్ (0) సహా పాటర్సన్ (1)లు వికెట్లు కోల్పోయారు. దీంతో మరో రెండు ఓవర్లు ఉండగానే సఫారీ కథ లాంఛనంగా ముగిసింది.

శిఖర్ చెడుగుడు : టాస్ నెగ్గిన దక్షిణాఫ్రికా తొలుత భారత్‌కు బ్యాటింగ్ అప్పగించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (21, 9 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), శిఖర్ ధావన్ (72, 39 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) శుభారంభాన్ని అందించారు. తొలి ఓవర్‌లో రెచ్చిపోయిన రోహిత్ శర్మ ఓ సిక్సర్, రెండు ఫోర్లు బాదాడు. తర్వాత వచ్చిన డాలానూ స్టాండ్స్‌లోకి పంపించి ధనాధన్ అనిపించాడు. కానీ అతడి ఓవర్లోనే వికెట్ కోల్పోయి వెనుదిరిగాడు. అయినా భారత్ జోరు ఏమాత్రం తగ్గలేదు. కమ్‌బ్యాక్ హీరో సురేశ్ రైనా (15, 7 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) వస్తూనే సిక్సర్‌తో అలరించాడు. మరో రెండు ఫోర్లు కొట్టి ఊపుమీద కనిపించినా.. బంతిని గాల్లోకి లేపి వికెట్ కోల్పోయాడు. కెప్టెన్ కోహ్లి (26, 20 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), ధావన్‌లు మూడో వికెట్‌కు అర్ధ సెంచరీ భాగస్వామ్యం నమోదు చేశారు. స్పిన్నర్ షంషి బౌలింగ్‌లో బౌండరీ లైన్ వద్ద బెహర్డీన్ క్యాచ్ వదిలేయటంతో బతికిపోయిన కోహ్లి.. అదే ఓవర్లో అద్భుత సిక్సర్ సంధించాడు. నెమ్మదిగా దూకుడు పెంచిన ధావన్ ధాటిగా పరుగులు తీశాడు. ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 27 బంతుల్లో శిఖర్ ఫిఫ్టీ మార్క్ చేరుకున్నాడు. కుదురుకున్నట్టే కనిపించిన కోహ్లి ఎల్బీగా వెనుదిరిగాడు. పవర్ ప్లే ముగిసేసరికి 78/2తో ఉన్న భారత్, 8.2 ఓవర్లలోనే వంద పరుగులు దాటేసింది. అర్ధ సెంచరీ తర్వాత ధావన్ మరింత దూకుడుగా ఆడినా.. వికెట్ల వెనకాల అలవోక క్యాచ్‌తో వెనుదిరిగాడు. దీంతో భారత్ స్కోరు వేగం నెమ్మదించింది. మనీశ్ పాండే (27 బంతుల్లో 29 రన్స్), ఎం.ఎస్ ధోని (11 బంతుల్లో 16 పరుగులు) ఆశించిన మేరకు మెరువలేదు. ఆఖర్లో సఫారీ బౌలర్లు సైతం కట్టుదిట్టంగా బంతులేశారు. దీంతో పరుగులు అంత సులువుగా రాలేదు. ఆఖర్లో పాండ్య (13) రెండు ఫోర్లతో ధనాధన్ ముగింపునిచ్చినా.. మరో 20 పరుగులు తక్కువ చేశామనే భావన భారత్‌లో కనిపించింది. పాండే, పాండ్య అజేయంగా నిలువగా భారత్ 203 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో డాలా రెండు వికెట్లు తీసుకోగా.. మోరీస్, ఫెలుక్వాయో, షంషిలు తలా ఓ వికెట్ కూల్చారు.

'ఐదు వికెట్లు కూల్చటం అమోఘంగా అనిపిస్తోంది. గుడ్ లెంగ్త్‌లో బంతులేయాలని అనుకున్నా, ఫలితం ఇలా వచ్చింది. ప్రత్యర్థి బౌలర్లు ఎలా బంతులేస్తున్నారు, పిచ్ ఎలా స్పందిస్తోందని అంచనా వేసి మేం ఒక ప్రణాళిక ప్రకారం వచ్చాం. అది పని చేసింది. క్లిష్ట పరిస్థితుల్లో బౌలింగ్ చేయటాన్ని ఆస్వాదిస్తాను. సీమ్ రాబట్టడంపై ఏడాదిగా చెమటోడ్చాను. ఈ రోజుల్లో వికెట్లు తీయాలంటే కొత్త మార్గాలు కనిపెట్టాలి'

- భువనేశ్వర్ కుమార్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్



భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (సి) క్లాసెన్ (బి) డాలా 21, శిఖర్ ధావన్ (సి) క్లాసెన్ (బి) ఫెలుక్వాయో 72, సురేశ్ రైనా (సి,బి) డాలా 15, విరాట్ కోహ్లి (ఎల్బీ) షంషి 26, మనీశ్ పాండే నాటౌట్ 29, ఎం.ఎస్ ధోని (బి) మోరీస్ 16, హార్దిక్ పాండ్య నాటౌట్ 13, ఎక్స్‌ట్రాలు : 11, మొత్తం : (20 ఓవర్లలో 5 వికెట్లకు) 203.

వికెట్ల పతనం : 1-23, 2-49, 3-108, 4-155, 5-183.

బౌలింగ్ : పాటర్సన్ 4-0-48-0, జూనియర్ డాలా 4-0-47-2, క్రిస్ మోరీస్ 4-0-39-1, షంషి 4-0-37-1, ఫెలుక్వాయో 2-0-16-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : జాన్ జాన్ స్మట్స్ (సి) ధావన్ (బి) భువనేశ్వర్ 14, హెండ్రిక్స్ (సి) ధోని (బి) భువనేశ్వర్ 70, డుమిని (సి) రైనా (బి) భువనేశ్వర్ 3, డెవిడ్ మిల్లర్ (సి) ధావన్ (బి) పాండ్య 9, బెహర్డీన్ (సి) పాండే (బి) చాహల్ 39, క్లాసెన్ (సి) రైనా (బి) భువనేశ్వర్ 16, ఫెలుక్వాయో (సి) చాహల్ (బి) ఉనద్కత్ 13, క్రిస్ మోరీస్ (సి) రైనా (బి) భువనేశ్వర్ 0, పాటర్సన్ రనౌట్ (ధోని/పాండ్య) 1, డాలా నాటౌట్ 2, షంషి నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 08, మొత్తం : (20 ఓవర్లలో 9 వికెట్లకు) 175.

వికెట్ల పతనం : 1-29, 2-38, 3-48, 4-129, 5-154, 6-158, 7-158, 8-159, 9-175.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 4-0-24-5, జైదేవ్ ఉనద్కత్ 4-0-33-1, బుమ్రా 4-0-32-0, హార్దిక్ పాండ్య 4-0-45-1, చాహల్ 4-0-39-1.

ఏబీ అవుట్



గాయాల బారిన పడిన దక్షిణాఫ్రికా ఆటగాళ్ల జాబితా పెరుగుతూనే ఉన్నది. మూడో టెస్టులో గాయపడి తొలి మూడు వన్డేలకు దూరమైన స్టార్ బ్యాట్స్‌మన్ ఏబీ డివిలియర్స్.. తాజాగా మరో గాయంతో టీ20 సిరీస్ నుంచి తప్పుకున్నాడు. ఐదో వన్డేకు ముందు బ్యాటింగ్ ప్రాక్టీస్‌లో ఏబీ ఎడమ మోకాలి గాయానికి గురయ్యాడు. కానీ ఫిట్‌నెస్ పరీక్ష పాసై ఆఖరి రెండు వన్డేల్లో పాల్గొన్నాడు. ప్రస్తుతం గాయం తీవ్రం కావటం, సిరీస్ ముగిసిన వారంలోపే ఆస్ట్రేలియాతో టెస్టులు ఆడాల్సి ఉన్న నేపథ్యంలో సెలక్టర్లు ఏబీకి విశ్రాంతినిచ్చారు. అతడి స్థానంలో మరో ఆటగాడిని జట్టులోకి తీసుకోలేదు. డుప్లెసిస్, స్టెయిన్, డికాక్‌లు గాయాలతో భారత్‌తో సిరీస్‌కు దూరమైన సంగతి తెలిసిందే.

కోహ్లికి గాయం



భారత కెప్టెన్ విరాట్ కోహ్లి గాయానికి గురయ్యాడు. తొలి టీ20లో వికెట్ల మధ్య పరుగు తీస్తున్న సమయంలో కోహ్లి అసౌకర్యానికి గురయ్యాడు. అతడు ఎడమ పిరుదు నొప్పితో బాధపడ్డాడు. జట్టు ఫిజియో అవసరమైన చికిత్స అందించాడు. ప్రస్తుతం విరాట్ ఫిట్‌నెస్‌పై ఆందోళన అక్కర్లేదని, గాయం తీవ్రమైనది కాదని బీసీసీఐ వెల్లడించింది.



ఓడినా.. ఫైనల్లో ప్రవేశం

హామిల్టన్ : ముక్కోణపు టీ20 సిరీస్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ ఓడినా తుది పోరులో నిలిచింది. ఇంగ్లాండ్‌తో జరిగిన ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 2 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. అయినా, నెట్ రన్‌రేట్‌లో ఇంగ్లీష్ జట్టు కంటే మెరుగైన స్థితిలో ఉన్న కివీస్ ఫైనల్లోకి ప్రవేశించింది. లీగ్ దశలో కివీస్, ఇంగ్లాండ్‌లు చెరో విజయమే సాధించగా.. మరో జట్టు ఆస్ట్రేలియా అన్నింటా గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ ఇయాన్ మోర్గాన్ (80 నాటౌట్, 46 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లు), మలన్ (53, 36 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో చెలరేగటంతో 194 పరుగులు చేసింది. ఛేదనలో గప్టిల్ (62), మన్రో (57) మళ్లీ మెరిసినా న్యూజిలాండ్ 192 పరుగులే చేసింది. ఆఖరి ఓవర్లో 12 పరుగులు చేయాల్సి ఉండగా కివీస్ 9 పరుగులే చేసింది. బుధవారం జరిగే ఫైనల్లో ఆస్ట్రేలియాతో న్యూజిలాండ్ తలపడనున్నది. మోర్గాన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.